ఆదివారం

ప్రజాశక్తి

30 సెప్టెంబర్, 2001

కోర్టు తీర్పులు - రాజకీయ మార్పులు

శుభాకాంక్షలతో...

వారేవా!! రుచిలో అద్భుతం...

ఎల్లవేళలా అద్భుతం...

క్రేన్

వక్కపలుకులు

వీటికి సాటి మరేవి లేవు!

www.craneindia.com

జిల్లా ప్రాథమిక విద్యా కార్యక్రమము నల్గొండ



1. అమ్మాయిల చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిద్దాం
   - వివక్షతను రూపు మాపుదాం

2. సమాజంలో బాలికల విద్యకు ప్రాముఖ్యతను నివ్వండి
   - అందరు ఆడపిల్లలను బడిలో చేర్పించండి

3. బాల్య వివాహాలను అరికట్టండి
   - ఆడ పిల్లల విద్యకు చేయుత నివ్వండి.

ఇంటి పనులు, పొలం పనులు

పిల్లలవికావు! పెద్దలవి!

పిల్లలపై పని భారం వద్దు ____________

____________ బాల్యం పిల్లల హక్కు

పిల్లలచే పని చేయించడం చట్టరీత్యా నేరం

పనికెందుకు తొందర - బడికి పద ముందర

జిల్లా కలెక్టరు & చైర్మన్

జిల్లా ప్రాథమిక విద్యా కార్యక్రమము, నల్గొండ, ఆం.ప్ర.

ప్రదర్శన

మనలో మాట

ఏదో పనిమీద రోడ్డు మీద నడుస్తూ వెళ్తున్నాను. ఆ రోజు ఎండ మహా తీవ్రంగా వుంది. నా చిన్ననాటి మిత్రుడు రామారావు ఆ దగ్గర్లోనే ఉంటున్న విషయం అనుకోకుండా గుర్తుకొచ్చింది. స్వంతంగా ఇల్లు కూడా కొనుక్కున్నానని ఆ మధ్య ఫోన్లో చెప్పాడు. ఇల్లు చూసినట్లుగా ఉంటుంది, కొంచెం సేద దీరినట్లుగానూ ఉంటుందని అటువైపుకు మళ్ళాను. రామారావు దంపతులిద్దరూ సంపాదనాపరులే. వారికిద్దరు పిల్లలు. నేవెళ్ళేసరికి రామారావు, అతగాని చిన్న కూతురు మాత్రమే ఇంట్లో వున్నారు. నన్ను చూడగానే ఎంతో సాదరంగా ఆహ్వానించాడు. 'అంకుల్ నేను చిన్న నాటి స్నేహితులం' అంటూ వాళ్ళమ్మాయికి పరిచయం చేశాడు. అంకుల్‌కి మంచినీళ్ళు తెచ్చిపెట్టు అని పురమాయించాడు. చల్లటి నీళ్ళు తాగేసరికి ప్రాణం ఒక్కసారిగా కుదుట పడినట్లయింది. ఇంతలోనే రామారావు సంభాషణ ఆరంభించాడు. ఫ్రిజ్‌లో మినరల్ వాటర్ బాటిల్స్ పెడుతున్నాము. ఫిల్టరు వాటరును కూడా నమ్మలేకపోతున్నాము. అందుకే ఫిల్టరు తీసి మూలపడేసి అంతా మినరల్ వాటరే తాగుతున్నాము అని చెప్పుకొచ్చాడు. తనే లేచి ఏ.సి. ఆన్ చేశాడు. అంకుల్ వచ్చి ఇంత సేపయినా ఏ.సి. వెయ్యలేదేమిటమ్మా అని కూతురుని ప్రేమగా కసురుకున్నాడు. ఏ.సి. లేకపోతే ఒక్క నిమిషం గడిచేట్టు లేదురా అంటూ నా వైపుకి తిరిగి అన్నాడు. ఇంతలోనే వాళ్ళమ్మాయి ప్లేట్లో యాపిల్ ముక్కలు తెచ్చి నా ముందు పెట్టింది. ఒక్క ముక్క తీసుకొని కొరికాను. బహురుచిగా వుంది. ఇవి ఇంపోర్టెడ్ యాపిల్ పళ్ళురా. కేజి నూటయాభై. ఒకేసారి తెచ్చిపడేస్తాను. నీవల్లా యాపిల్ పళ్ళకు ఆస్ట్రేలియా పళ్ళకు పోలికే లేదనుకో అంటూ మొదలుపెట్టాడు. ఆ తర్వాత ఇల్లంతా తిప్పి చూపించాడు. ఫర్నిచరు ఇంపోర్టెడ్ మెటీరియల్‌తో చేయించాము. వుడ్‌వర్క్‌కే ఏడు లక్షలయ్యాయంటూ చెప్పుకుపోతున్నాడు. చిన్ననాటి స్నేహితుడు ఇంత చక్కటి ఇల్లు కట్టుకున్నందుకు సంతోషంగానే ఉన్నప్పటికీ వాడి ప్రదర్శనాభిలాష మాత్రం నన్ను చాలా ఇబ్బంది పెట్టింది. ఆ ఇబ్బంది ముఖంలో కనపడనివ్వకుండానే మిత్రుడి వద్ద సెలవు తీసుకొని ఇంటి ముఖం పట్టాను.

ఇది ఒక రకం ప్రదర్శన మాత్రమే. ప్రతి రంగంలోను ప్రదర్శకులు మనకు నిత్యం కనిపిస్తారు. సాహిత్యమూ, కళలు, పాండిత్యము, రాజకీయాలు ఇలా ఒకటేమిటి ప్రతిచోట తమ గొప్పతనాన్ని చాటుకోవడానికి తెగ తాపత్రయపడే వాళ్ళు తారసపడుతూనే ఉంటారు. తమకున్న ప్రతిభను చాటు కోవాలనుకునే వారు కొందరయితే, ఉన్నదానికి కొన్ని రెట్లు ప్రచారం చేసుకోవాలనుకునే వారు మరికొందరు. ఇంకొందరు అసలు తమకు లేని ప్రతిభను ఉన్నట్లు చూపుకోవడానికి తంటాలు పడుతుంటారు. దానికి వారు అనుసరించే మార్గాలు అనేకం. నాకు తెలిసిన ఒకాయన వున్నాడు. వేదాల్లో ఇలా ఉంది, ఉపనిషత్తుల్లో అలా ఉంది అంటూ శ్లోకాలు ఏకరువుపెడుతుంటాడు. సంస్కృతంలో ఓనమాలు తెలియని నాబోటి వాళ్ళకి ఆ శ్లోకం అర్థం ఏమిటో ఏ మాత్రం అంతుబట్టదు. నిజానికి ఆ శ్లోకం అర్థం ఆ చెప్పే ఆయనకూ తెలియదు. ఆయనకు వచ్చిందల్లా అటువంటి కొన్ని శ్లోకాలను వల్లెవేయడమే. అయినప్పటికీ ఆయన వేదాలనూ, ఉపనిషత్తులను ఔపోసన పట్టిన వాడిలా పోజు పెడతాడు. అలాగే మా లెక్చరర్ ఒకాయన వున్నాడు. ఆయన క్లాసులో ఇంగ్లీషు, గ్రీకు, లాటిన్ గ్రంథాల నుండి కొటేషన్లను ఏకధాటిగా ఉటంకిస్తాడు. ఆయన బహుభాషా పాండిత్యానికి మనం నిజంగా ముక్కున వేలేసుకోవలసిందే. కాని కొద్దిరోజుల క్రితం ఏదో పని మీద ఆయనింటికి వెళ్ళాను. అప్పుడు ఆయన ఇంట్లో లేరు. ఆయన శ్రీమతిగారు మాత్రమే ఉన్నారు. ఆహ్వానించి డ్రాయింగ్ రూంలో కూర్చోమన్నారు. ప్రక్కనే పుస్తకాల బీరువా కూడా ఉంది. ఏయే పుస్తకాలున్నాయో ఆసక్తి కొద్దీ పరిశీలించాను. అందులో కొటేషన్ల పుస్తకం ఒకటి బయటపడింది. తీసుకొని తిరగేస్తే, ప్రతిరోజూ ఆయన వల్లెవేసే కొటేషన్లన్నీ అందులో కనిపించాయి. ఆయన పాండిత్యం బండారం అప్పుడు గాని నాకుతెలిసి రాలేదు. తమ స్థితిగతులను, ప్రతిభను, పాండిత్యాన్ని ఇలా ప్రదర్శించుకోవాలనుకోవడం నిజంగా ఒక రకమైన ఆత్మన్యూనతా భావం నుండే ఉద్భవిస్తుంది. ఆత్మవిశ్వాసం మెండుగా వున్న ఏ వ్యక్తీ తనను తాను ప్రదర్శించుకోవాలని ప్రయత్నించడు. ఎప్పుడూ ఒకేలా ఉంటాడు. ప్రదర్శన కోసం ఉబలాట పడే వ్యక్తి మాత్రం తన స్థితి తారుమారయితే కుప్పకూలిపోతాడు. ☆

లోపలి పేజీల్లో.....

ప్రేమికులకు ఉరి ...8

పిల్లలకు ఎలాంటి కథలు చెప్పాలి ...10



కనువిందు చేసే కైలాస గిరి ...16

సాదాసీదాగా సప్తమ రాష్ట్రస్థాయినాటికల పోటీలు .. 21

ఇంకా...

బాలకథ 11

బాల నేస్తాలు 12, 13

క్రీడా రంగం 17

కథ 18, 19

పుస్తకపరిచయం 20

అదాలత్ కథలు 22, 23

పలుకుబడి 24

వగైరా........

కోర్టు తీర్పులు రాజకీయ మార్పులు

తెలకపల్లి రవి

న్యాయస్థానాల తీర్పులు ప్రభుత్వాధినేతల భవితవ్యాలను ప్రభావితం చేయడం కొత్తగాకున్నా రాయ్‌బరేలి నుంచి ప్రధాని ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని 1975లో అలహాబాదు హైకోర్టు న్యాయమూర్తి సిన్హా తీర్పు ఇచ్చిన తర్వాత వాటి ప్రభావం చాలా పెరిగింది. తర్వాతి కాలంలో చాలా మంది ముఖ్యమంత్రులు, రాష్ట్ర, కేంద్ర మంత్రులు కోర్టుతీర్పుల కారణంగా వైదొలగవలసి వచ్చింది. పి.వి.నరసింహారావు పాలన చివరి దశలో తామరతంపరగా అవినీతి కుంభకోణాలు వెల్లడై న్యాయస్థానాలు ప్రజా ప్రయోజన వాజ్యాలు (పబ్లిక్ ఇంట్రస్ట్ లిటిగేషన్స్) స్వీకరించి తీర్పులు ఇవ్వడం ప్రారంభించాక ఈ క్రమం మరింత వేగవంతమైంది. క్రియాశీల న్యాయవ్యవస్థ అనేది రాజకీయాలలో అవిభాజ్య భాగంగా మారిపోయింది. వివాదాస్పదమైన కీలక అంశాలలో కోర్టులు అభిప్రాయం చెప్పాకగాని అంతిమ నిర్ణయానికి రాలేని స్థితి ఏర్పడింది. ఇప్పుడు తమిళనాడు ముఖ్య మంత్రిగా జయలలిత నియామకాన్ని కొట్టివేస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగరీత్యానూ రాజకీయం గానూ కూడా అసాధారణమైంది; నిర్ణయాత్మకమైంది. పదవిలో వున్నవారిని మార్చడం. కూల్చడంకాక అసలు ఆ పదవిలో నియమించడంపైనే వచ్చిన వివాదమిది. దేశ చరిత్రలో తొలిసారిగా ఒక ముఖ్యమంత్రిని రాజీనామా చేయకుండానే ఉన్న ఫలాన తొలగించిన మొదటి సంఘటన ఇది.

టాన్సీ అవినీతి కేసులో మూడేళ్ల జైలుశిక్ష పడిన జయలలిత ఆ శిక్ష పూర్తిగా కొట్టివేయబడి నిర్దోషి అని కోర్టులో నిర్ధారించబడేవరకు శాసన సభ్యురాలు కావడానికి అర్హత లేదని, అందువల్ల ఆమె ముఖ్యమంత్రిగా నియమించ బడడం చెల్లదని సుప్రీం కోర్టు ధర్మాసనం తీర్పు తేల్చి చెప్పింది. అందుకు అనుగుణంగానే జయలలిత వైదొలగి తనకు విధేయుడైన పన్నీర్ సెల్వంను ముఖ్య మంత్రిగా కూచో బెట్టారు. ఇది తాత్కాలిక ఏర్పాటు మాత్రమేనని, నిర్దోషిత్వం నిరూపించుకుని తాను తిరిగి అధికారం చేపడతానని ప్రకటించారు

మొదటినుంచి వివాదమే

శాసనసభ ఎన్నికలలో అన్నాడి.ఎం.కె. అఖండ విజయం తర్వాత గవర్నర్ జస్టిస్ ఫాతిమాబీవీ 2001 మే 14 వ తేదీన జయలలితను పదవీ స్వీకారానికై ఆహ్వానించినప్పటి నుంచి ఆ నియామకం చెల్లుతుందా లేదా అనే మీమాంస సాగుతున్నది. అటూ ఇటూ కూడా బలమైన అభిప్రాయాలు వెల్లడైనాయి. అవినీతి కేసులలో రెండేళ్లకు మించి శిక్ష పడినవారు ఎన్నికలలో పోటీ చేయడానికి అనర్హులవుతారంటూ 1997 ఆగష్టులో ఎన్నికల సంఘం ఒక ఉత్తర్వు నిచ్చింది. అప్పటివరకు ఎవరైనా కింది కోర్టు తీర్పుపై స్టే తెచ్చుకుంటే పోటీచేయడానికి వీలుండేది. ఆ అవకాశాన్ని తొలగించిన ఉత్తర్వు ఎన్నికల కమిషన్ ఆదేశమే కాని పార్లమెంటు చేసిన సవరణ కాదని గమనించడం అవసరం. అది చెల్లదని, సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి వి.రామస్వామితో సహా అనేక మంది నిపుణులు అభిప్రాయపడ్డారు. పై ఉత్తర్వు ప్రకారమే జయలలిత ఎన్నికలలో పోటీ చేయడానికి దాఖలు చేసిన నామినేషన్లను రిటర్నింగ్ అధికారులు తిరస్కరించారు. ఒకచోట నేమో మూడు స్థానాలకు మించి పోటీ చేస్తున్నందుకు తిరస్కరించారు. అయినా అన్నా డి.ఎం.కె. ఏకైక అధినేత్రిగా ఆమె నాయకత్వంలోనే ఆ పార్టీ ఎన్నికల ప్రచారం జరిగి, ఘన విజయం చేకూరింది. రాజ్యాంగం 164 (4)సెక్షన్ ప్రకారం శాసన సభ్యులు కాని వారు కూడా మంత్రి పదవి చేపట్టి ఆరునెలల లోగా ఎన్నిక కావచ్చు గనక జయలలితను నియమించే అవకాశం వుందని చాలామంది భావించారు. గవర్నర్ అదే చేశారు.

అన్నా డి.ఎం.కె కు ప్రజలు అఖండ విజయం చేకూర్చాక ఆ పార్టీ నాయకురాలుగా ఎన్నికైన జయలలితను ముఖ్యమంత్రిగా నియమించకుండా నిరోధించగల నిబంధనలేవీ రాజ్యాంగంలో లేవు గనక ఫాతిమా ఆ నిర్ణయం చేయడం ఉచితమేనని పలువురు న్యాయశాస్త్ర నిపుణులు కూడా చెప్పారు. తర్వాత ఏం జరుగుతుంది, ఆరునెలల పిమ్మట ఆమె శాసనసభకు ఎన్నిక కాగలదా లేదా ఇవన్నీ ఆ క్షణంలో గవర్నర్ ముందున్న సమస్యలు కావు. అందువల్లనే ఏ మాత్రం జాప్యం లేకుండా జయలలితను ఆహ్వానించారు. ఇందుకు వ్యతిరేకంగా దాఖలైన కో వారంటో పిటిషన్ల విచారణ సెప్టెంబరు 2 న ప్రారంభించిన సుప్రీం కోర్టు 22 న తీర్పు నిచ్చింది. న్యాయమూర్తులు ఎస్.పి.బరూచా, జిబి పట్నాయక్, వై.కె.సభావల్, రామాపాల్, బ్రజేష్‌కుమార్‌లతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం తీర్పు నిచ్చింది. బరూచా బెంచి

రాలిన తలలు

గత పాతికేళ్లలోనూ అనేక మంది హేమాహేమీలపై కోర్టు తీర్పులు, అవినీతి అక్రమాల కేసుల ప్రభావం పడి వైదొలగవలసి వచ్చింది.

- ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నీలంసంజీవ రెడ్డి బస్సు రూట్ల జాతీయ కరణ కేసులో కోర్టు వ్యతిరేక వ్యాఖ్యలు చేసిన కారణంగా తప్పుకోవలసి వచ్చింది.

- 1981లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి అంతూలే సిమెంట్ కుంభకోణంలో కోర్టు తీర్పు తర్వాత దిగిపోవలసివచ్చింది. మహారాష్ట్రలోనే శరద్‌పవార్, బాబాసాహెబ్ భోంస్లే వేర్వేరు కేసులలో దిగిపోవలసి వచ్చింది.

- 1977లో కేరళ ముఖ్యమంత్రి కరుణాకరన్ రాజన్ కేసులో దిగిపోవలసి వచ్చింది.

- 1975లో ప్రధాని ఇందిరా గాంధీ ఎన్నికను అలహాబాదు హైకోర్టు కొట్టి వేసింది. దేశం తీవ్ర రాజకీయ సంక్షోభంలో కూరుకుపోవడానికి ఎమర్జన్సీ విధించడానికి దారితీసింది. రాజ్యాంగాన్ని నిరంకుశంగా సవరించి ఆమె పదవి కాపాడుకోవలసివచ్చింది.

- 1997లో బీహార్ ముఖ్యమంత్రి లల్లూయాదవ్ పశుగ్రాసం కుంభకోణం కేసులో దిగిపోయారు.

తరపునే ప్రత్యేకంగా కొన్ని అభిప్రాయాలు వెలిబుచ్చారు.

ఈ తీర్పులో ఆసక్తి కలిగించే అంశాలు చాలా వున్నాయి. మొదటిది - ఈ సమస్యకు సంబంధించి రాజ్యాంగంలో అస్పష్టత వుందని న్యాయమూర్తుల్లో ఒకరైన బరూచా ధర్మాసనం తరపున మాట్లాడుతూ దాదాపుగా అంగీకరించారు. అంటే గవర్నర్ ఆ విధంగా చేయడానికి ఎంతో కొంత అవకాశం వుందని అంగీకరించారన్నమాటే. రెండవది-జయ నియామకాన్ని రద్దు చేసినా ఆమె గత నాలుగు నెలల్లో తీసుకున్న నిర్ణయాలు అసలే తప్పుడు ఉద్దేశంతో చేసినవైతే తప్ప చెల్లుతాయని ప్రకటించింది. మూడోది- మామూలుగా ముఖ్యమంత్రి రాజీనామాతో మంత్రివర్గం మొత్తం రాజీనామా చేసినట్లు పరిగణించ బడుతుంది. కాని ఈ కేసులో అలాగాక జయలలితతో మాత్రమే రాజీనామా చేయించి ఆ స్థానంలో సెల్వంను కూచోబెట్టడం జరిగింది. నాలుగోది- మొదటిసారిగా ప్రజాతీర్పుకు సంబంధించి కోర్టు ఒక భాష్యం చెప్పింది. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా వుంటేనే ప్రజల తీర్పు చెల్లుతుందని పేర్కొంది. గవర్నర్ నిర్ణయాలు రాజ్యాంగం 361 నిబంధన ప్రకారం సమీక్షకు అతీతమైనప్పటికీ రాజ్యాంగ బద్ధంగా వున్నదీ లేనిదీ సమీక్షించవలసి వుంటుందని చెప్పింది. లిఖిత రాజ్యాంగాలు వున్న దేశాలలో కూడా అన్ని వివరాలు ముందే రాసుకోవడం సాధ్యం కాదని, అనుభవాన్ని బట్టి వివరణలు జోడించుకుంటూ సుసంపన్నం చేసుకోవాలని అదే ప్రజాస్వామ్య పద్ధతి అని చెప్పింది. ఆరు నెలల లోపు శాసనసభకు ఎన్నిక కావచ్చుననే నిబంధన సభ్యులు కాని వారి సామర్థ్యాన్ని ఉపయోగించు కోవడానికే తప్ప సభ్యులయ్యే అవకాశమే లేని వారిని మంత్రులను చేయడానికి కాదని కోర్టు వ్యాఖ్యానించింది. మే నెల నుంచి తమిళనాడులో వున్నది అవ్యవస్థ అని విమర్శించింది.

ఈ తీర్పు తర్వాత కూడా ఫాతిమాబీవీ తన చర్యను సమర్థించుకోవడం గమనార్హం. అప్పుడున్న పరిస్థితులలో ప్రజల తీర్పును జయ లెజిస్లేచర్ పార్టీ నాయకురాలిగా ఎన్నికవడమనే వాస్తవాన్ని దృష్టిలో పెట్టుకుని తాను ఆ నిర్ణయం తీసుకున్నానని ఆమె అన్నారు. ఈ వాదన ఇప్పటికీ సమంజసంగానే కనిపిస్తుంది. జయ తనకు తానుగా పదవి చేపట్టరాదని నిర్ణయించుకుని వుంటే అది వేరే సంగతి కాని ఆమె నాయకురాలిగా ఎన్నికైనాక ఆమెను ముఖ్యమంత్రిగా నియమించకుండా అడ్డుకోగల నిబంధనలేవీ లేనప్పుడు గవర్నర్ చేయగలిగింది మరేమీ లేదు. ఆమె చర్య బిజెపి కూటమికి నచ్చలేదు కనుకనే కరుణానిధి అరెస్టు రభసను సాకుగా తీసుకుని వేటువేయాలని చూశారు. అయితే తానే రాజీనామా ఇచ్చి ఫాతిమా హుందాగా వైదొలగారు.

జయ రాజకీయ జీవితంలో ఆటుపోట్లు

జయలలిత కేసులు ఇప్పుడు హైకోర్టు ముందు వున్నాయి. ఆమె నిర్దోషి అని తేలినా, శిక్ష ఏడాది లోపుగా వుండేట్లు తగ్గించినా అప్పుడు అనర్హత దానికదే తప్పిపోతుంది. అంటే సాంకేతికంగా న్యాయ పరంగా జయలలితకు అవకాశాలు ఇంకా కొంత వరకు మిగిలే వున్నాయి. పార్టీ ఆమె అదుపాజ్ఞలలోనే వుంది. కొత్త ముఖ్యమంత్రి అమాంతం కాళ్లమీద పడి ఈ విషయం నిరూపించారు. కనుక రాజకీయంగా పెద్ద మార్పు వుండదు. పురుచ్చి తలైవి రాజ్యమే కొనసాగుతుంది. మహారాష్ట్రలో శివసేనాధిపతి బాల్‌థాకరే కూడా ఎన్నికలలో పోటీకి (వేరే కారణాల వల్ల) అనర్హుడైనందున మనోహర్ జోషిని ముఖ్యమంత్రిగా కూచోబెట్టి తనే చక్రం తిప్పుతూ వచ్చారు. రిమోట్ ముఖ్యమంత్రి అని ఆయనే అన్నారు. బీహార్‌లో లల్లూ ప్రసాద్ యాదవ్ శాసనసభ్యురాలు కూడా కాని తన భార్య రబ్రీదేవిని అకస్మాత్తుగా ముఖ్యమంత్రిగా కూచోబెట్టి తర్వాత ఎన్నికలలో కూడా గెలిచి ఆమెనే కొనసాగిస్తున్నారు. సెల్వం కనీసం శాసనసభ్యుడు, మంత్రి, గతంలో మునిసిపల్ ఛైర్మన్‌గానైనా పనిచేసిన వ్యక్తి. ఆయన ప్రధాన అర్హత మాత్రం విశ్వసనీయతే. మరెవరినైనా కూచోబెడితే ఆరు మాసాల తర్వాత అద్దం తిరిగితే కష్టమన్న అభిప్రాయం వుంది. అందుకే అసలు ఎం.ఎల్.ఎ.కాని వారిని చేస్తే ఏ గొడవ వుండదని కూడా మొదట భావించారట. విద్యుత్ మంత్రి జయకుమార్,విద్యామంత్రి తంబిదురై, ఆర్థిక మంత్రి పొన్నియన్ వంటివారి పేర్లు వినిపించినా చివరకు వీరవిధేయతే పై చేయి సాధించింది. నిజానికి ఈ విధమైన ధోరణి ఇందిరాగాంధీ హయాంలోనే మొదలైంది. అప్పట్లో జాతీయ స్థాయిలో కాంగ్రెస్ ప్రాబల్యాన్ని

టాన్సీకేసు- శిక్షలు

జయలలిత రాజకీయ జీవితానికే ప్రతిబంధకంగా పరిణమించిన టాన్సీ కేసుకు దాదాపు పదేళ్ల చరిత్ర వుంది. జనతా పార్టీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్య స్వామి ఈ కేసులకు ఆదిపురుషుడు. 1991-96 మధ్య తొలిసారి జయ ముఖ్యమంత్రి అయిన కాలంలో ఇవి వెలికి వచ్చాయి. అప్పటి గవర్నర్ చెన్నారెడ్డికి స్వామి మెమోరాండాలు సమర్పించగా జయలలితపై ప్రాసిక్యూషన్ జరపడానికి 1993లో ఆయన అనుమతినిచ్చారు. తమిళనాడు స్మాల్‌స్కేల్ ఇండస్ట్రీస్ సంస్థకు పొట్టి పేరు టాన్సీ. జయలలిత, ఆమె నెచ్చెలి శశికళ భాగస్తులుగా వున్న జయ పబ్లికేషన్స్‌కు మూడు ఎకరాలకు పైగా భూమిని మార్కెట్ రేటు కన్నా మూడు కోట్ల రూపాయలు చౌకగా అప్పగించారనేది ఆరోపణ. అలాగే ఆమెకు సంబంధించిన శశి ఎంటర్‌ప్రైజెస్ సంస్థ టాన్సీ నుంచి ఒక సంస్థ తాలూకూ సామగ్రిని 60 లక్షల రూపాయలకు పైగా చౌకగా తీసుకున్నట్టు ఇంకో ముఖ్యమైన కేసు. ఇకపోతే కొడైకెనాల్‌కు చెందిన ప్లెజెంట్‌స్టే హోటల్ అక్కడ నిర్మాణ నిబంధనలకు భిన్నంగా అయిదు అంతస్తులు అదనంగా వేసుకోవడానికి ఆమె అక్రమంగా అనుమతినిప్పించారనేది ఇంకో కేసు. 1996లో అధికారంలోకి వచ్చిన డి.ఎం.కె.ప్రభుత్వం వీటిని వెంటబడి పోరాడింది. చివరకు జయలలితకు గత ఏడాది అక్టోబరులో శిక్షలు పడ్డాయి. టాన్సీ కేసులో మూడేళ్లు, శశి ఎంటర్ ప్రైజెస్ కేసులో రెండున్నరేళ్లు, ప్లెజెంట్ స్టే హోటల్ కేసులో ఏడాది జైలుశిక్షలు, జరిమానా పడ్డాయి. హైకోర్టుకు అప్పీలు చేసుకోగా అక్కడ శిక్ష అమలును మాత్రం నిలుపు చేశారు. అయితే ఎన్నికలలో పోటీకి అభ్యంతరం వుండకపోవచ్చని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. ఈ లోగా తమిళనాడులో కేంద్రంలో వచ్చిన రాజకీయ మార్పులు ఈ కేసులను ప్రభావితం చేశాయి. మొదట్లో జయ మద్దతు పొందిన వాజ్‌పేయి ప్రభుత్వం ఆమెకు అనుకూలంగా న్యాయపరమైన నియామకాలు చేసింది. కాని ఏడాదిలోనే అదంతా మారిపోయింది. గత రెండేళ్లలో ఆమెకు వ్యతిరేకంగానే నియామకాలు, అప్పీళ్లు జరుగుతూ వచ్చాయి. ఈ లోగా ఆమె తిరిగి అధికారంలోకి రావడంతో కథ మొదటికొచ్చింది

భారతదేశంలో ఒక విచిత్ర పరిస్థితి ఏమంటే అధికారంలో వున్నవారిపై కేసులు విచారించేవారు దాని మంచిచెడ్డల గురించి వారికే నివేదిస్తుండాలి. స్వతంత్ర ప్రతిపత్తి గల ప్రాసిక్యూషన్ వ్యవస్థ మనకు లేదు. అందుకే పి.వి.నరసింహారావు హయాంలో హవాలా కేసు పురోగతి తనకే నేరుగా చెప్పాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. జయలలిత తిరిగి అధికారంలోకి వచ్చాక అలాటి పాయింటు మీదనే ప్రతిష్టంభన సృష్టించబడింది. ఆమె ప్రభుత్వం నియమించిన న్యాయవాది ఈ కేసు వాదించరాదని అభ్యంతరాలు వచ్చాయి. దాంతో ఆమె హయాంలో నియమితుడైన గోమతినారాయణ్ స్థానంలో డి.ఎం.కె.హయాంలోని ప్రాసిక్యూటర్ వెంకటపతిని హైకోర్టు నియమించింది. సహజంగానే వెంకటపతి వచ్చాక కేసు వాదనలు తిరగదోడ బడ్డాయి. కేసు విచారిస్తున్న జస్టిస్ ఎస్.ఆర్.చౌదరి తొందరపెడుతున్నారని 2245 పేజీలున్న నివేదికలు చదవడానికి కూడా తనకు సమయం ఇవ్వడం లేదని ,అవసరమైన డాక్యుమెంట్లు అందజేసేందుకు నిరాకరించారని వెంకటపతి సుప్రీంకోర్టులో ఫిర్యాదు చేశారు. ఇరుపక్షాలవాదనలకు మూడేసి రోజుల చొప్పున కేటాయించి తీర్పు వారంలోగా ఇవ్వబోతున్నానని కూడా ఆయన చెప్పడం సుప్రీంకు కోపం తెప్పించింది. ఆయన కేసు పత్రాలు వివరంగా చదవడానికి వీలుగా వాయిదా వేయాలని ఆదేశించింది. ఇప్పుడు కేసు విచారణ అక్టోబరులో గాని ప్రారంభం కాదు. అంటే నవంబరు వరకు తీర్పు రావడం అసాధ్యం. నవంబరు నాటికి జయలలిత ఆరుమాసాల గడువు ముగిసిపోతుంది. ఇప్పుడు మొత్తంగానే నియామకం కొట్టివేసారు కనుక ఆ సమస్య వుండకపోవచ్చు కాని అకారణ ఆలస్యాన్ని నివారించడానికి బదులు పెరగడానికే సుప్రీం ఉత్తర్వు కారణమవుతున్నది.

బట్టి అలా చలామణి అయింది. ఇప్పుడు ప్రాంతీయ పార్టీలు వాటి నేతల ప్రాధాన్యత పెరిగాక అదే పరిణామం రాష్ట్రాల స్థాయిలోనూ జరుగుతోంది. ఇది జయలలితకు లేదా తమిళనాడుకు పరిమితమైన అంశంగా పరిహసించ నవసరం లేదు. వందిమాగధ సంస్కృతి దుష్ప్రభావంగా గుర్తించడం ముఖ్యం.

జయలలిత గతంలోనూ, ఇప్పుడు కూడా అశేష జనాదరణ పొందినప్పటికీ అనుకూల పరిస్థితులు ఎదుర్కోవడం విస్మరించరాని విషయం. రాజకీయ పాలనా పరమైన జాగ్రత్తలు సంయమనం లోపించడం వల్లనే ఇలాటి పరిస్థితి ఏర్పడుతుంది. ఆమె రాజకీయ జీవితం నిండా అంతకు ముందరి సినిమా జీవితానికి తీసిపోని మలుపులు ఆటుపోట్లు వున్నాయి. తన గురువు దైవం అని చెప్పే ఎంజిఆర్ ఆశీస్సులతో రాజ్యసభ సభ్యురాలు పార్టీ ప్రచార కార్యదర్శి అయ్యాక ఒక దశలో ఆయన కినుక వహించారు. ఇక ఆయన కదలలేనంత అస్వస్థతకు గురైనపుడు కుటుంబసభ్యులు ఆమెను వీధిలోకి నెట్టేసారు. మళ్లీ ఆయన కోలుకున్నాకే రాజకీయ ప్రాధాన్యత లభించింది. ఎం.జి.ఆర్ మరణానంతరం ఆయన భార్య జానకి అమ్మాల్ వర్గీయులు జయను బయిటకు నెట్టి అధికారం కూడా కైవసం చేసుకోగలిగారు. అయితే జనాదరణ, శాసనసభ్యుల మద్దతు లేకుండానే ముఖ్యమంత్రి పదవి సంపాదించిన జానకి దిగిపోవలసి వచ్చింది. తర్వాతి ఎన్నికలలో జయ-జానకి వివాదం మధ్య ప్రజలు కరుణానిధికి ఘనవిజయం చేకూర్చారు. ఆ కాలంలోనే ఆమెను అసెంబ్లీలో అవమానించి పంపించారు. తర్వాత ఎన్నికలలో డి.ఎం.కె. రెండంటే రెండు స్థానాలకు పడిపోగా జయ అఖండ విజయం సాధించి అధికారం చేపట్టారు. అయితే స్నేహితురాలు శశికళ తదితరుల ప్రభావం అవినీతి ఆరోపణలు, ఏకపక్ష చర్యలు ఆమె పట్ల ప్రజలలో వ్యతిరేకత పెంచాయి. 1996 ఎన్నికలలో మళ్లీ కరుణానిధి గెలవడంతో చరిత్ర పునరావృతమైంది. అయిదేళ్లలో ఆమె తమిళనాడులోనే కాక జాతీయ రాజకీయాలలోనూ ముఖ్య పాత్ర పోషించారు. 1998 తర్వాత బి.జె.పి. నుంచి విడివడి లౌకిక శక్తులకు దగ్గరయ్యారు. గత ఎన్నికలలో ఘనవిజయానికి నాయకత్వం వహించారు. అయితే కరుణానిధి అరెస్టు సందర్భంగా జరిగిన ఘటనలు, తర్వాత డి.ఎం.కె.ర్యాలీ హింసాకాండ, మీడియా ప్రతినిధులపై దాడులు ఇలాటివి ఇప్పుడు కూడా ఆమెకు చిక్కులు తెచ్చిపెట్టాయి. అవినీతికేసులు వెన్నాడుతూనే వచ్చాయి. గతంలో తమతో స్నేహంగా వుండి తర్వాత పడిపోవడానికి కారణమైన జయలలిత పైన కేంద్రంలోని బిజెపి కూటమి ప్రత్యేకంగా కక్షగా వుంది. కోరలూడిన సింహంలాటి కరుణానిధి డి.ఎం.కె. సంగతి చెప్పనవ నరంలేదు. ఇలాటి పరిస్థితులలో సుప్రీంకోర్టులో జయలలితకు వ్యతిరేకంగా తీర్పు రావడం రాజకీయంగా నష్టమే. అందుకే ఈ తీర్పుపై బిజెపి డిఎంకెలు ఎగిరెగిరి గంతులేస్తున్నాయి. నిజానికి ఈ విషయంలో బిజెపి రెండు నాల్కలతో వ్యవహరిస్తోంది. జయ తమతో వున్నప్పుడు కేసులు వెనక్కుపెట్టడానికి న్యాయవ్యవస్థలో మార్పులు చేయడానికి పాల్పడింది. ఆమె దూరమయ్యాక డి.ఎం.కె.తో కుమ్మక్కయి కేసులను ఉపయోగించి ఇరకాటంలో పెట్టడానికి తంటాలు పడింది. న్యాయ మూర్తులనియామకాలనూ ప్రభావితం చేసింది. వామపక్షాలు ఈ కేసుల విషయంలో ఎప్పుడూచట్టం తన పని తాను చేసుకుపోవాలన్న ఒకే వైఖరితో వున్నాయి.

ఇప్పటికీ సమస్యలు

సుప్రీం కోర్టు తీర్పు మేరకు జయలలిత వైదొలగినప్పటికీ సమస్య తీరినట్టుకాదు. రేపు హైకోర్టులో ఆమె నిర్దోషిగా తేలితే అప్పుడు సమస్య పునరావృత మవుతుంది. మరో సమస్య రిటర్నింగ్ ఆఫీసర్ల విచక్షణాధికారాన్ని వినియోగించడంలో తప్పు చేస్తే అప్పుడు అభ్యర్థులకు అన్యాయం జరగకండా ఏం జాగ్రత్తలు వుండాలనేది కూడా ఆలోచించ వలసిన విషయం. పై కోర్టు నుంచి స్టే తెచ్చుకోవడం శిక్ష అమలును వాయిదా వేయడమే కాని శిక్షను కాదని వ్యాఖ్యానించడం ద్వారా ఆ స్టే విలువను ప్రశ్నార్థకం చేస్తున్నది. ఎందుకంటే జయ తన శిక్ష విధింపును నిలిపివేయకపోతే అనర్హత ప్రాప్తించుతుందని కోర్టును కోరినప్పుడుహైకోర్టు న్యాయమూర్తి అలా జరగక పోవచ్చునని అన్నారు. అంటే రాజ్యాంగంలో భిన్న వ్యాఖ్యానాలకు ఆస్కారం వుందన్నమాట. అస్పష్టతా వుందని అంగీకరించారు. మరి దాన్ని తొలగించ డానికి ఏ నిర్దిష్ట సూత్రాలూ ప్రతిపాదించి నట్టు కనపడదు. సెల్వం ప్రభుత్వం జయ లలితకు క్షమాభిక్ష ప్రసాదించాలని గవర్నర్‌కు సిఫార్సు చేస్తే ఏం చేయాలనేది రాజ్యాంగ పరమైన ఇంకో సాంకేతిక సమస్య.

ముఖ్యమంత్రుల నియామకంలో గవర్నర్ల విచక్షణాధికారం తిరుగులేనిదనే ప్రాతిపదికన ఇప్పటి వరకు అనేక మంది వెన్నుపోటుదారులను, కనీస మెజార్టీ లేనివారిని సి.ఎం.లుగా ప్రతిష్టించిన ఉదాహరణలు అనేకం వున్నాయి. (నిజానికి రాజ్యాంగం గవర్నర్‌లు. రాష్ట్రపతులు కావాలంటే వుండవలసిన అర్హతలను వివరంగా పేర్కొంటున్నది. కాని ముఖ్య మంత్రుల నియామకంపై అలాటివేమీ లేవు) వాటన్నిటినీ వదలిపెట్టి ప్రజాబలంతో ఎన్నికైన పార్టీ నేత నియామకం వివాదం కావడం ఒక రకంగా విచిత్రమే. అత్యున్నత న్యాయస్థానం తీర్పును అందరూ గౌరవించ వలసిందే. అయితే దీన్ని అవకాశంగా తీసుకుని చిన్న చితకా లీగల్ పేచీలతో వివాదాలకు తెరలేవకుండా జాగ్రత్త పడాల్సి వుంటుంది.

సుదీర్ఘ జాప్యం

మే 14 నుంచి తమిళనాడులో పాలనాపరమైన అవ్యవస్థ నెలకొన్నట్టు భావించాలని కోర్టు ఆగ్రహించింది. అదే నిజమైతే మరింత త్వరితంగా జోక్యం చేసుకుని ప్రతిష్టంభనను నివారించి వుండవచ్చు. ఇప్పటికే టాన్సీ కేసులో గనక ఆమెకు అనుకూలమైనతీర్పు వచ్చి వుంటే సుప్రీం విచారణప్రాధాన్యత కోల్పోయి వుండేది. ప్రజల తీర్పులు రాజ్యాంగానికి లోబడివుండాలనే వ్యాఖ్య కూడా తేలికైంది కాదు. జైళ్లలో వున్న వారు కూడా చట్టసభల సభ్యులవడం చాలా కాలం జరిగింది. గత కొంతకాలంగానే ఇందుకు సంబంధించిన చైతన్యం పెరిగి కొన్ని నిబంధనలు రూపొందించబడ్డాయి. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఉన్న నిబంధనల మేరకు అందుబాటులో వున్నపార్టీలు వ్యక్తుల నుంచి ఎంచుకుని తీర్పు చెప్పడం కద్దు. ఈ విషయంలో వ్యవస్థా పరంగా నిబంధనల పరంగా జరిగే తప్పులకు వారిని బాధ్యులను చేయడం సమంజసం కాదు. రాజ్యాంగానికి భాష్యం చెప్పే అధికారం కోర్టులకు వున్నప్పటికీ అది మిగిలిన విభాగాలైన చట్ట సభలు కార్యనిర్వాహక వ్యవస్థపై ఆధిక్యతనిచ్చేది కాదని కూడా గుర్తించడం అవసరం. ఎందుకంటే అసమానతల సమాజంలో దోపిడీ వ్యవస్థ కూడా అందుకు అతీతంగా వుండదు. న్యాయవ్యవస్థ స్వయంగా అనేక సంక్షోభాలను, సవాళ్లను ఎదుర్కొంటున్నది.

జయలలిత కేసు ముందుకు తెచ్చిన అంశాలను అన్ని వేదికలపైనా సమగ్రంగా చర్చించాలి. మన ప్రజాస్వామ్య విలువలను ప్రమాణాలను మెరుగు పరచడానికి అదే సమయంలో ప్రజాతీర్పును వ్యక్తిగత హక్కులను కాపాడటానికి వీలైన స్పష్టత ఇవ్వడానికి ఏంచేయాలనేది అందరూ ఆలోచించాలి. మరింత ముఖ్యమైన విషయమేమంటే టాన్సీ కేసులో కింది కోర్టు తీర్పును పునఃపరిశీలిస్తున్న హైకోర్టు సాధ్యమైనంత త్వరలో తీర్పునిచ్చి ఈ ప్రతిష్టంభనకు స్వస్తి పలకాలి. ☆

న్యాయ నిపుణుల వాదనలు-వ్యాఖ్యలు

కె.కె.వేణుగోపాల్

జస్టిస్ ఫాతిమా బీవీ

☆ నా అభిప్రాయంలో పిటిషనర్ (జయలలిత) పోటీ చేయడానికి అనర్హతకు గురికాకపోవచ్చు

- మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మలై బాలసుబ్రహ్మణ్యం

☆ ఆర్టికల్ 164(4) శాసనసభ్యులు కాకున్నా ఆ అర్హత కలవారు మంత్రులు కావడానికి చేసిన తాత్కాలిక ఏర్పాటు మాత్రమే. జయ లలితను ముఖ్యమంత్రిగా నియమించిన రోజునే ఆమెకు ఆ అర్హత లేదని గవర్నర్ గమనించవలసింది.

- ఎఫ్.ఎస్.నారిమన్, పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది

☆ నియామకం పూర్తిగా నా స్వంత నిర్ణయం. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి, ప్రజలు ఇచ్చిన అత్యధిక మెజార్టీ తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని నేను ఆ నిర్ణయం తీసుకున్నాను.

-జస్టిస్ ఫాతిమా బీవీ

☆ 164(4) మంత్రుల నియామకంపై ఎలాటి షరతు విధించడం లేదు. అలాటి స్పష్టీకరణ లేనప్పుడు ప్రజాభిప్రాయానికే విలువ ఏర్పడుతుంది.

- జయలలిత తరపు ముఖ్య న్యాయవాది కె.కె.వేణుగోపాల్

☆ ఇందుకు సంబంధించి రాజ్యాంగంలో అస్పష్టత వుంది. దాన్నే సుప్రీం కోర్టు పోగొట్ట దలచింది.

-న్యాయమూర్తి బరూచా

☆ రాజ్యాంగం ప్రజల అభిప్రాయం కంటే ఉన్నతమైంది

- ధర్మాసనం

☆ భిన్నమైన నిరోధక నిబంధనలేవీ రాజ్యాంగంలో లేనప్పుడు మెజారిటీ పార్టీ నేతను నియమించడం కన్నా గవర్నర్‌కు గత్యంతరంలేదు

- తమిళనాడు ప్రభుత్వ న్యాయవాది పి.పి.రావు

పై కోర్టు స్టే ఇచ్చినప్పటికీ ఎన్నికలలో పోటీకి అనర్హత ప్రాప్తిస్తుందంటూ ఎన్నికల సంఘం చేసిన ఉత్తర్వు చెల్లదని సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి వి. రామస్వామి అభిప్రాయపడ్డారు.

ఆరు మాసాలలో శాసనసభకు ఎన్నిక కావాలనే నిబంధనకు తప్పుడు అన్వయం చెప్పి ఆరు మాసాల తర్వాత లాంఛనంగా రాజీనామా చేసి మళ్లీ మంత్రి పదవి స్వీకరిస్తామంటే కుదరదని ఇటీవలే పంజాబ్ మంత్రికి సంబంధించిన ఒక కేసులో సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది.

గుండె భద్రతకు పంచ సూత్రాలు



శరీరంలో ఏ అవయవం కొంతసేపు విశ్రాంతి తీసుకున్నా పర్వాలేదు. 50 సంవత్సరాల జీవితకాలంలో 200 కోట్ల సార్లు కొట్టుకుని 12000 కోట్ల మిల్లీలీటర్ల రక్తాన్ని శరీరానికి నిరంతరం, నిర్విరామంగా సరఫరా చేసే గుండె మూడు నిమిషాలు విశ్రాంతి తీసుకునే సమయం కూడా లేదు. ఆ గుండెకు భద్రత గురించి ఆలోచించే బాధ్యత ఆ గుండె యజమానిదే.



డా॥ పి. రమేష్‌బాబు,
యం.డి., డి.యం.
(ఎ.ఐ.ఐ.యం.ఎస్-న్యూఢిల్లీ)
చీఫ్ కార్డియాలజిస్ట్ & మేనేజింగ్ డైరెక్టర్

ఆరోగ్యవంతులకు గుండెజబ్బా?

గుండెపోటుకు గురయ్యే రోగులలో 50 శాతం మందికి ఏమాత్రం వార్నింగ్ సిగ్నల్స్ లేకపోవడం, ఉన్నా అతి స్వల్పంగా పక్కవారికి చెప్పేందుకు మొహమాటపడే విధంగా వుంటాయని శాస్త్రీయ సమాచారం తెలుపుతోంది. ఆశ్చర్యంగా ఉందికదూ! దృఢమైన శరీరం, చెక్కుచెదరని ఆరోగ్యం, ఏనాడూ జబ్బెరగని మనిషి, అలాంటివారికి సైతం గుండెజబ్బు వచ్చే అవకాశం లేకపోలేదు. గుండెపోటు నిశ్శబ్దంగా ప్రాణాలను హరిస్తుంది. ఈ అజ్ఞాత దుష్టశక్తిని ఎదుర్కోవాలంటే తొలిదశలోనే గుండెపోటు లక్షణాలను గుర్తించి గుండె నిపుణుల సలహా తీసుకోవడం మంచిది. గోటితోపోయే దానికి గొడ్డలివరకు తీసుకురావడం అవివేకం.

మీకు తెలుసా?

90 శాతం కేసులలో గుండె ఆపరేషన్ అవసరం లేదు. గుండెజబ్బులలో వ్యాధి నిర్ధారణే కీలకం. వైద్యం తేలికే. అతి ప్రమాదమనుకున్న గుండెజబ్బులు చాలాభాగం ఆధునిక వైద్య విజ్ఞానానికి లొంగుతున్నాయి.

ఎలా వుంటే గుండెనొప్పి?

40 సం॥ దాటిన వ్యక్తి నడుస్తున్నప్పుడు, మెట్లు ఎక్కేటప్పుడు ఛాతి మధ్యలో బరువు, నొక్కినట్లు నొప్పి లేదా మంట వచ్చి రెండు, మూడు నిమిషాలలో తగ్గిపోయే ఏంజైనా అంటారు. ఎప్పుడు రాని నొప్పి, స్వల్పమైనా, 15 నిమిషాలు మించి ఉంటే గుండెపోటులోనికి దిగవచ్చని తెలుసుకోవాలి.

మీ గుండెను కాపాడుకునేందుకు ఐదు సూత్రాలు

1. పరిమిత ఆహారం, తాజా పండ్లు, ఆకుకూరలు, యోగా వంటి ఎక్సర్‌సైజులు.
2. గుండెనొప్పి ఎలా వుంటుంది? గుండెజబ్బు లక్షణాలు ఎలా వుంటాయి అనే ప్రధాన అంశాలు కంఠతా (బట్టీ) పట్టడం (చాలాతేలిక) ఎలా వుంటే గుండెజబ్బు కాదు అని తెలుసుకుని కంగారుపడకుండా ఉండటం, గంట ఆలస్యం ప్రమాదపుటంచుల్లో పడవేయవచ్చు.
3. సైలెంట్ కిల్లర్స్ అయిన బి.పి., షుగర్, గుండెజబ్బులను ప్రాథమిక దశలో అరికట్టడం.
4. వైద్యశాస్త్రంపై ఏ మాత్రం అవగాహన లేనివారి సలహాపట్ల అప్రమత్తంగా వుండటం, వారు నిజంగా మీ మేలు కోరేవారే కావచ్చు. స్వలాభం కోసం పాకులాడేవారే కావచ్చు.
5. వృథా ఖర్చులెన్నో పెడతాం. అకస్మాత్తుగా వచ్చే ప్రమాదాలను ఎదుర్కొనేందుకు అతి స్వల్పమైన హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించి రాజీలేని ఆధునిక చికిత్స పొందడం.

★ కొంచెం గుండెనొప్పి అని వెళితే అనవసరంగా బెడ్ ఎక్కించేస్తారేమో? అనవసరంగా ఆపరేషన్ అంటారేమో? అనే అనుమానాలతో కాలం వృథా చేయవద్దు. సమాజంలో అన్ని వ్యవస్థలలో లోపాలు ఉన్నప్పుడు వైద్య వ్యవస్థలో లోపాలు వుండరాదని ఆశించడం అసహజం. వాస్తవాలు విశ్లేషించి సరైన వైద్య చికిత్స పొందే బాధ్యత రోగిది, వారి సలహాదారులది.

ఎలా వుంటే గుండెనొప్పి కాదు?

చురుక్కుమని సెకనుపాటు వచ్చే నొప్పి, తుమ్మినా, దగ్గినా, ఊపిరిపీల్చినా, మెడ ముందుకు వచ్చినా, భుజాలు కదిలించినా వచ్చే నొప్పి, ఒకే స్పాట్‌లో రోజులు, నెలలు వుండే నొప్పి గుండెకు సంబంధించినది కాదు. స్పెషలిస్టు అవసరం లేదు.

గుండెనొప్పి అని అనుమానం వస్తే తక్షణం గుండె చికిత్స నిపుణులను సంప్రదించవలసి వుంటుంది. దానిని గుర్తించేందుకు అతి విలువైన పరికరం ఇసిజి. ఇసిజి ద్వారా రోగికి వచ్చిన ఛాతీనొప్పి గుండెపోటుకు సంబంధించిందా కాదా అనే నిర్ధారణ చాలాభాగం జరుగుతుంది. ఇసిజి పరీక్షను నిర్లక్ష్యం చేయడం పెద్ద పొరపాటు. అందుకే సిటీ కార్డియాక్ సెంటర్, కృష్ణాజిల్లాలో 12 మండల కేంద్రాలలో ఇసిజి పరీక్షలు ఏర్పాటుచేసింది. ఇసిజి పరీక్ష ఖర్చుతో కూడుకున్నది కాదు. కేవలం రు.20లకే పరీక్ష చేయించుకోవచ్చు.

అవగాహన లేనివారి సలహాలు అనర్థం

గుండెపోటు వచ్చిందంటే భయపడనవసరం లేదు. కాని ఆధునిక వైద్య పరిజ్ఞానం లేని, అవగాహనలేని వారి సలహాలు పాటించడం అనర్థం. అర్హత, అనుభవం లేని వైద్యులపట్ల అప్రమత్తంగా మెలగాలి.

కరోనరీ ఏంజియోగ్రాం ఎవరికి అవసరం ?

అమెరికన్ హార్ట్ అసోసియేషన్ (1999) సూచనల ప్రకారం ఒకసారి గుండెపోటు సంభవించి LVEF 40%లోపు వున్న ప్రతివారికి ఏంజియోగ్రాం అవసరం. ఒకసారి గుండెనొప్పి తగ్గిన తరువాత నేను బాగానే వున్నాను. నాకెందుకు ఇంకా టెస్టులు అని అడుగుతుంటారు. గుండెపోటు రాకముందు కూడా వీరు బాగానే వున్నారుకదా. రెండవసారి ప్రాణానికి

ముప్పుతెచ్చే గుండెజబ్బు తీవ్రతను కనుక్కొనేందుకు ఖచ్చితమైన వ్యాధి నిర్ధారణకు, మందులు ఎంత పవరు వాడాలి. ఎంత పని చేయవచ్చు అని తెలిపేందుకు ఆపరేషన్, బెలూన్ ఏంజియోప్లాస్టీ అవసరమా? అనవసరమా? అని తేల్చేందుకు ఈ టెస్ట్ ముఖ్యమైన సమాచారం ఇస్తుంది. వందమందికి ఏంజియోగ్రాం చేస్తే 75 మందికి మందులే చాలని తెలుస్తుంది. మిగిలిన 25 మందిలో కొంతమందికి ఆపరేషన్, కొంతమందికి బెలూన్ వైద్యం అవసరమని తెలుస్తుంది. ఈ నిర్ణయాలు కొన్ని లక్షలమంది రోగులను కొన్ని దశాబ్దాలపాటు పరిశీలించి నిర్దేశించిన సూత్రాల ఆధారంగా చేయబడతాయి.

గుండె కవాటాలకు జబ్బులు: రుమాటిక్ హార్ట్ డిసీజ్ మొదలగునవి. పైకి మామూలుగా కన్పించే వ్యక్తులలో సాధారణంగా స్టెతస్కోప్‌తో పరిశీలించినపుడు ఈ జబ్బులు ఉన్నవని తెలుసుకోవచ్చు. కొంతమందిలో 15-20 రోజులు మించి జ్వరం ఉంటే గుండె కవాటాలకు చీము పట్టినట్లు గమనిస్తాము. మరికొంతమంది అకస్మాత్తుగా పక్షవాతం బారిన పడినపుడు తొలిసారిగా వారికి కొన్ని సంవత్సరాలుగా గుండె కవాటాలలో జబ్బు వున్నట్లు తెలుస్తుంది. టి.బి. వల్ల గుండె చుట్టూ నీరు చేరడం కూడా సాధారణంగా చూస్తుంటాం. నడిచేటప్పుడు ఆయాసం, దడ, కార్డియాక్, అస్త్మా, మరికొంతమందికి వుండే లక్షణాలు. ఒక్కసారి గుండె కవాటాలలో జబ్బు వుందని తెల్సినప్పుడు వీలైనని సంవత్సరాలు వున్నవాటితోనే మందులు సహాయంతో కాలం గడిపేందుకు ప్రయత్నం చేస్తాం. అయితే రోగికి పై లక్షణాలు కన్పించకపోయినా, సైలెంట్‌గా గుండె పెరిగి ఆపరేషన్ స్టేజ్ దాటిపోతుందా అనేది గుండె నిపుణులు తేల్చాల్సిన విషయం. రోగి ఆరు నెలలకు ఒకసారైనా నిపుణుల సలహాలు తీసుకోవాలి.

పిల్లల్లో సైతం వెన్ను ముదిరితే గుండెజబ్బు తగ్గుతుందా?

పాలు త్రాగేటప్పుడు ఆయాసపడటం, చెమటలు పట్టడం, ఏడ్చేటప్పుడు నీలరంగులోనికి తిరగడం పసిపిల్లల్లో గుండెజబ్బు సంకేతాలు కావచ్చు. ఒకసారెప్పుడో గుండెజబ్బు వున్నదని చెప్పారు. పిల్ల బాగానే వున్నది. ఇప్పుడు పెళ్ళి చేయాలి ఒకసారి చెకప్ చేయమని కొందరు వస్తుంటారు. కాని ఆసరికే గుండె కుడిభాగం ఫెయిల్ అవటం ప్రారంభం అయిందని పల్మోనరి హైపర్‌టెన్షన్ వల్ల పిల్లకు పెళ్ళి చేయరాదని చెప్పాలంటే మాటలు వెతుక్కోవాల్సి వుంటుంది. జబ్బు కొంచెం వుందని తెలిసినా సంవత్సరానికి ఒకసారి నిపుణుని సలహాల వల్ల ఎన్నో అనర్థాలను అరికట్టవచ్చు.

హెల్త్ ఇన్సూరెన్స్ అవసరం: గుండె, మెదడు, కిడ్నీ, కన్ను మొదలైన ముఖ్య అవయవాలకు జబ్బులు, యాక్సిడెంట్లు వీటికి ఎవ్వరు అతీతులు కారు. అనవసరంగా ఇన్సూరెన్స్ కట్టడం అని భావించేవారు తమకు జబ్బు రాకపోతే జబ్బు వచ్చిన వేరొక వ్యక్తికి సహాయం చేస్తున్నట్లు భావిస్తే వారు ప్రాణదానం చేసినట్టే. జబ్బు వచ్చిన తరువాత జబ్బు లేదనే సర్టిఫికెట్ కోసం డాక్టర్ని వేధించి ఇన్సూరెన్స్ కంపెనీల చుట్టూ తిరిగేకంటే ముందే మేలుకుని కొంత వితరణ చూపిస్తే ఇన్సూరెన్స్ వ్యవస్థ వీలైనంత మందికి సహాయపడుతుంది. అనారోగ్యం వచ్చినపుడు ఆర్థిక వనరుల గురించి ఆలోచించడం కంటే ఆరోగ్యంగా వున్నప్పుడే ముందుచూపుతో వ్యవహరించడం మేలు. ☆



డాక్టర్ సలహాలు

నా వయస్సు 19 సం॥లు 9 నెలల క్రితం నా మూత్రంలో Albumin ఉందని మూత్ర పరీక్షలో తేలింది. డాక్టర్ సలహా మేరకు Wysolone-20m రోజు తప్పించి రోజు ఉదయం, సాయంత్రం వేసుకుంటున్నాను. కాని ఫలితం లేదు. ఈ వ్యాధి తగ్గుతుందో లేదోనని మా కుటుంబం భయపడుతోంది. కిడ్నీ ప్రాబ్లమ్ అని కొందరంటున్నారు. హోమియోపతి వాడవచ్చా...

- పేరు రాయలేదు, నరసరావుపేట

మూత్ర పిండాల పనివిధానాన్ని నిర్ధారించేందుకు గాను ప్రాథమిక పరీక్షలు చేయించుకోవాలి. నెఫ్రాలజిస్టును సంప్రదించండి. మూత్ర పిండాలు పనిచేస్తున్నట్లు పరీక్షల్లో తేలితే మీరు ఆందోళన పడాల్సిన పనిలేదు. ఒకవేళ పనిచేయకపోయినా వాటిని మార్చుకునే అవకాశం ఎటూఉంది. అందుచేత మార్గాలే లేవని మీ కుటుంబం బాధపడాల్సిన పనిలేదు. నెఫ్రాలజిస్టును సంప్రదించిన తదుపరి ఆయన సలహా మేరకు హోమియో వాడకంపై మీరే నిర్ణయం తీసుకోండి.

నా వయస్సు 21 సం॥లు. రెండుసార్లు ఫిట్స్ వచ్చాయి. డాక్టర్ పరీక్ష చేసి 'EPILEX' అనే టాబ్లెట్లు మూడు సంవత్సరాలు వాడాలని చెప్పారు. దీనివలన సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయా? ఫిట్స్ రావడానికి కారణాలు ఏమిటి?

- కె. అల్తాఫ్ హుస్సేన్, ఆదోని

ఎపిలెక్స్ బిళ్లల వలన పళ్ళచిగుర్లు వాచే అవకాశం ఉంది. కొద్దిగా చెముడు కూడా రావచ్చు. అరుదుగా చర్మంలో రియాక్షన్ రావచ్చు. తలకు దెబ్బతగలటం, మెదడులో కణితి, రక్తపోటును సక్రమంగా నియంత్రించకపోవటం, రక్తనాళాల్లో మార్పులు తదితర తెలిసిన కారణాలతో పాటు కొన్ని తెలియని కారణాలవలన కూడా ఫిట్స్ రావచ్చు.

నాకు మూడు సంవత్సరాల నుండి ముఖంపై మొటిమలు వస్తున్నాయి. ఎన్ని క్రీములు వాడినా లాభం లేకుండా పోతోంది. ఇవి నొప్పిగా కూడా ఉంటున్నాయి. పరిష్కారం చెప్పగలరు.

- కె.రాజు, మొలగవల్లి

గోరు వెచ్చని నీటితో వీలయినన్ని ఎక్కువసార్లు ముఖాన్ని కడుక్కోండి. ఎలండ్‌డి డాక్సీసైక్లిన్ గొట్టాలను రోజు ఒకటి చొప్పున నెలవాడండి. ఎరిత్రోమైసిన్ క్రీమును పలుచగా ముఖానికి రాయాలి. నూనె పదార్థాలూ, తీపి పదార్థాలనూ తినడం బాగా తగ్గించండి.

నాకు గర్భాశయం ఉబ్బింది. కుదరక ఆపరేషన్ చేయించుకోలేదు. ఈ మధ్య వెజినా నుండి కొంచెం గవరగా ద్రవపదార్థం అయ్యింది. హోమియో మందులు వాడాక తగ్గింది. పీరియడ్ టైమ్‌లో మిక్సిడ్ కలర్స్ వస్తున్నాయి. గవరగా అయితే కాన్సర్ వస్తుందా?

- విజయలక్ష్మి, గుంటూరు

మీరు వయస్సు రాయలేదు. బహిస్టులు ఆగిపోయి ఉంటే ఈస్థితికి కాన్సర్ అవునోకాదో నిర్ధారణ చేయాల్సి ఉండేది. మీరు గైనకాలజిస్టును సంప్రదించండి.

నా వయస్సు 20 సం॥లు. నాకు రెండు సీట్లకి మొలలు అయ్యాయి. అవి పగిలి రక్తం కారి ఇబ్బంది పెడుతున్నాయి. ఎక్కడా సరిగా కూర్చోలేకపోతున్నాను. మంచి మందులు సూచించగలరు.

- టి.వెంకటేశ్వర్లు, కల్లూరు

మొలల వ్యాధి నివారణకుశస్త్రచికిత్సే మార్గం. మందులతోనయం కాదు. అంతవరకూ "క్రిమోఫిన్" అనే అరకు మందును రోజు రాత్రిపూట రెండు మూతలు తాగండి. సుఖ విరోచనం అయ్యే విధంగా పీచు పదార్థాలు ఎక్కువగా తినండి. ఐరన్‌కాప్సూల్‌ను (ఆట్రిన్,ఫీఫాల్) క్రమం తప్పకుండా రోజు ఒకటి వేసుకోండి. జనరల్ సర్జన్‌ను సంప్రదించండి.

- డా॥ కొల్లా నాగేశ్వరరావు,

ఎం.ఎస్. డి.ఎల్.ఓ., ఒంగోలు

ప్రేమికులకు ఉరి

అంపశయ్య నవీన్

“ఈ వార్త చూశారా?” అంటూ వచ్చాడు మా పక్కింటి పుల్లారావు.

“ఏ వార్త?” అన్నాను.

“ఉత్తర ప్రదేశ్‌లో ముజఫర్‌పూర్ జిల్లాలోని అలీనగర్ గ్రామంలో ప్రేమించుకున్నారన్న నేరానికి ఆ ఊరి ప్రజలందరూ చూస్తుండగా ఆ ప్రేమికుల తల్లిదండ్రులే వాళ్ళను నడిబజార్లో ఉరి వేసి చంపేశారట.

“వాళ్ళిద్దరు చేసిన నేరం ప్రేమించుకోవడమేనా?”

“అవునట... అబ్బాయిదొక కులం.... అమ్మాయిది మరో కులమట... ఆ అబ్బాయి పేరు విశాల్ - బ్రాహ్మణుడు. అమ్మాయి పేరు సోమ - జాట్ కులస్తురాలు - వాళ్ళిద్దరూ ప్రేమలో పడ్డారు. ఆ ఊర్లో కులాంతర వివాహాలు పూర్తిగా నిషేధమట... ఒకే కులానికి చెందని వాళ్ళు ప్రేమించుకోవడం క్షమార్హం కాని నేరమట... ఈ విషయం ఆ ప్రేమికులిద్దరికీ తెలుసుట. అందుకే వాళ్ళిద్దరూ ఎక్కడికైనా పారిపోయి పెళ్ళి చేసుకుందామనుకున్నారట.. ఒక్కరాత్రి గడిచిపోతే వాళ్ళు ఎవరికీ దొరక్కుండా పారిపోయేవాళ్ళేనట్ట.. కానీ ఆ లోపలే వాళ్ళు వాళ్ళ తల్లిదండ్రులకు పట్టుపడ్డారట - మొదట ఆ అమ్మాయి తల్లిదండ్రులు వాళ్ళను లేచిపోతుండగా చూశారట - వాళ్ళూ, వాళ్ళ బంధువులు కలిసి వాళ్ళను నిర్దాక్షిణ్యంగా కొట్టడం మొదలెట్టారట. ఆ దెబ్బలకు తాళలేక ఆ ప్రేమికులిద్దరూ పెద్దగా కేకలు పెడుతుండగా ఆ చుట్టుపక్కల వాళ్ళు విని వెంటనే వెళ్ళి ఆ అబ్బాయి తల్లిదండ్రులకు చెప్పారట - వాళ్ళొచ్చేటప్పటికే ఆ అమ్మాయి తల్లిదండ్రులు ఆ అమ్మాయి మెడకు తాడు బిగించి ఊరి వాళ్ళందరూ చూస్తుంటే ఉరి తీసేశార్ట. ఆ తర్వాత ఆ అబ్బాయి అన్న వచ్చి ఆ అమ్మాయినెలా మెడకు ఉరి బిగించి చంపేశారో ఆ అబ్బాయిని కూడా అలాగే చంపేశాట్ట... దీన్నంతా ఓ చోద్యంలా చూస్తున్న ఆ ఊరి ప్రజలు ఒకరైనా ఈ ఘోరాన్ని ఆపడానికి ప్రయత్నం చెయ్యలేదుట... పైగా అందరూ కలిసి వెంటనే ఆ ప్రేమికులిద్దరి మృత దేహాలను దహనం చేశారట.. తర్వాత ఎవరో వెళ్ళి పోలీసులకీ విషయం చెబితే వాళ్ళొచ్చి అమ్మాయి తల్లిదండ్రులనూ, అబ్బాయి అన్ననూ అరెస్ట్ చేసి జైళ్ళో పెట్టారుట.

“చట్టపరంగా చూస్తే మాది నేరమే కావొచ్చు. కానీ సామాజికంగా చూస్తే మాత్రం మేం చేసింది సరైన పనే అన్నారట వాళ్ళు.. వాళ్ళల్లో ఎలాంటి పశ్చాత్తాపం కూడా కనిపించలేదట.. మీలాంటి వాళ్ళు ప్రపంచం ఎంతో మారిందంటున్నారు - కులాలూ, మతాలూ పోతాయంటారు. ఇవ్వాళ్ళ ఏ సినిమాలో చూసినా అబ్బాయి, అమ్మాయి ప్రేమించుకుంటారు. వాళ్ళిద్దరూ వేర్వేరు కులాలకో, మతాలకో చెందిన వాళ్ళై ఉంటారు. వాళ్ళ తల్లిదండ్రులు మొదట్లో వాళ్ళ పెళ్ళికి ఒప్పుకోకపోయినా సినిమా చివర్లో ఒప్పుకుంటారు. కథ సుఖాంతమవుతుంది. కానీ నిజజీవితంలో అలా జరగటం లేదెమిటి? దీనికి కారణమేమిటంటారు?” అన్నాడు పుల్లారావు.

“నిజమే.. మీరు చెప్పిన సంఘటన చాలా షాకింగ్‌గానే ఉంది. ఇలాంటి సంఘటనలు అప్పుడప్పుడు జరుగుతున్నట్టుగా పేపర్లలో చదువుతూనే వున్నాం. ఈ మధ్యనే ఇక్కడే మనూర్లో పూర్తిగా ఇలాంటిదే కాకపోయినా ఇంచుమించు ఇలాంటిదే జరిగింది...” అన్నాన్నేను.

“అదేమిటో నేనప్పుడే మరచిపోయాను”

“ఓ అగ్రకులానికి చెందిన అమ్మాయి ఓ నిమ్నకులంగా చెప్పబడే కులానికి చెందిన అబ్బాయిని ప్రేమిస్తే అగ్రకులానికి చెందిన వాళ్ళు ఆగ్రహించడంలో ఆశ్చర్యం లేదు. కానీ ప్రేమికులిద్దరూ నిమ్న కులాలకు చెందినప్పుడో, లేక అగ్రకులాలకు చెందినప్పుడో కూడా ఇలాంటివి జరుగుతున్నాయి.. ఆ మధ్యనే మన వరంగల్‌లోనే ఓ బి.సి. అమ్మాయి, మరో బి.సి. కులానికే చెందిన అబ్బాయి ప్రేమించుకున్నారు. పెళ్ళి చేసుకుందామనుకున్నారు. వాళ్ళ తల్లిదండ్రులు వీళ్ళ పెళ్ళికి ఒప్పుకున్నట్టే ఒప్పుకొని, మోసం చేసి ఓ రాత్రి అబ్బాయిని గొడ్డలితో నరికి చంపేశారు. అడ్డంగా వెళ్ళిన ఆ అమ్మాయిక్కూడా గాయాలయ్యాయి. ఆ అమ్మాయిని హాస్పిటల్లో జాయిన్ చేశారు... తన ప్రేమికుడెలా ఉన్నాడని అడిగితే ఆ అమ్మాయికి బాగానే ఉన్నాడని చెప్పారట... తర్వాత ఆ అమ్మాయికి నిజం తెలిసిపోయింది. తన ప్రియుణ్ణి చంపేశారని తెలియగానే ఆ అమ్మాయి ఓ రాత్రి హాస్పిటల్ నుండి తప్పించుకొని వెళ్ళి అక్కడకు దగ్గర్లోనే వున్న చెరువులో పడి చనిపోయింది” అన్నాన్నేను.

“ఇట్లాంటి సంఘటనలెందుకు ఈ నాటిక్కూడా జరుగుతున్నాయంటారు?”

“ఇలాంటి సంఘటనలు ఈనాటిక్కూడా మన దేశంలో కుల వ్యవస్థ అనేది ఎంత బలంగా నాటుకుపోయి ఉందో రుజువు చేస్తాయి. ఏ సమాజంలోనూ లేని కులవ్యవస్థ అనే కాన్సర్ ఒక్క హిందూ సమాజంలోనే ఉంది. ఈ కుల వ్యవస్థ అనేది ఒక్క హిందూ సమాజంలోనే ఎందుకుందో చెప్పడానికి చాలా మంది మేధావులు ప్రయత్నించారు. మొదట్లో చేస్తున్న వృత్తుల్ని బట్టి ఈ కుల వ్యవస్థ ప్రారంభమై వుంటుంది. తర్వాత ఆ వృత్తి కులంగా మారి పుట్టుకబట్టే ఓ వ్యక్తి కులాన్ని నిర్ణయించారు. పుట్టిన స్త్రీగానీ, పురుషుడుగానీ రేపు ఏం కాబోతున్నాడు... సమాజంలో వారి స్థానమేమిటి అన్నది కులమే నిర్ణయించింది. ఆధునిక యుగంలో శాస్త్రీయ దృక్పథం బలపడటం, సైన్స్ అండ్ టెక్నాలజీ పెరగటం కారణంగా ప్రజలందరూ ఒకేచోట చేరి పని చెయ్యడం లాంటి కారణాల వల్ల కుల ప్రాబల్యం తగ్గిపోతుందనుకున్నాము. కొంతవరకు అలా జరిగింది కూడా... కానీ ఈనాటిక్కూడా ఈ దేశంలో ప్రజలందరూ విజ్ఞానవంతులు కాలేదు... ఇంకా యాభైశాతం జనాభా నిరక్షరాస్యులుగానే వున్నారు... వీళ్ళల్లో ఇంకా అజ్ఞానం, మూఢ విశ్వాసాలు బలంగానే వున్నాయి. వీటికి తోడు రాజకీయ నాయకులు ఓట్ల కోసం ప్రజల్ని కులాలుగా, మతాలుగా విడగొడ్తూనే వున్నారు.. అందుకే ఈ నాటిక్కూడా చాలా గ్రామాల్లో దళితుల్ని ఊరిబయటే ఉంచుతున్నారు. అస్పృశ్యత ఇంకా పాటించబడ్తూనే ఉంది. నా కులం గొప్పదంటే నా కులమే గొప్పదని ప్రజలు పోట్లాడుకుంటూనే వున్నారు. కుల పోరాటాల్లో అనేకమంది ప్రాణాల్ని కోల్పోతూనే వున్నారు. చాలా చోట్ల ఇంకా అగ్రకులాల వారి ఆధిపత్యం కొనసాగుతూనే ఉంది. కులాంతర వివాహాల్ని అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతూనే వున్నాయి. ప్రేమికుల్ని ఉరితీయడమో, గొడ్డళ్ళతో నరికెయ్యడమో జరుగుతూనే ఉంది - ఇవన్నీ పోవాలంటే ఒకటే మార్గం... ప్రజలందరూ చదువుకొని విజ్ఞానవంతులు కావాలి. శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకోవాలి. మనుషులందరూ ఒకటేననీ, అందరిలోనూ ప్రవహిస్తున్నది ఒకే రక్తమనీ, అందరమూ భూమ్మీద మానవ సృష్టి ప్రారంభమైన కొత్తలో ఒకే తల్లి పిల్లలమనీ తెలుసుకోవాలి. కులాలు, మతాలు కొందరు మనుష్యులు తమ స్వార్థం కోసం సృష్టించినవేనని, ఎప్పుడో అజ్ఞానయుగంలో పుట్టిన కులాల్ని ఇంకా పట్టుకొని వేలాడనవసరం లేదని గ్రహించాలి” అన్నాన్నేను.

“అలా ఏనాటికైనా జరుగుతుంటారా?”

“నేను , ఆశావాదిని” అన్నాన్నేను.

☆

కాస్త ముందు, వెనుక..
చూసుకొంటున్నారా ఏమూల..
ఏ యుద్ధ విమానం
దాగుందో ?
అమెరికా
ఆంక్షలు
ఎత్తివేతపై
ప్రధాని
సంతోషం
GANGADHAR


GANGADHAR


తళాంగు తకదిమితోం
తానాతందాన
వహవా..
వహవా..
GANGADHAR

పిల్లలకు ఎలాంటి కథలు చెప్పాలి

సింహాద్రి సరోజిని

'ఏమిటండీ ఈ మధ్య పిల్లల కథల్లో పడిపోయారని' నాకు తెలిసిన రచయితను అడిగాను.

"ఏమి చెయ్యమంటారండీ? మా వాడికి రోజుకోకొత్త కథ చెప్పాలి. వాడి కోసం కొత్త కొత్త కథలను ఆలోచించాల్సి వస్తోంది. పైగా వాడి కోసం బోలెడు పిల్లల కథల పుస్తకాలు చదవాల్సి వస్తోంది. పనిలో పనిగా నేనూహించిన కొత్త కథలను పత్రికలకు రాస్తున్నా" అన్నారాయన.

ఆ మాట విని నాకు చాలా సంతోషం వేసింది. ఈ రోజుల్లో తమ పిల్లల కోసం కథలు ఆలోచించడం, చదవడం చేస్తున్నారంటే వారు తమ పిల్లల కోసం తమ సమయాన్ని కొంత వెచ్చిస్తున్నారనేగా. పూర్వకాలంలో అయితే పిల్లలకు అమ్మమ్మలు, నాయనమ్మలు, తాతలు అందుబాటులో వుండేవారు. చీకటి పడగానే పిల్లలు వాళ్ళ పక్కల్లో చేరి బోలెడు కథలు చెప్పించుకునే వారు. అది వారి విజ్ఞానాన్ని, ఆలోచనా శక్తిని ఎంతగానో పెంచేది. అయితే నేటి పిల్లలకు అది కరువయిందనే చెప్పాలి. ఒకవేళ పెద్ద వాళ్ళెవరైనా యింట్లో వున్నా ఆ కాకమ్మ కథలు వినే ఆసక్తి నేటి పిల్లలకు వుండటం లేదు. వారు చాలా సమయం స్కూళ్ళు, ట్యూషన్లతోనూ, హోంవర్కులతోనూ గడుపుతారు. ఇంకాస్త సమయమేదన్నా వుంటే టి.వి ఛానళ్ళను మార్చడంలో వెచ్చిస్తారు.

అయితే మన రచయితగారి లాంటి వారు, వారి అబ్బాయిలాంటి వారు కూడా చాలా మందే వున్నారు. ముఖ్యంగా పల్లెల్లో వుండే పిల్లలు ఈ రకమైన కథలు తరచుగా వింటూనే వుంటారు.

మనం చరిత్రలోకి వెళ్తే అనేక మంది ప్రసిద్ధ వ్యక్తులకు తాత నాయనమ్మలు, అమ్మమ్మలు, అమ్మలు ఎన్నో మంచి కథలు చెప్పే వారని మనకు తెలుస్తుంది. ఆ కథలను విని గొప్ప దేశ భక్తులుగానో, కవులుగానో, గాయకులుగానో మారిన వారెందరో మనకున్నారు. మనం కూడా మన పిల్లలకు భగత్‌సింగ్, నేతాజీ, గాంధీజీ వంటి దేశభక్తుల జీవితాలను గురించి, గొప్ప శాస్త్రవేత్తల గురించి చెబితే వారికెంతో స్ఫూర్తిదాయకంగా వుంటాయి. చదవగలిగిన పిల్లల చేత పుస్తకాలు చదివిస్తే ఉపయోగంగా వుంటుంది.

అయితే మనం పిల్లలకు చెప్పే కథలు ఎలా వుండాలనేది కూడా ఒకసారి ఆలోచించాలి. ముఖ్యంగా అవి వారిని భయపెట్టేవిగా కాకుండా వుండాలి. వారిలోని సృజనను వెలికి తీసేవిగా వుండాలి. వారి ఆలోచనా శక్తికి పదును పెట్టేవిగా వుండాలి. వారిలో హేతువాద ఆలోచనా ధోరణిని పెంపొందించేవిగా వుంటే మరీ మంచిది. వారు ఆ కథల నుంచి శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించుకోగలుగుతారు. దానివల్ల వారు పెరిగి పెద్దవారైన తరువాత ప్రతి అంశాన్నీ శాస్త్రీయ దృక్కోణం నుంచి ఆలోచించగలుగుతారు.

ప్రతిరోజూ వారికి మనం కథలు చెప్పడంతోనే సరిపెట్టడంగాక వారి బుల్లి మెదడుకు తట్టిన భావాలను ఒక కథ రూపంగా చెప్పాల్సిందిగా మనం ప్రోత్సహిస్తూ వుండాలి. దానివల్ల వారి ఆలోచనా విస్తృతి విస్తరించే అవకాశముంటుంది. అలాగే పెద్ద పిల్లల చేత చిన్న పిల్లలకు కథలు చెప్పించవచ్చు. నేడు పిల్లలకు పాఠ్య పుస్తకాలతోనే సరిపోతోంది. అయితే కొంత సమయాన్ని వారికి నచ్చిన కథల రూపంలో వుండే పుస్తకాలను అందుబాటులో వుంచాలి. చందమామ, బాలమిత్ర వంటి పిల్లల మ్యాగజైన్లను, పుస్తకాలు, విజ్ఞానాన్ని అందించే పుస్తకాలు చదువుకునేందుకు కేటాయించుకొనేలా పెద్దలు చూడాలి. తల్లిదండ్రులు కూడా పిల్లలకు సులభంగా అర్థమయ్యే పుస్తకాలను, బొమ్మలతో కథను వివరించే వాటిని, కార్టూన్ల పిల్లలకు పనికివచ్చే పిల్లల మ్యాగజైన్లను తెప్పించడం ద్వారా కూడా పిల్లల్లో పఠనాశక్తిని పెంచగలుగుతాము. ఈ మ్యాగజైన్లను పిల్లలే గాక పెద్దలు కూడా ఆసక్తిగా చదవడాన్ని మనం గమనించవచ్చు. అయితే అంతా బాగానే వుందిగానీ మేము కూడా రోజంతా ఆఫీసులో పనిచేసి, నానా హైరానా పడి యింటికొస్తాం. ఇంక పిల్లల కథలు చెప్పే తీరికెక్కడిదని పెద్దలు ప్రశ్నిస్తుంటారు. మనం ఎంత కష్టపడినా అదంతా కుటుంబం ముఖ్యంగా పిల్లల అభివృద్ధి కోసమే గదా! అలాంటప్పుడు మన పిల్లల మనోల్లాసం కోసం, వారి మానసిక అభివృద్ధి కోసం కొంత సమయాన్ని కేటాయించడం తప్పనిసరి. దాని కోసం అవసరమైతే మన పనులను కొన్నింటిని వాయిదా వేసుకోవాలి. అది మరీ అంత ముఖ్యమైన పని కాకపోతే దానిని మానుకొని పిల్లలతో కొంత సమయమైనా గడపాలి. అలా చేయకపోతే పిల్లలు అల్లరి చిల్లరగానో లేక తల్లిదండ్రులంటే అయిష్టంగానో తయారయ్యే ప్రమాదముంది. నేటి ఆధునిక తల్లిదండ్రుల్లో కొందరైనా ఈ విషయాన్ని గమనిస్తున్నారు. పిల్లలతో కొంత సమయమైనా గడిపేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది శుభపరిణామంగా పరిగణించవచ్చు. ☆

'ప్రజాసేవకుడు'

రంగరాజపురంలో ప్రతిఏటా ఉగాది ఉత్సవాలు గొప్పగా జరుగుతాయి. ప్రతిఏటా ఉగాదినాడు ఆ ప్రాంతంలో వివిధ రంగాల్లో కృషి చేసిన వారికి బహుమతులివ్వడంతో పాటు ప్రజలకు సేవ చేయడంలో శ్రద్ధ కనపరిచిన వారిని ఎంపిక చేసి ఘనంగా సన్మానిస్తారు. ఆ ఊరి మోతుబరి పరంధామయ్య చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరుగుతుంది.

ఒక ఏడాది సన్మానానికి అర్హుడిని ఎంపిక చేయడానికి సలహా సంఘాన్ని సమావేశపరిచాడు పరంధామయ్య. 'మన ప్రాంతంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి రాత్రనక, పగలనక వైద్యసేవలు అందిస్తూ ప్రాణదానం చేస్తున్న డాక్టర్ రంగరాజును సన్మానించాలని' ఒక సభ్యుడు అభిప్రాయపడ్డాడు. 'మనం ఇలా స్వేచ్ఛగా, సుఖంగా జీవించడానికి శత్రువుల నుండి దేశాన్ని అహోరాత్రులు కాపాడే మన ప్రాంతవు సైనికుడు చిన్నయ్యకే సన్మానం చేయాలన్నాడు మరో సభ్యుడు. కాని సన్మానం చేయాల్సింది ఒక్కరికే. ఇక్కడ సన్మానానికి ఇద్దరూ అర్హులుగానే కనిపిస్తున్నారు. ఎంత సేపు చర్చించినా పరిష్కారం దొరకలేదు. ఇక చేసేదేమి లేక ఆ సమావేశాన్ని మరునటి రోజుకు వాయిదా వేశాడు పరంధామయ్య.

మరునటి రోజు సమావేశానికి సలహాసంఘం సభ్యులతో పాటు ఎంపిక చేసిన ఇద్దరు ప్రజాసేవకులు కూడా హాజరయ్యారు. వారికి సలహాసంఘం సభ్యులు తమ అభిప్రాయాలను తెలిపారు. తలవని తలంపుగా వారిని అడిగిన ప్రశ్నకు ముందు తడబడినా తేరుకొని సమాధానం చెప్పడానికి పది నిమిషాలు వ్యవధి అడిగారు. సరే అన్నారు సలహాసంఘం సభ్యులు. ఆ తరువాత ఇద్దరూ ఏకాంతంగా మాట్లాడుకున్నారు.

'మేమిద్దరం ప్రజాసేవ చేస్తున్న విషయం వాస్తవమే. మేమే కాదు మాతో పాటు ఇంకా అనేక మంది వారి వారి వృత్తుల ద్వారా ప్రజలకు సేవ చేస్తున్నారు. కొందరు చేసే సేవ ప్రత్యక్షంగా కనిపిస్తే మరికొందరి సేవ పరోక్షంగా సహాయపడుతుంది. మేము ఇలా ప్రజలకు సేవ చేసే స్థాయికి ఎదగడానికి కారణమైన వ్యక్తి ఒకరున్నారు. చిన్నప్పటి నుండి క్రమశిక్షణ నేర్పించి విద్యాబుద్ధులు చెప్పి ప్రజలకు సేవ చేయాలని బోధించిన వ్యక్తి చక్రందాసు మాస్టారు. ఆయన మాకు చేసిన సేవ వల్లే ఈ రోజు మేము మరికొంత మందికి సేవ చేయగలుగుతున్నాం' అన్నాడు డాక్టర్ రంగరాజు.

'మన ప్రాంతంలో ఎవరైనా మంచి వ్యక్తులు ఉన్నారంటే అది చక్రందాసు మాస్టారు చలవే! మన సమాజంలో ఎంతోమంది ప్రజా సేవకులను తయారు చేసేది ఉత్తమ ప్రజాసేవకులైన ఉపాధ్యాయులే. కనుక మనం సన్మానించాల్సింది చక్రం దాసు మాస్టారిని' అన్నాడు సైనికుడు చిన్నయ్య.

వారిద్దరి సహృదయానికి అక్కడ ఉన్నవారంతా ఆనందం వ్యక్తం చేశారు. ఉగాది నాడు చక్రందాసు మాస్టారును ఘనంగా సన్మానించారు.

-అమ్మిన శ్రీనివాసరాజు

కథలు పంపండి

నేస్తాలూ,

మీరు ఏమైనా కథలు రాస్తే వాటిని ఈ శీర్షికకు పంపండి. బాగున్న వాటిని వీలు వెంబడి ప్రచురిస్తాం. మీరు పంపే కథలు విజ్ఞానం అందించేవి గాను, మంచి విషయాలు బోధించేవి గాను ఉండాలి. ఇప్పటికే వచ్చిన కథలు కాకుండా మీరు సొంతంగా రాసిన కథలు పంపండి. మీ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు చూపించి వారి సంతకంతో పంపితే ప్రచురిస్తాం.



మాటలకోట - 27

1		✽	2	3			✽	5	6
	✽	7	✽		✽	✽	9	✽	
✽	10			✽	✽	11			✽
12	✽		✽	13	✽	✽		✽	14
	✽		✽	15	16	✽		✽	
17	18		✽	✽		✽	19	20	
✽		✽	21			22	✽		✽
23	✽	✽	✽	✽	✽	24		✽	25
26		✽	27				✽	28	
	✽	29		✽	✽	30		✽	

ఆధారాలు

అడ్డం

1. అశ్వం (2)
2. కళ్లజోడు (4)
5. దశకం (2)
10. అంగుళీకం (3)
11. బొరియ (3)
15. కాదని చెప్పండి (2)
17. ఒక గ్రహం (3)
19. తారుమారైన ఇక్కట్లు (3)
21. ర్థగంసయా..3,1,4,2 (4)
24. తింటే ఇది తినాలి, వింటే భారతం వినాలి (2)
26. కుట్టుటకు పనికివచ్చేది (2)
27. రూల్ (4)
28. పొదుపు, జమ (2)
29. ఏనుగు (2)
30. దిశ (2)

నిలువు

1. కొందరు ఇది తప్పకుండా మాట్లాడుతారు (2)
3. పిసినారి (2)
6. రోజు (2)
7. ఏఎన్నార్ సినిమా (5)
9. ఈ మొక్క పంటకు నష్టం (5)
12. ఇరుగు-'...' (3)
13. జబ్బులు రాకుండా ముందుగా ఇది ఇస్తారు (2)
14. కబుర్లు (3)
16. హిందీ ప్రపంచం (3)
18. అప్పు (2)
20. గృహం (2)
22. ఒక జీవ నది (4)
23. ఆటస్థలం (3)
25. ఊరడింపు (3)
27. సత్యం (2)

రంగులు వేయండి



నాకు నచ్చిన వ్యక్తి 'అంబేద్కర్'

హలో ఫ్రెండ్స్,

నాకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అంటే చాలా ఇష్టం. మన రాజ్యాంగ నిర్మాత ఆయన. ఆయన ఎవరో మనకందరికీ తెలిసినప్పటికీ నాకు తెలిసిన కొన్ని విషయాలు మీకు చెప్పాలనుకుంటున్నాను.

1891 ఏప్రిల్ 14న ఆయన జన్మించారు. ఆరేళ్ల వయసులోనే తల్లి చనిపోయింది.

మంచిపుస్తకం

ఉల్లాసం కలిగించే నసీరుద్దీన్ కథలు



'నసీరుద్దీన్ కథలు', పిల్లల బొమ్మల, హాస్య, వ్యంగ్య, యుక్తి కథలు, వెల రూ. 30/-, సోల్ డిస్ట్రిబ్యూటర్స్ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

నేస్తాలూ,

మీరు ఇప్పటికే ఎన్నో నసీరుద్దీన్ కథలు చదివి ఉంటారు. మన పత్రికలో కూడా ఇప్పటికే కొన్ని కథలు వచ్చాయి. అవన్నీ మీరు ఒకేచోట చదివేందుకు వీలుగా ఇప్పుడు ఒక పుస్తకం వచ్చింది. నసీరుద్దీన్ పేరుతో ప్రచారంలో ఉన్న కథల నుండి యాభై మూడింటిని ఎంపిక చేసి ఈ పుస్తకంలో పొందుపరిచారు. చైనా, రష్యాలోని అజర్ బైజాన్, ఆసియా, ఉత్తర ఆఫ్రికా దేశాల్లోని ప్రజలు ఇప్పటికీ నసీరుద్దీన్‌ను 'జానపద హీరో'గా కొనియాడుతారు. ఈ కథలు ఇంగ్లీషు, హిందీ, తెలుగులో వెలువడినవే. ముఖ్యమైన కథలన్నింటికీ మంచి బొమ్మలు వేశారు. భాష కూడా సులభంగా ఉంది. ఈ పుస్తకం సంకలనం, సంపాదకత్వం బాధ్యతలను ప్రతిభ చేపట్టారు. ప్రతిభ పబ్లికేషన్స్ వారు ప్రచురించిన ఈ పుస్తకం ఖరీదు రూ. 30/-. విశాలాంధ్ర వారి అన్ని బ్రాంచీల్లోనూ ఈ పుస్తకం లభిస్తుంది. అన్ని పాఠశాల గ్రంథాలయాల్లోనూ, ఇండ్లల్లోనూ ఉంచుకోదగిన పుస్తకం ఇది.

-కె.కె.

అస్పృశ్యులను చేర్చుకోరాదని బ్రిటిష్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో అంబేద్కర్ తండ్రి చురుకుగా పాల్గొన్నారు. 1907లో మెట్రిక్యులేషన్, 1913లో బి.ఏ. పరీక్షల్లో ఆయన ఉత్తీర్ణులయ్యారు. ఆ తరువాత ఉన్నత విద్యకోసం అమెరికా వెళ్లారు. అమెరికా నుండి తిరిగి వచ్చాక బారిష్టర్ చదివేందుకు లండన్ వెళ్లారు.

అస్పృశ్యత-అంటరానితనం అంటే ఏమిటో ఆయనకు చిన్నప్పటినుండే తెలిసింది. ఒకరోజు అంబేద్కర్, ఆయన మాస్టారు ఎద్దులబండిలో వెళ్తుంటే వారు మాట్లాడుకునే మాటలను బట్టి అంటరానివారని బండి వాడు గుర్తించి వారిని కిందికి తోసివేస్తాడు. అంటరానితనానికి వ్యతిరేకంగా ఆయన ప్రత్యక్ష పోరాటాలు నిర్వహించారు.

మన దేశ రాజ్యాంగ నిర్మాణ ముసాయిదా కమిటీకి చైర్మన్‌గా పనిచేశారు. కొంతకాలం పాటు న్యాయమంత్రిగా కూడా పనిచేసిన అంబేద్కర్ దళితుల ఉద్ధరణ కోసం ఎంతగానో శ్రమించారు. మీరు కూడా బాగా చదువుకొని మంచి వ్యక్తులుగా తయారవుతారు కదూ. ఉంటాను...

-కె.రాజేశ్వరి, ఎ.పి.ఎస్.డబ్ల్యు.ఆర్.స్కూల్, కాసాగార్డెన్, శ్రీకాళహస్తి.

చిన్నారి చిత్రకారులు



షేక్ లతీఫా, ఎ.పి.లింగోటం
నార్కట్‌పల్లి (మం), నల్గొండ (జి)



వై. చిరు, 7వతరగతి
చినకాకాని

ఎస్. నూక రత్నం, 10వ తరగతి
బి.సి. బాలికల హాస్టల్, చోడవరం.



ఒ. నవ్య, 2వతరగతి
జమిస్తాన్‌పూర్, హైదరాబాద్

కలంస్నేహం

పేరు : చింతా లాజరు
వయస్సు : 13
చదువు : 8వ తరగతి
హాబీలు : క్రికెట్, లైబ్రరీకి వెళ్లడం
పూర్తి చిరునామా : సన్నాఫ్ చింతా నుగుణరాజు, శంకరపాడు (గ్రా), పోలుకొండ (పో), నందివాడ (మం), కృష్ణా (జి)-521 327

పేరు : మామిడి శేఖర్
వయస్సు : 14
చదువు : 9వ తరగతి
హాబీలు : చదవడం, క్రికెట్ ఆడటం
పూర్తి చిరునామా : సన్నాఫ్ నరసింహారావు, ఆనందపురం, బి.సి.కాలనీ, విశాఖ జిల్లా

పేరు : పి. రజిత
వయస్సు : 14
చదువు : 9వ తరగతి
హాబీలు : క్యారమ్స్ ఆడటం, కథల పుస్తకాలు చదవడం
పూర్తి చిరునామా : డాటరాఫ్ వీరమయ్య, గ్రా : గుజ్జ, మం : సంస్థాన్ నారాయణపురం, జి : నల్లగొండ-508253

గత వారం జవాబులు

మాటలకోట-26

అడ్డం : 1.తూర్పు 2. యువతరం 4. ద్దంఅ 8. చీవరకు 10. సోడా 12. పీకా 13. తోలుబొమ్మలాట 16. పిచుక 20. మైనం 21. గయా 22. స్వప్నలోకం 24. పంలబ 26. రజతం 27. కంప్యూటర్

నిలువు : 1.తూఆచిచి 3. వనం 5. అమెరికా 6. కూర 7. మాడా 9. కురులు 11. రెమ్మ 13. తోక 14. బొట్టు 15. టఆ 16. పిట్టలదొర 19. మాయాబజార్ 20. మైకం 22. స్వగతం 23. లోలకం 25. మంట

రుక్మిణి

పారదర్శకం పాదరసం

... ఇవ్వాళ్టి జిల్లా పార్టీ ఇంచార్జీల సమావేశంలో అంతా మీరే తెలియజేసుకోవాలె! నేనేమీ తెలియజేసేది లేదని తెలియజేసుకుంటున్నాను. మన పార్టీని వీలున్న చోటల్లా ఈ ఓటర్లు ఎడాపెడా వాయించి వాసాలకెక్కించారో ఇపుడే తెలుసుకుని మనం జాగ్రత్త పడుకపోతే ముందు ముందు మీరెవ్వరూ టోటల్‌గా అభివృద్ధి చెందులేరు. ప్రజలకు సేవ చేసే భాగ్యం మీకు లేకుండా ప్రజలే చేసుకుంటారు. స్వర్ణాంధ్ర సాధించడంలో మీరు వెనకబడి పోతారు. ప్రజలేమో సాధించుకోవాలని తహతహ లాడుతున్నారు. సరే.. మొన్నటి ప్రజల ఛీత్కారాలకు కారణాలు నిర్మొహమాటంగా.. 'పారదర్శకం'గా చెప్పండి! మనం పరదాలన్నింటినీ ఎత్తిపారేసాం! పారదర్శకతా.. ట్రాన్సిపి రెన్సీ... ట్రాన్సో.. అన్నీ ప్రజలముందుచుతాను."

ముఖ్యమంత్రిగారి సూచన లయ్యే నరికే.. అప్పటికే కడుపులు మండిపోతున్న జిల్లాల తెలుగు తమ్ముళ్ళు చెవుల్నుండీ.. చంకల్నుండీ వేడి ఆవిర్లు చిమ్ముతూ... బుసలను ఆపుకోవడానికి యమా యాతనలు పడిపోతున్నారు.

"జిల్లాల్లో అధికార్లు మామాట వింటం లేదు - కలక్టర్లు ఎవరికి వారే నిర్ణయాలు తీసుకుంటున్నారు. మాకేం చెప్పడం లేదు - మేం ఏం చెప్పినా వినిపించుకోవడం లేదు - ఎట్లా చచ్చేదీ యాడ చచ్చేదీ!" అక్కసునంతా కక్కుతూ ఒక నాయకుడు బహు ఆయాసపడిపోయాడు.

"నేను నిద్దరపోను.. అధికార్లనెవర్నీ నిద్దర్లు పోనివ్వనని తెలియజేసుకున్నాను గదా! అధికార్లు పని చేయకపోతే వాళ్ళను వదిలేది లేదు - టెలికాన్ఫ రెన్సుల ద్వారా ఎప్పటికప్పుడు తెలియజేసుకుంటున్నాను - మీ పని మీరు చేయండి - బాగా జిల్లాల్లో తిరగండి!"

"సరేసార్! ఈ పోలీసులు న్వయానా నా బావమ్మర్దినే లోపల మూసేశారు. మొన్నటి ఎన్నికల్లో ఎప్పట్లా కాకుండా వాళ్ళు ఇటు రిగ్గింగూ.. అటు బెగ్గింగూ చేయకుండా అడ్డం పడుతున్నారు. - వాండ్లను అజమాయిషీ చేసే అధికారం మాకిస్తే 'స్వర్ణాంధ్ర'ను సాధించడం చాలా తొందరగా జరిగిపోద్ది గదా!"

"అంటే - మనం చేసేది చాలక లాగూ లటారం తగిలించుకుని లాఠీ అందుకుని పోలీసు పని కూడా కానిచ్చేద్దామనా? అదేం కుదర్దు... మీరు రెగ్యులర్‌గా పచ్చచొక్కాలేసుకుని ప్రజా సేవలు చేయండి! పారదర్శకంగా వుంటే చాలు... అసలు మనం ఎన్నికల్లో దెబ్బతిన్న కారణాలు చెప్పండి"

అందరూ మొహమొహాలు చూసుకున్నారు. వాళ్ళందరి కడుపుల్లో వుక్రోషం తన్నుకువస్తుందాయె!

"జనాలకు మొహాలు చూపించాలంటే అటు సిగ్గూ... ఇటు భయం వేస్తుంది సార్!"

"ఏం.. కాని పని ఏమన్నా కానిచ్చావా? అదేం కుదర్దు... అంతా పారదర్శకంగా వుండి తీరాలి!"

"అయ్యో!" లబలబలాడాడు. "అసలు ఈ పథకాలన్నిటితోనే వచ్చిపడింది పీకులాట! మీరేమో మీకు తోచినపుడల్లా ఒక్కో పథకం పేరు చెప్పి జనాల్ని ఊదరగొట్టి ఊరబెట్టిస్తినారు గదా! ఒక్కటంటే ఒక్కటి కూడా ఎక్కడా అమలు కావట్లేదాయె! వాటి గురించి ఎవడైనా అడిగితే ఏం చెప్పాలె? అసలా పథకాలన్నింటినీ ఏకంగా రద్దు చేసి పారేస్తే మంచిది!"

"జనాలకు ఊదరగొట్టి" ఆశలు రేగ్గొట్టడానికి మన మాన్యశ్రీ ప్రపంచ బ్యాంకు వారి సూచనల మేరకే పారదర్శకంగా ఈ పథకాలు ప్రవేశ పెట్టామని మీరు గమనించాలని తెలియజేసుకుంటున్నాను. అసలు 'మనం' ప్రవేశ పెట్టని పథకాలను 'రద్దు' చేసే అవకాశం... అధికారం మనకెక్కడిదీ? అవట్లా కొనసాగుతుండాల్సిందే!"

ఆ అడిగిన మహానాయకుడు చాలా రహస్యంగా నాలికను మడతేసి పండ్లతో కసాపిసా కొరుక్కుని తన కసిని చల్లార్చుకున్నాడు.

"ఈ 'ప్రజలతో ముఖాముఖీ'... వాళ్ళేదో అడగడం... మీరేదో చెప్పడం... జనాలు కిసకిసా నవ్వుకోవడం... మేం సహించలేకపోతున్నాం సార్... అసలు వాళ్ళడగడవేందీ.. మీరు చెప్పడవేందీ.. టీ.వీ. ప్రైవేటు చానల్ యాంకర్లా... దాన్ని రద్దు చేసి పారేస్తే పోలా!" గుబులు పడుతూ చెవట్లు తుడుచుకుంటూ అడిగాడు మరోనాయకుడు. "పారదర్శకం సంగతి మీరు మరిచిపోవడం ఏం బాగా లేదు. మనమేం చేయలేమో నిత్యం ప్రజలకు తెలియజెప్పకపోతే మనకు నిద్రపట్టదు. ఈ లోపున వాళ్ళు నందు చూసుకుని చాపేసుకుని నిద్దర్లు పోతారు. వాళ్ళు నిద్దరపోతే అభివృద్ధి అంతటితో ఆగిపోద్ది - అదీ.. అందుకని వాళ్ళకు సమస్య లున్నా... లేకపోతే మనమే ఒక సమస్యగా మారైనా దాన్ని తీరుస్తామనుకుంటూ పోవడమే మన 'పారదర్శక' ప్రభుత్వ లక్షణం! మనం రోజూ జనాలకు కనపడ్డం.. వినపడ్డవే మన ప్రభుత్వ పాలసీ!" ముఖ్యమంత్రి రుసరుసలాడాడు.



"అసలు ఈ రైతులందరికీ ఉచితంగా కరంటిస్తే పీడాపోయిరి. కరంటు దెబ్బకే మన ఓట్లన్నీ కకావికలైపోతున్నవి... మనముల్లేం పోయింది? వాళ్ళ కరంటు వాళ్ళకిచ్చేదానికి మనం చార్జీలు పెంచుడేంది? వాళ్ళు పబ్లీకున మనల్ని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టుడేందీ?"

ఆ తెలుగు తమ్ముడు గారు కండ్లు మూసుకుని తన మానాన తాను ఈ మాటలు చెబుతుండగానే ఒక్కసారిగా వున్నట్లుండి ఆయనగారి ఒళ్ళంగా దిగచెవట్లు పట్టి తడిసి ముద్దయి పంచె అంచునుండి చెవట్లు ధారలుగా కారుతుండడంతో తెప్పరిల్లి కండ్లు తెరిచి చూస్తే ఏముంది? మొత్తం అందరి పరిస్థితి అదే! చంద్రబాబుగారేమో నిప్పులు మింగినట్లు మొహంపెట్టి నోరు బార్లా తెరిచి పొగలు చిమ్ముతున్నాడాయె!

"ఇస్తామయ్యా... ఇపుడు కరంటు.. రేపు పొలాలకు నీళ్ళు...ఆనక తాగేందుకు నీళ్ళు... పీల్చడానికి గాలీ... తింటానికి బియ్యం... అన్నీ జనాలు కొనక్కర్లేకుండా ఉచితంగానే ఇచ్చేద్దాం... నీ ముల్లేం పోయింది.. ఆ...!" ఒక్కొక్క ఉక్కిరి బిక్కిరవుతూ ఆ జిల్లా తమ్ముడు కూలబడ్డాడు. "ఉచితంగా కరంటో అంటివా.. వెంటనే మొత్తానికి మొత్తం ఈ కరంటూ.. ఇదుగో ఏ.సీ., ఫ్యానూ ఎట్లా బిగదీసుకుపోయాయో చూడు! అసలివన్నీ మన చేతిలో వుంటేగదా జనాలకివ్వడానికి? అవతల అప్పిచ్చిన వాడికి 'స్వర్ణాంధ్ర' కోసం ఏవేవో సూచనలూ.. షరతులూ అంటే కుదువ కట్టు... అప్పుఫాయిదాల కింద అమలేసి అమ్మిపారేయడానికే అగ్రిమెంటు చేసుకుంటిమి! జనాలకు ఇవ్వడానికి ఏదీ లేదు - అంతా పారదర్శకం.. ట్రాన్సిపిరెన్సీ.. ట్రాన్సో..!" ఆ మాట అంటుండగానే ఒక్కసారిగా గప్పుమని లైట్లూ.. ఏ.సీ. వచ్చేసి అంతా ఊపిరి పీల్చుకుని ఇక కరంటు.. గాలీ, నీరూ, బియ్యం - 'ఉచితం' అంటే ఆ పెద్దమేద మెడమీద సరిగ్గా కూలుతుందన్నంతగా హడలిపోయారు! "గవన్నీ పోనివ్వండి సార్! మరీ మన ప్రజలకి ఏదీ అందుబాటులోకి లేకుండా చేస్తే వాళ్ళూ మనకందకుండా పోతారేమో? నా మనవి ఏమిటంటే జనాలకు సారా పాకీట్లు గానీ సప్లయిచేస్తే... అహం... ఉచితంగా కాదనుకోండి.. బ్రెమ్మాండం! అందరూ తెగమెచ్చుకుంటారు.. డాక్రా మహిళలు మనవాళ్ళేనాయె! మళ్ళీ గ్యాసు బండలూ... రివాల్వింగ్ ఫండూ అంటే గమ్మునుంటారు...!" అందరూ మొహాలు మతాబాల్లా వెలిగించడంతో ఆ జిల్లా తమ్ముడుగారు మరింతగా రెచ్చిపోయాడు. "అహం... అసలు ఇట్లాంటి అత్యవసర సరుకుని సబ్సిడీ కిందనో.. వీలయితే సంవత్సరం పొడుగునా... ఎలక్షన్లన్నింటిలో ఎవనికి బడితే వానికి.. ఎపుడుబడితే అపుడు పాకెట్లు గుమ్మిపారేస్తే బాగుంటుంది!"

అతను మరీ రెచ్చిపోతుండగా చంద్రబాబుగారు అడ్డుకున్నారు. "అది మన ప్రపంచ బ్యాంకు షరతుల్లో ఎక్కడా లేదు గాబట్టి... వారి సలహా కూడా అడిగి తర్వాత ప్రకటిద్దాం! మనం ఏది చేసినా అంతా పారదర్శకం.. ట్రాన్సిపిరెన్సీ, ట్రాన్సో" "మనం ఎలక్షన్లలో బాగా దెబ్బతింటానికొక్కారణం ఈ జన్మభూములే! ఎందుకంటే అవి బాగా పాతబడిపోయినై! మనం ఎవరం కూడా ఇప్పట్లో వాటికి హాజరయ్యే పరిస్థితి లేదు - ఊర్కె చేసిన పనీ... చెయ్యని పనీ.. లిస్టులన్నీ చదివితే జనాలు ఊరుకోటం లేదు.. నిలబెట్టి నిలదీస్తారు. నోడలాఫీసర్ల నోర్లాడం లేక నిద్దర్లు కూడా పోడం లేదు - 'ఎవడి పని వాడే చూసుకోవాలనే' మన 'పారదర్శకం' జనాల్లోకి ఇవ్వటికే పాదరసంలా ప్రవహించింది.

"నర్సరే.. వాటిని సంవత్సరానికి ఒకటి రెండుసార్లు జరిపించేద్దాం గానీ.. అసలు అట్లాంటిది లేకపోతే మీకు ఛోటా - బడా కంట్రాక్టులు... స్వయానో, బినామీ పేర్లతో ఎట్లా లంకించుకుంటారు? ఎట్లా 'పారదర్శకం'గా వుంటారు - మీ ఇష్టం!"

అప్పటికే వాళ్ళకిదంతా చాలా చీదరగా చీకాకుపడిపోతున్నారు - ఏదీ.. ఎటూ తేలడం లేదాయె! ఇదే విధంగా కొనసాగితే రేపు తమగతి ఏమిటో అస్సలు అర్థం గాదాయె! "సార్.. అసలు ఈ రెండేళ్ళలో మనం చేసిన 'అభివృద్ధి' అర్థంగాక మా మతులే పోతున్నాయి - ఊరికే ఊదరగొట్టడవే సరిపాయె!"

"సరే... సరే... మిమ్మల్ని మీ జిల్లా పార్టీ షని తీరును సమీక్ష చేయమంటే మీరేమో మన మూల సూత్రాల్నే సమూలంగా మార్చేద్దామంటారు. మీరు ప్రజలకు మన పచ్చచొక్కా పార్టీ గురించి బాగా ప్రచారం చేయడం లేదు. ఏ పథకానికి ఎన్నెన్నిసార్లు ఎన్నెన్ని కోట్లు కేటాయిస్తున్నామో.. చెప్పడం లేదు - స్కూళ్ళకు సున్నాలు.. రోడ్లూ.. ఇ-గవర్నెన్స్.. హైటెక్.. నెక్లెసురోడ్డు... రంగు దీపాలు.. ఐ.టీ... టూరిజం... చీకోక్ హీలింగ్.. ఈ అభివృద్ధి పథకాలన్నింటినీ వాళ్ళకు బాగా వివరించండి!" "ఎవనికని వివరించేది? తిండి దొరక్క... పనుల్లేక... కరువునబడి కూలినాలి జనాలు ఊర్లొదిలి వలసలు పోతున్నారు గదా!"

"అదీ మంచిదే! జనాభా నియంత్రణలో మన పారదర్శకత ప్రపంచ బ్యాంకు ప్రణాళికలలో ఒక భాగం! వాళ్ళంతా పక్క రాష్ట్రాలకు తరలిపోతే మరీ మంచిది! ప్రపంచమే ఎల్లలు చెదిరిపోయి ఒక కుగ్రామమైపోతుంది గదా! అంతా పారదర్శకం.. ట్రాన్సిపిరెన్సీ... అంతా పాదరసంలా ప్రవహించి పోతుంది!"

చాలా మంది బయట వరండాల్లో.. స్థంబాల మాటునా కసిగా జుట్టు పీక్కుంటున్నారు. కొందరు గోడకు తలలు బాదుకుంటున్నారు! ☆



టైటానిక్ ఓడ, ఎదురుగా సముద్రం

కనువిందు చేసే కైలాస గిరి

యాసలపు సూర్యారావు

రాష్ట్రంలోని పర్యాటక కేంద్రాల్లోకెల్లా చెప్పుకోదగిన స్థాయికి ఎదుగుతున్నది విశాఖ నగరానికి తలమానికంగా నిలిచే అందమైన ప్రదేశాలలో ఒకటైన కైలాస్‌గిరి. ఇక్కడ వున్న ఒక ఎత్తైన కొండను సుందరమైన యాత్రా స్థలంగా మలిచారు. వందలాది మంది సందర్శకులు నిత్యం ఆ కైలాస్ పర్వతం పైకి వెళ్ళి సందర్శించడం జరుగుతుంది. ఈ కైలాస్ పర్వతం విశాఖ పట్నంలోని రామకృష్ణ బీచ్‌కు ఒక కిలో మీటర్ దూరంలో వుంటుంది. ప్రతి నిత్యం పగటి పూట కొండపైకి వెళ్ళేందుకు సిటీ బస్సులు వుంటాయి. ఆ పర్వతాన్ని అందమైన ప్రదేశంగా తీర్చిదిద్దేందుకు హుడా సంస్థ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. ఆ పర్వతానికి కైలాస్ పర్వతం అని పేరు రావడానికి కారణం కొండపైన అమర్చిన శివపార్వతుల అందమైన రెండు విగ్రహాలే. అక్కడ ప్రతి అంగుళం నేలను అందమైన పూల మొక్కలతోనూ, క్రోటన్ మొక్కలతోనూ తీర్చిదిద్దారు. వరుస క్రమంలో పెంచిన గుల్ మొహర్ చెట్లు ఎర్రని పూలతో విరబూసి చూపర్లను కనువిందు చేస్తాయి. ఈ పర్వతంపైన వున్న ఒక ఎత్తైన ప్రాంతాన్ని ఓడగా మలిచారు. ఆ ఓడకి టైటానిక్ ఓడగా నామకరణం చేశారు. టైటానిక్ పర్యాటకులను అబ్బురపరుస్తుంది. కైలాస్ పర్వతానికి ఒక వైపున వున్న మహాసముద్రం పర్వతాన్ని తాకుతూ వుంటుంది. పర్వతంపై నుంచి సముద్రాన్ని తిలకించే వారికి సముద్రం మధ్యన ఒక అందమైన దీవిలో మనం వున్నామా అనిపించకమానదు. అక్కడ అమర్చిన టైటానిక్ ఓడపైకి పర్యాటకులు ఎక్కి అందమైన సముద్రపు దృశ్యాన్ని తిలకిస్తే టైటానిక్ ఓడలో తాము సముద్రంలో ప్రయాణం చేస్తున్నట్లు అనుభూతికి లోనవుతారు. సూర్యకిరణాలు సోకిన సముద్రపు కెరటాలు సముద్రంలో వికసించిన వెండిపూల జల్లులా మెరిసిపోతూ కన్పిస్తాయి. నీలిమ ఛాయగల ఆకాశం నీలి వర్ణపు సముద్రం రెండు కల్సిపోయినట్లు వుంటుంది. ఆ దృశ్యాన్ని చూస్తే మహదానంద భరితమైన సుందర ఆకృతులు కళ్ళముందు దర్శనమిస్తాయి. సముద్రపు కెరటాల తాకిడికి పడిలేస్తున్నట్లుండే పడవలు దూరంగా లంగరేసుకున్న విదేశీ, స్వదేశీ ఓడలు దర్శనమిస్తాయి. మరోప్రక్క విశాఖ మహానగరం, పర్వతంపై నుండి తిలకించే వారికి అదంతా ఒక మహా చిత్రకారుడు చిత్రించిన మహానగరపు అపూర్వ చిత్రం గోచరిస్తుంది. పై నుండి కన్పించే అందమైన దృశ్యాలను మరింత చేరువగా తిలకించేందుకు అక్కడ దూరదర్శన్ యంత్రాలను అద్దెకిస్తారు. వాటిలో చూసి మరింత చేరువగా అందాలను తిలకించవచ్చు. అలాగే 'కైలాస్‌గిరి'కి చేరువలో అందాలు చిందించే హుడా పార్క్ వుంది. ఈ పార్క్‌లో ఎన్నో వింతలు, అందమైన రకరకాల పూల మొక్కలు, పిల్లలను, పెద్దలను ఆకర్షించే మరెన్నో కట్టడాలు అక్కడ మనకు అనిర్వచనీయమైన ఆనందాన్ని కల్గిస్తాయి. అలాగే కైలాస్ గిరికి దగ్గరలోనే సముద్రపు ఒడ్డునే మరో పర్వతం కూడా వుంది. ఆ పర్వతాన్ని తపస్సు కొండని పిలుస్తారు. ఇది కైలాస పర్వతానికి రెండు కిలో మీటర్ల దూరంలో వుంటుంది. ఈ పర్వతాభివృద్ధికి ప్రభుత్వంగాని, పర్యాటక కేంద్రం గాని ఏ రకమైన శ్రద్ధ పెట్టకపోవడం విచారకరం. అయినా అక్కడికి పర్యాటకులు విశాఖ, దానిచుట్టు పక్కల గ్రామాల నుండి వస్తూనే వుంటారు. ప్రైవేట్ వ్యక్తుల కిళ్ళీ షాపుల వంటి చిన్న చిన్న వ్యాపార సంస్థలు అక్కడ వెలిసాయి. యాత్రికులు సాయంత్రం నాలుగు గంటలకల్లా సముద్రంలో స్నానం చేస్తూ బంధుమిత్రులతో అక్కడ కాలక్షేపం చేస్తారు. పైన పేర్కొన్న ఈ పర్యాటక కేంద్రాలను తిలకించేందుకు రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా ఇతర రాష్ట్రాలనుండి కూడా యాత్రికులు వస్తూ వుంటారు. అపుడపుడు విదేశాల నుంచి వచ్చిన యాత్రికులు కూడా ఈ యాత్రా స్థలాన్ని సందర్శిస్తారు. అయితే కొన్ని ప్రదేశాలు బహిరంగ బీరులుగా కూడా తయారై జులాయిలుగా తిరిగే వారు ఇలాంటి చోట త్రాగి తందనాలు ఆడడం వల్ల భార్యా పిల్లలతో, బంధుమిత్రులతో వచ్చే పర్యాటకులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఆడవారు రావడానికి మరింత ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం వారు ఇలాంటి ప్రదేశాలకు చేరువలో బ్రాందీ షాపులు, బార్లు వంటి వాటికి అనుమతివ్వరాదు. ఏ రకమైన మత్తు పదార్థాలు అమ్మకుండా, బయటి నుంచి తెచ్చుకొని అక్కడ తాగడాన్ని కూడా అక్కడ నిషేధించాలి. అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి. పర్యాటకులకు అవసరమైన మరిన్ని సౌకర్యాలు చేపట్టేందుకు చొరవ తీసుకోవాలి. ☆

కైలాసగిరిపై శివపార్వతుల విగ్రహాలు

రాలిన చెస్ మొగ్గలు

మారేపల్లి లక్ష్మణ్

మాధురి

అరవై నాలుగు గదుల చదరంగం ఆటలో అసమాన ప్రతిభతో ఎత్తులకు పైఎత్తులు వేస్తూ ప్రత్యర్థులను ఉక్కిరి బిక్కిరి చేసే రాష్ట్ర చెస్ పసిమొగ్గలు అయిదు విధి ఆడిన చదరంగంలో సరైన ఎత్తులు వేయలేక అర్ధాంతరంగా వైదొలిగాయి. ఈ చెస్ మొగ్గలు విరబూస్తున్న తరుణంలో రాలిపోయాయి. అద్భుత ప్రతిభ చూపుతూ అంతర్జాతీయ టైటిల్స్ సాధిస్తున్న చిన్నారులను చూసి గర్వంతో ఉప్పొంగుతున్న తెలుగుజాతిని ఒక్కసారిగా నిరాశలో పడవేశారు. ఒక్కొక్క మెట్టే ఎక్కుతూ ఉన్నత శిఖరాలకు చేరువకావడానికి ఎన్నో గమ్యస్థానాలను నిర్దేశించుకుంటున్న వారికి రోడ్డు ప్రయాణం మరణ శాసనం రాసింది. ఒరిస్సాలోని పూరిలో జరగబోయే స్పాస్ స్కైక్లబ్ ఫైడ్ రేటింగ్ చెస్ టోర్నీలో పాల్గొనడానికి వెళుతూ రోడ్డు ప్రమాదంలో ఉజ్వల భవిష్యత్తు వున్న చెస్ పసి కూనలు అయిదుగురు మృత్యువాత పడ్డారు. వారిలో ఆసియా అండర్-10 బాలికల ఛాంపియన్ దాసరి మిను, పదకొండేళ్ళ ఆసియా అండర్-10 బాలుర మాజీ ఛాంపియన్ మేకల అభినవ్‌తో పాటు ప్రకాశంకు చెందిన పది సంవత్సరాల హరిచరణ్, గోదావరిఖనికి చెందిన శేఖర్, హైదరాబాద్‌కు చెందిన ఎనిమిది ఏళ్ల మాధురి వున్నారు. ఇంటర్నేషనల్ మాస్టర్, చెస్ గురువు గిరినాథ్ తీవ్ర గాయం పాలుకాగా, మరో ఇద్దరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. వీరి మరణ వార్తతో రాష్ట్రం ఒక్కసారిగా విషాదంలోకి వెళ్ళింది. ఇటీవలి కాలంలో క్రీడల్లో రాష్ట్రం పేరు అంతర్జాతీయ స్థాయిలో మారుమ్రోగిపోతుండంగా అదే స్థాయిలో గాయాలవల్ల మృత్యు ఒడి చేరండం వల్ల తారలను కొల్పోతున్నది. సంవత్సరం వ్యవధిలోనే జిమ్నాస్ట్‌లు రమేష్, విజయ్‌కుమార్ తీవ్రగాయాల పాలై పోటీలకు దూరంగా వుండగా, మరో వర్ధమాన జిమ్నాస్ట్ ప్రమాదపుటంచుల్లో వుండి క్రీడకు శాశ్వతంగా దూరమైనాడు. హాకీ క్రీడాకారిణి, క్రికెట్ క్రీడాకారిణి గాయాలపాలయ్యారు. ముఖ్యంగా రాష్ట్ర కీర్తి ప్రతిష్టలను అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింపచేసిన ఘనత చెస్ క్రీడకే దక్కుతుంది. చెస్ రాజధానిగా హైదరాబాద్ మారుతున్న ప్రస్తుత తరుణంలో ఉచ్ఛదశలో వున్న అయిదుగురు క్రీడాకారులు మృత్యుఒడికి చేరడం నిజంగా రాష్ట్ర చెస్‌ను అంధకారంలో ముంచింది. ☆

చెస్ క్వీన్ మిను

చెస్‌లో ఓనమాలు నేర్చుకున్న ఏడాదిన్నరలోపే పదేళ్ల బాలికల విభాగంలో ఆసియా ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్న దాసరి మిను ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందినది. ఒంగోలు శివాని పబ్లిక్ స్కూల్లో ఆరవ తరగతి చదువుతున్న మిను రాత్రి పది, పదకొండు గంటల వరకు తోటి పిల్లలతో కలిసి చెస్ ఆడుతుంటే తండ్రి ధనుంజయ్ విసుక్కునేవాడేమో కాని, బ్యాంకు ఉద్యోగి అయిన ఆమె తల్లి రాణికుమారి మాత్రం ప్రోత్సహించేది. తండ్రి ధనుంజయ మద్దిపాడు కళాశాలలో యు.డి.సి.గా పనిచేస్తుండగా తల్లి

రాణికుమారి హైదరాబాద్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పనిచేస్తున్నారు. చెస్‌లో మినూకు ప్రత్యేక కోచింగ్ ఇప్పించేందుకు హైదరాబాద్‌కు బదిలీ చేయించుకున్నారు. ఆమె ప్రోత్సాహం వృథా కాలేదు. నిరుడు జూన్‌లో విజయవాడలో జరిగిన సెలెక్షన్లలో రాణించడంతో హైదరాబాద్‌లో విప్రో గ్రాండ్ మాస్టర్ చెస్ టోర్నమెంట్ జరిగినపుడు మిను రష్యన్ గ్రాండ్ మాస్టర్ గిల్ఫర్ వద్ద ప్రత్యేక శిక్షణ పొందింది. తదనంతరం రాష్ట్ర చెస్ ఛాంపియన్, ఇంటర్నేషనల్ మాస్టర్ గిరినాథ్ వద్ద శిష్యరికం చేశాక ఆమె ఆటతీరు ఎంతో మెరుగైంది. రాష్ట్ర ఛాంపియన్‌షిప్‌లో 12 ఏళ్ల బాలికల, 14 ఏళ్ల బాలుర విభాగాల్లో ప్రథమ స్థానాల్లో నిలచింది. డిసెంబర్‌లో అహ్మదాబాద్‌లో జరిగిన 14వ బాలల జాతీయ చెస్ పోటీల్లో తొమ్మిదేళ్ల లోపు బాలికల విభాగంలో రన్నరప్‌గా నిలవడంతో ఆసియా ఛాంపియన్‌షిప్‌కు అర్హత పొందింది. బికనీర్‌లో పదేళ్లలోపు బాలికల విభాగంలో స్వర్ణపతకం గెలవడం ద్వారా ప్రపంచ అండర్-10 ఛాంపియన్‌షిప్‌కు అర్హత పొందడమే కాకుండా, ఛాంపియన్ హోదాలో వచ్చే ఆసియా చెస్ పోటీల్లోనూ పాల్గొనే అవకాశాన్ని అందిపుచ్చుకుంది. తన తదుపరి ఆశయం ప్రపంచ ఛాంపియన్ అవ్వడమే అని చెప్పే మిను ఆ ఆశ తీరకుండానే అనంత లోకాలకు చేరింది.

చదరంగంలో ఏకలవ్యుడు అభినవ్

అసమాన ప్రతిభ కనబరిచి సంచలనాలు సృష్టించి పసిప్రాయంలోనే జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించిన మేకల అభినవ్ నల్గొండ జిల్లా నడిగూడెం మండలం చెన్నకేశవపురం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, అరుణల కుమారుడు. కోదాడ సిటీ సెంట్రల్ స్కూల్లో ఏడో తరగతి చదువుతున్న అభినవ్ 1990 జూన్‌లో జన్మించాడు. అయిదవ ఏట నుంచే చదరంగంలో ఓనమాలు నేర్చుకున్న అభినవ్ కొద్దికాలంలోనే ప్రాంతీయ, జాతీయ స్థాయిలో పలు టైటిల్స్‌ను సాధించాడు. పాఠ్య పుస్తకాలతో పాటు చెస్‌కు సంబంధించిన పుస్తకాలను కూడా వదిలిపెట్టకుండా చదివి తన క్రీడకు పదును పెట్టుకొని చెస్‌లో ఏకలవ్యుడిగా ఎదిగాడు. ప్రాథమిక దశలో పాఠాలు నేర్పే ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో చురుగ్గా పావులు కదపడం నేర్చుకున్నాడు. అతనికి స్థానికులైన జాతీయ క్రీడాకారులు రామ్‌దాస్, శివకుమార్ కోచ్‌లుగా అవతారమెత్తి చెస్ మేధస్సుకు పదును పెట్టారు. ఇంగ్లీష్ ఓపెనింగ్ తన ఫేవరేట్ వ్యూహమని చెప్పే అభినవ్ 1999లో నల్లగొండ జిల్లా ఛాంపియన్‌షిప్ గెలుచుకొని తన జైతయాత్రను మొదలుపెట్టాడు. అతని నిరంతరం శ్రమకు తొందరలోనే ఫలితం దక్కింది. గత ఏడాది మార్చిలో ఇరాన్ రాజధాని టెహరాన్‌లో జరిగిన ఆసియా జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొని వివిధ దేశాలకు చెందిన చిన్నారులను ఓడించి బాలుర విభాగంలో అండర్-10 టైటిల్ సాధించాడు. అంతకు ముందు జాతీయ చెస్ పోటీల్లో పాల్గొని 18, 14 స్థానాలు పొందిన అభినవ్ 1999 డిసెంబర్‌లో ఔరంగాబాద్‌లో జరిగిన జాతీయ బాలల చందరంగం పోటీల్లో రన్నరప్‌గా నిలిచాడు. తొమ్మిది రౌండ్లకుగానూ ఎనిమిదో రౌండ్ ముగిసేసరికి ఏడుపాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగిన అభినవ్ తన కంటే ఒక పాయింట్ వెనకబడివున్న దాసరి శ్రీనివాస్ చేతిలో ఓటమి చెంది రెండో స్థానంతో తృప్తి పడాల్సి వచ్చింది. 13వ జాతీయ చెస్ ఛాంపియన్‌షిప్‌లోనూ అభినవ్ ద్వితీయ స్థానం పొందాడు. హైదరాబాద్‌లో గత జనవరిలో జరిగిన గ్లోబల్ చెస్ టోర్నమెంట్‌లో ఒకరిద్దరు రేటెడ్ క్రీడాకారులను ఓడించి భవిష్యత్తులో ప్రపంచ ఛాంపియన్‌కాగల లక్షణాలు తనలో వున్నాయని చాటిచెప్పాడు. ఉన్నత శిఖరాలను అధిరోహించి సీనియర్ల మన్ననలను పొందాడు. దేశ ఖ్యాతిని అంతర్జాతీయ గగన వీధిలో సమున్నతంగా నిలుపుతాడని చెస్ పండితులు భావిస్తున్న తరుణంలో విధి వక్రించింది.

బలి వితర్ది

డా॥ కాలువ మల్లయ్య



నీలో నువ్వు... నీలోకి నువ్వు... ఒంటరిగానే.. నీ గదిలో... మధన పడ్తున్నావు. సంఘర్షణ పడుతున్నావు.... నీలోకి నువ్వే చూసుకుంటున్నావు.... ప్రపంచంలోకి చూస్తున్నావు.... సమాజంలోకి తొంగి చూస్తున్నావు.... పరిస్థితుల్ని చూసి దుఃఖిస్తున్నావ్... రోదిస్తున్నావ్... అంతర్మధనానికి గురవుతున్నావు... నీ గదిలో నీవొంటరిగా....

నూటికి నూరుపాళ్ళు ఫలితాలు సాధిస్తున్న కళాశాల... ప్రతిభావంతులైన విద్యార్థుల్ని తయారు చేస్తున్న కర్మాగారం.... ఇంటర్ ఫైనల్ విద్యార్థుల వీడ్కోలు సభలో నువ్వు మాట్లాడాలి... ముఖ్య అతిధిగా సందేశాన్నివ్వాలి...లే... లేచి తయారవు... గడియారం దిక్కు చూసావు.. ఇంకా చాలా సమయమే ఉంది... ఆలోచనల్లోకి కూరుకుపోతున్నావు నువ్వు...

ఏది సుఖం...? జీవఫలం...! జీవితంలో సుఖం లేదా? ఉంది... లేదు... ఉంది... లేదు... సుఖదుఃఖాలు సమ్మేళనమే జీవితం... నిధి చాలా సుఖమా? నిధి మాత్రమే ఉంటే అన్ని సుఖాలొస్తాయా? డబ్బుంటే అన్నీ ఉన్నట్టేనా? ఊరు మేల్కొనే ఉంది.. ఏరూ మేల్కొనే ఉంది... ఊరు రాత్రుల్లో నిద్రపోతుందేమో కాని ఏరు మాత్రం నిరంతరం పారుతూనే ఉంటుంది. నిరంతరం చలనశీలనం గలది ఏరు.... ఒక సూర్యుడు సమస్త జీవులకు తానొక్కడై తోచు... కర్మసాక్షిలా ప్రతి ఒక్కరూ తమ తమ విధులను సక్రమంగా నిర్వహిస్తే దుఃఖముంటుందా? విధి నిర్వహణలో ఎంత సుఖముంది..? కాని ఎవరికీ వద్దు... బాధ్యతలొద్దు.... డబ్బు... డబ్బు కావాలి.. ఎలా వచ్చినా ఫర్వాలేదు... ఇంతకీ డబ్బే సుఖమా? డబ్బే సర్వస్వమా? డబ్బున్న వాడిదే రాజ్యమా? బలవంతుడ నాకేమని విర్రవీగితే చలిచీమల చేతజిక్కి చచ్చిన బలవంతమైన సర్పం గతి పడుతుంది... మరా చలి చీమల్లో ఐక్యతేది...? ఏమో.... ఉంది... లేదు... ఉంది.. ఉంటే ఉండనీయ్... లేకుంటే లేదు....

ఒంటరిగా... నువ్వొంటరిగా... ఒంటరిగా ఉంటే ఎన్ని పిచ్చిపనులైనా చెయ్యొచ్చా....? నాగరికత పేరు మీద అనాగరిక చర్యలు.. ఆ మానవీయత... విలువల ధ్వంసం.. వ్యభిచారం... డబ్బు చుట్టూ తిరుగుతున్న మనిషి.. ప్రపంచమే డబ్బు చుట్టూ తిరుగుతుంది? ఇంతకీ వ్యభిచారం సుఖమా..? పురుషుడు వ్యభిచరిస్తే తప్పులేదా? నీకది నచ్చదు... శీలమంటూ ఉంటే ఎవరికైనా ఒక్కటే.. ఆడమగ భేదం వద్దు. ప్రపంచాన్ని ఎయిడ్స్ కబళిస్తోంది.. అక్వైర్డ్ ఇమ్యూనో డిఫీష్యిన్సీ సిండ్రోమ్ భయంకరమైన వ్యాధి. ఎయిడ్స్ భూతం శరీరంలో ఒక్కొక్క కణాన్ని తినేస్తుంది. రోగనిరోధక శక్తిని మటు మాయం చేస్తుంది. ఫలితం -మరణం.. చివరకు రావాల్సింది... మధ్యలోనే అకాల మరణం... తాత్కాలిక సుఖాల కోసం అకాల మరణం... భయంకర వ్యాధి ఎయిడ్స్.. ప్రపంచమంతటా వ్యాపిస్తుంది. పోనీ... పోనీ.. ఎవరెక్కడ పోతే నీకేమిటి? దేశమేమన్నా కానీయ్... ప్రపంచమెటన్నా పోనీయ్.. ఎవరేమైతే ఏంటని నువ్వార్కోగలవా... నో... నో.. అది నీ వల్ల కాదు.. ఇటీజ్ క్వైట్ ఇంపాసిబుల్ టుయూ.. చిన్ని నా పొట్టకు శ్రీరామ రక్షంటే నీకు నచ్చదు.

"నాన్నా...! ఏం చేస్తున్నారు...? ఏదో ఆలోచిస్తున్నట్టున్నారు... ఇంట్లో ఎవరూ లేకుంటే ఆలోచనల్లో మునిగి పోతారు..."

ఇంట్లోకొస్తూ అన్నారు చిన్నారులు.. పదవ తరగతి చదువుతున్న కవల పిల్లలు.. పెద్దవాడు పుట్టిన తర్వాత ఏడేళ్ళకు కలిగిన జంట సంతానం...

పనివాళ్ళు.. కల్లా కపటం ఎరగని చిన్నవాళ్ళు... పాపం, పుణ్యం, ప్రపంచ మార్గం ఏదీ తెలియని కూనలు... ఎప్పుడేలుకుంటారో మీ రాజ్యాన్ని? ఎంత హింస? మీ మీద ఎంత హింస? మిమ్మల్ని వేధించుకుతింటున్నాం... అలుకగా, హాయిగా ఉండాల్సిన చదువు పేరు మీద హింస... భరించరాని హింస... ఆట పాటలకు... సృజనాత్మకతకు.. అన్నిటికీ దూరం చేసి పుస్తకాలకే పరిమితం చేసిన హింస... తూనీగల్లా ఎగరాల్సిన వయస్సులో గదిలో బంధించి చదవండని వేధిస్తున్న హింస... చదువూ చదువంటూ కాల్చుక, మాడ్చుక తింటున్న హింస... పిల్లల మీద భరించరాని ఒత్తిడి. ఇంట్లోంచి అడుగు బయట పెడితేనే చంపేస్తానన్న బెదిరింపులు... పాఠ్యపుస్తకాలు తప్ప మరేవీ ముట్టవద్దని ఆజ్ఞల జారీ..

కారణాలెన్నున్నా పిల్లల్ని చంపుకతింటున్నారు. చదువు పేరు మీద రాచి రంపాన పెడ్తున్నారు. నిధి కోసమా? చదువులతో వచ్చే డాలర్ల కోసమా? నీకు డాలర్ భ్రమలున్నాయా? నీకుండనంత మాత్రాన నిన్ను కుదురుగా ఉండనిచ్చేదెవరు...?

"ఏంటి నాన్నా...? మేమొచ్చింది కూడా గమనించకుండా అంత సీరియస్‌గా ఆలోచిస్తున్నారు....?"

"ఏం లేదు... ఏం లేదు..." చిన్నారుల దిక్కు జాలిగా చూసావు.

ఇంతవరకు పక్కింట్లో వున్న నీ శ్రీమతి ఇంట్లోకొచ్చింది.

"అంతే... మీ నాన్న అంతే.. ఆయనలోకమే వేరు.. ఎవరికి వారు తాము తమ పిల్లలను అమెరికాకు పంపడం లాంటి విషయాల గూర్చి ఆలోచిస్తుంటే ఈయనకేమో దేశం కావాలి.... ప్రపంచం కావాలి.." అంది వెటకారంగా....

ఆ మాటలకు నువ్వేం సమాధానమివ్వలేదు.

"డ్రెస్ మార్చుకొని ఫ్రెష్‌గా తయారవండి.. పాలు తాగి ఓ అరగంట ఆడుకొని రండి... ఆ తర్వాత చదువుకోండి..."

పిల్లలు బాత్‌రూమ్ దిక్కు పరుగెత్తారు...

"టెన్త్ చదివే పిల్లల్ని ఆడుకొమ్మంటున్నారు... మీరే అలుసిచ్చి పాడు చేస్తున్నారు...." రుసరుసలాడుతూ వెళ్ళిపోయింది నా శ్రీమతి..

మళ్ళీ నీ గదిలో నీవొంటరిగా... ఒంటరిగానే నా గదిలో మంచంలో పడుకొని పై కప్పుకేసి చూస్తున్నావు. నీ కళ్ళముందు శర్మ... నా మిత్రుడు రామలింగేశ్వర శర్మ.

గొడగొడా భోరుభోరున ఏడుస్తున్నాడు శర్మ... గదిలో కూడా! ఒంటరిగా ఏడుస్తున్నాడు.. తనివితీరా ఏడుస్తున్నాడు... తాను పిల్లలను చదువూ చదువని దండిస్తున్నాడు... హింసిస్తున్నాడు... పోటీ... పోటీ... విపరీతమైన పోటీ.. ఆ పోటీని తట్టుకోవాలంటే హింస తప్పదు. తమలాంటి తల్లిదండ్రులకు హింస తప్పదు... వేదన తప్పదు.. ఒత్తిడిని తట్టుకోడానికి ఏడ్వకా తప్పదు.. తనకలా పిల్లల్ని నిర్బంధానికి గురి చేయడం నచ్చదు..

కాని లోకంతో లొటలొటా... నలుగుర్తో నారాయణ...

విపరీతమైన ఒత్తిడి... పిల్లల కోసం ఒత్తిడి... పిల్లల చదువుల కోసం ఒత్తిడి... టెన్షన్... టెన్షన్... టెన్షన్... ఎంతో టెన్షన్‌తో బతికాడు శర్మ... ఎప్పటికీ పిల్లల గురించి ఆలోచనే... విపరీతమైన ఒత్తిడి... ఫలితం... విపరీతమైన హైపర్ టెన్షన్... అంత ఒత్తిడిని తట్టుకోలేకపోయిందతని గుండె... టకీమని ఆగిపోయింది... నిద్రలోనే శాశ్వత నిద్రలో కొరిగిపోయాడు... ఒత్తిడి... ప్రపంచాన్నే కుదిపేస్తున్న ఒత్తిడి... శర్మ ప్రాణాన్ని బలిగొన్న ఒత్తిడి....

నువ్వూ పిల్లల్ని చదువుల పేరు మీద హింసిస్తున్నావు... నువ్వూర్కున్నా నీ భార్య ఊర్కోనివ్వదు... శర్మంత కాకున్నా చదువు పేరు మీద నీ పిల్లలు హింసననుభవిస్తూనే వున్నారు. ఎందుకు..? ఈ చదువు హింస దేనికి? డబ్బు..... డబ్బు.... డబ్బు... అమెరికాకు పంపి డబ్బు సంపాదించడానికా? డబ్బుకోసం యువకుల్ని విదేశాలకర్పణ... బలి... దేశం నీకేమిచ్చిందని అడిగేవాళ్ళే అంతా...

దేశం... కృషి... మానవత్వం... అంతా ట్రాష్ అంటోందా యువతరం...? డబ్బు... స్వార్థం... నేను... నా సుఖం.. క్లబ్బులు.. కార్లు... ఇదేనా సుఖమంటే...?

గోల... ప్రచార, ప్రసార సాధనాల గోల... వస్తు సంస్కృతిపై మోజును పెంచుతూ ఒత్తిడికి గురి చేస్తున్న ప్రసారసాధనాలు... ఇరవై నాలుగు గంటలు విషం చిమ్ముతూ... తీవ్రమైన ఒత్తిడికి గురి చేస్తూ... విపరీతమైన ఒత్తిడిలో మధ్య తరగతి జనం... ప్రమాదపుటంచుల్లో... నువ్వూ శర్మలాగే ఎప్పుడో నిద్రలోనే పైకి పోవడం ఖాయం...

తప్పదు.. తప్పదు ఒత్తిడి... రాలిపోవుటున్...

"ఏంటీ... మీ ఆలోచనలకంతే లేదా...? ఏమాలోచిస్తున్నారంతగాను...?"

కాఫీ కప్పుతో నీ గదిలోకొచ్చింది రాజ్యం... నీ కెదురుగా కూర్చుంది. బ్రేక్... నీ ఆలోచనలకడ్డుకట్ట... లేచి కూర్చున్నావు.. రాజ్యం కెదురుగా..

"ఏంటీ..? దేశం గూర్చేనా ఆలోచించేది..?"

"అవును.. నేను దేశం గూర్చే ఆలోచిస్తున్నాను... దేశం గురించేం కర్మ...? ప్రపంచం గురించాలోచిస్తున్నాను.. ఇది నీకు రాచకార్యంలా లేక నీచకార్యంలా కనబడకేం చేస్తుంది...? ఓ దిక్కు దేశం కాలిపోతోంది... ప్రపంచం కాలిపోతోంది... టీవీ సంస్కృతి చిమ్మే విషం ప్రపంచమంతా వ్యాపిస్తోంది... డబ్బు సంస్కృతి చిమ్మే కాలకూట గరళం నరనరానా జీర్ణించుకుపోతోంది. అయినా నిమ్మకు నీరెత్తినట్లుండమంటావు...? మన పెద్దవాడిని దేశం విడిచి పొమ్మనే కదా నువ్వు చెప్పేది... ఈనగాచిన చేనును నక్కలపాలు చేసే దాకా నీకు నిద్రపట్టదా? నా కొడుకును నా దేశానికి కాకుండా చెయ్యిమంటావా?

అనాలనుకున్నావు... కాని ఒక్కమాటా నోరు దాటి బయటకు రాలేదు... నీలో నువ్వే గొణుక్కున్నట్లనుకున్నావు.. రాజ్యం ముందు బయటపడే ధైర్యం నీకు లేదు... ఏం మాట్లాడకుండా కాఫీ తాగుతున్నావు..

"ఏంటీ? మాట్లాడరెందుకు...?"

"ఏం మాట్లాడమంటావో చెప్పు...!"

"నేను మాట్లాడమన్నదే మాట్లాడతారా...?" కోపంగా చూసింది నిన్ను.

"అదేనోయ్... దేన్ని గురించి నువ్వనేది..!"

"మన బాబును అమెరికా పంపడం గురించి...'

అది నువ్వూహించిందే అయినా నీ గుండె గుభేలుమన్నది...

"వాడు పోదల్చుకుంటే ఊరుకుంటాడా? ఈ కాలపు పిల్లలు గదా..."

"ఎంతయినా వాడు మీ రక్తం కదా...! మీ బుద్ధులే వచ్చాయి వాడికి. చదువులో నెంబర్ వన్.. ఇంజనీయర్.. ఇక్కడుంటే ఏముంది? అమెరికాకు పోవడానికి అవకాశాలున్నాయి కదా! మనం ఒప్పించైనా పంపించాలి..."

"వానికి మంచి నౌకరీ ఉంది కదా ఇక్కడ...?"

నీ మీదికి గుగ్గిలంలా లేచిందామె..

"ఇరవై వేల నౌకరో నౌకరా? అక్కడయితే నెలకు రెండు లక్షలకు పైన్నే జీతముంటుంది... ఇక్కడి పది నెలల జీతం...."

"ఇక్కడి ప్రమాణాలతో అది మంచి జీతమే కదా...!"

"ఇదో జీతమట... ప్రమాణాలట... అక్కడ హాయిగా బతుకుతాడు..."

"అక్కడికి పోయిన వాళ్ళెవరూ మళ్ళీ వచ్చి ఇక్కడ స్థిరపడ్డ దాఖలాలు లేవు... అంటే మన అబ్బాయిని వదులుకున్నట్టే కదా...!"

"రాకుంటే రాకపోనీయ్... ఫోన్లో మాట్లాడతాడు.. పదేళ్ళకోసారైనా వస్తాడు.. మనమూ ఓటి రెండు సార్లు పోవచ్చు... డబ్బు పంపుతాడు..."

డబ్బు కోసం బంగారం లాంటి కొడుకును వదులుకోవడానికి ఏ మాత్రం వెనుకాడటం లేదు రాజ్యం...

బలి... బలి... డబ్బు కోసం పిల్లల్ని విదేశాలకు బలి... స్వసుఖాల మోజులో దేశానికి దూరంగా....

నీ కళ్ళవెంట నీళ్ళు రావడానికి సిద్ధంగా వున్నాయి. బలవంతంగా ఆపుకుంటున్నావు...

"సరే... వాడు పోతానంటే పంపిద్దాం..."

"మీరొప్పిస్తే వాడు తప్పకుండా పోతాడు..."

"ఓ.కె. అలాగే చేద్దాం.."

ఖాళీగ్లాసులు తీసుకొని వెళ్ళిపోయిందామె...

మళ్ళీ నీ గదిలో నీవొంటరిగా... నీ మెదడే ఓ ఆలోచనల పుట్ట... చదువులు... ఈ చదువులు... సాహిత్యం, చరిత్ర, సాంఘిక శాస్త్రాల వంటి వాటిని వద్దంటున్నాయి.... అంతా ఇంజనీరింగ్... కంప్యూటర్... సాఫ్టువేర్.. వద్దు... భాషలు వద్దు... సాహిత్యం అసలే వద్దు... మాతృభాషను చదవనే చదవొద్దు... ఇలాగే కొనసాగితే అంపారమైన మన సాహిత్యసంపద...? భవిష్యత్తులో మనకు దొరికేదెవరు...? గొప్ప టెక్నోక్రాట్స్... ఇంజనీర్స్.. అంతే... అంతే... మహా అయితే ఇంటలిజెంట్ బ్రూట్స్... గొప్ప గొప్ప రాజకీయ నాయకులు... సంఘసేవా తత్పరులు.... గొప్ప గొప్ప రచయితలు దొరకనే దొరకరు...

"నాన్నా మేమొచ్చాం.... ఇక చదువుకుంటాం..."

లేచి నిల్చున్నావు నువ్వు... డ్రెస్ చేసుకున్నావు.. టైం చూసుకున్నావు... క్విక్... క్విక్ టైమవుతుంది... వాళ్ళిచ్చిన టైమవుతుంది... పోవాలి... ఆ కాలేజికి వెళ్ళాలి... చెప్పులేసుకొని కాలేజీ దిక్కు నడుస్తున్నావు...

మనమెక్కడికి పోతున్నాం...?

పదండి వెనుకకు... పదండి తోసుక....

పదండి పోదాం.... వెనుకెనుకకు....

పదండి పోదాం... వెనక్కి... వెనక్కి...

నీ నాలుక మీద ఈ మాటలే ఆడుతున్నాయి...

మనం వెనక్కి పోతున్నామా..? అవును... పోవాలి... పోవాలి... మనం వెనక్కే పోవాలి...

కొందరి నుండి అందరికా....? కాదు... కాదు...

అందరి నుండి కొందరికి... మనం వెనక్కే పోదాం...

ఆటవిక స్థితి నుండి... రాచరిక స్థితి నుండి... సుదీర్ఘ ప్రయాణం చేసివచ్చాం....

మళ్ళీ... మళ్ళీ... పోదాం పోదాం వెనక్కి...

మనకదే సరైందా..? వెనుకకు పోతే తప్పేంటి...? మోటెడ్లు వెనుకకు నడవడం లేదా...?

నాటేసే స్త్రీలు వెనుకకు నడవడం లేదా...?

మోటల అవసరం తీరినా మనం వెనక్కే పోవాలి...

పదండహో పదండి... వెనుకెనుకకు పదండి...

కులాల పేరు మీద కుమ్ములాడుకుందాం... మతాల పేరు మీద మారణహోమం చేద్దాం...

ఆలోచిస్తూ నడుస్తున్నావు నువ్వు... నడుస్తూ ఆలోచిస్తున్నావు... మంచి చెడ్డని ఎంచి చూడగ....

మనుజులందున రెండే కులములు.. అన్నాడు గురజాడ... మంచి చెడ్డల సంగతి మనకిప్పుడొద్దు..

పోదాం... ప్రైవేటైజేషన్ దిక్కు పోదాం... మధ్య తరగతి మీద దెబ్బగొడుదాం... పారిశ్రామికవేత్తలను బలిపిద్దాం...

వద్దు... మాకు పేదరికం నిర్మూలనం వద్దు... కంప్యూటర్లు కావాలి...

ఆకలి చావుల గూర్చి మాటలు వద్దు... ఐ.టి.లు కావాలి...

అన్నమోరామచంద్రా జీవితాలు వద్దు.... హైయ్యర్ టెక్నాలజీ కావాలి...

గ్రామాల గూర్చి మాట్లాడనే వద్దు... అర్బనైజేషన్ కావాలి...

బహిర్భూమికి మైళ్ళ దూరం నడవాలి... అయినా సరే వందలాది టీవీ ఛానల్లు కావాలి...

బ్రెయిన్ డ్రెయిన్... అయిపోతూనే ఉంది...

నీలో నువ్వే మదనపడుతున్నావు... బ్రెయిన్ డ్రెయిన్ కావడం గూర్చి ఆందోళన చెందుతున్నావు.

భూతం... భూతం... గ్లోబల్ భూతం...

అన్నిట్నీ మాయ చేస్తుంది. మనల్ని మనకు కాకుండా చేస్తుంది..

నేలను తన్నుతూ నడుస్తున్నావు నువ్వు.

దమ్ములేస్తుంది.. అయినా అలాగే నడుస్తున్నావు..

మృత్యుహేల... ముఖాల్లో మృత్యుహేల... నగ్నంగా భయోద్విగ్నంగా...

అరెబై జేబులో ఒక్క పైసా లేకున్నా సర్కారు బళ్ళో చదువుకున్నాం.. మరి ప్రైవేట్ విద్య ఏం కాబోతుంది... అందరికీ విద్య అందని విద్యగా మారుతుంది కదా..! విద్య గగన కుసుమం అవుతుంది...

ఎక్కడివాళ్ళక్కడ గప్‌చుప్.. చేపలు పడుతూ... గొర్లు మేపుతూ...బర్లు గాస్తూ... బట్టలుతుకుతూ... చెప్పులు కుడుతూ... కుండలు చేస్తూ బతకాల్సిందే కొందరే చదువుకుంటారు... అదీ డబ్బున్నవాళ్ళు..

భూమి గుండ్రంగా [illegible] కాబోతుందా...?

నీకయితే అలాగే అనిపిస్తుంది...

మరావృత్తి పనులయినా ఉంటాయా? [illegible] మటుమాయం...

"ఎటు పోతున్నారు సార్... [illegible] ఉన్నట్టున్నారు..."

నీ వెనుకొస్తున్నాయన [illegible] అన్నాడు... ఉన్నట్టున్నారు... లేనట్టు లేరు.. ఉన్నట్టు లేరు... లేనట్టున్నారు... మాటల గారడీ... ప్లస్సే... మైనస్... మైనస్... ప్లస్ మైనస్... మైనస్ ప్లస్...

"ఎట్లేదు.. కాలేజీలో పనుంది... అటే పోతున్నాను..."

"నేలను చూసుకుంటూ నడవండి సార్..."

(మిగతా 23వ పేజీలో



సంస్కరణ ఊబిలో మునిగిపోతున్న దళిత సంక్షేమం

పేజీలు : 100, **వెల :** రూ. 25, **ప్రతులకు, వివరాలకు :** హైదరాబాద్ బుక్ ట్రస్ట్, ఫ్లాట్ నెం. 85, బాలాజీనగర్, గడిమల్కాపూర్, హైదరాబాద్ - 500 028.

ఇదిగో సాక్ష్యం... ఎక్కడ దళిత సంక్షేమం!?

ప్రపంచీకరణ వల్ల అందరికీ లాభం వుందని ఇంకా బుకాయించే వాళ్ళ వాదనలకి "సంస్కరణ ఊబిలో మునిగిపోతున్న దళిత సంక్షేమం" పుస్తకం సరైన సమాధానం ఇస్తుంది. గ్లోబలీకరణ వల్ల ఎస్సీ, ఎస్టీ, బి.సి.ల సంక్షేమం బాధ్యతల నుండి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తప్పుకుంటున్నాయి. మార్కెట్ ఎకానమీ సాంఘిక సంక్షేమాన్ని రద్దు చేసి, తనకు అనుకూలమైన ప్రతిపాదనల్ని చేస్తుందని అనేకమంది ఆర్థిక వేత్తలు, వామపక్ష వాదులు చేస్తున్న వాదనల్ని కొంతమంది దళిత మేధావులు ఇంకా వేళాకోలం చేస్తూనే వున్నారు. ప్రపంచీకరణ దళితులకు ప్రయోజనకరమని చంద్రభాను ప్రసాద్‌లాంటి కాలమిస్టులు రాస్తూనే వున్నారు. దళితులు నమ్మట్లేదనుకోండి!

ఈ పుస్తకం ఎస్.ఆర్.శంకరన్, వి.హనుమంతరావు, ఆంబ్రోస్ పింటో, సుఖదేవ్ థోరత్, సచ్చిదానందలు ఇంగ్లీషులో రాసిన వ్యాసాలకు తెలుగు అనువాదం. ప్రభుత్వ పథకాలపై ఎస్.ఆర్.శంకరన్ సన్నాయి నొక్కులు నొక్కినప్పటికీ ప్రపంచీకరణలో భాగంగా వున్న 'ప్రైవేటు రంగంలో ఎస్సీ, ఎస్టీలకు ఏ మాత్రం స్థానం లేదు. కేవలం బండచాకిరీ చెయ్యాల్సిన చోటో, కిందిస్థాయి నౌకర్ల ఉద్యోగాల్లోను తప్పించి వారికి వేరే అవకాశం కల్పించటమన్నది ప్రయివేటు రంగంలో ఎక్కడా లేదు. "విదేశాల్లో ఉపాధి ఉద్యోగాలు సంపాదించుకుంటున్న లక్షలాది మందిలో ఎస్సీ ఎస్టీలు దరిదాపుగా లేరు" అని వాస్తవాన్ని తెలిపారు. మార్కెట్ వ్యవస్థ ఫలితాల్ని ఇలా వివరించారు. "మార్కెట్ వ్యవస్థలపై న్యాయ విభాగాలకు పట్టు ఉండదు. భాగస్వామ్యానికి, సమూహత్వానికి స్థానం లేని విధానాల వల్ల ధనికులు ఇంకా ధనికులు అవుతారు. బలహీనులు, పేదలు మరింతగా దిగజారుతారు. మార్కెట్ల కనుసన్నల్లో ఉండే సమాజం సంపన్నులను మరింత సంపన్నులుగా మారుస్తుంది. పేదలను కడు బీదలుగా చేస్తుంది." పదేళ్ళ సంస్కరణల ఫలితాలు ఇదేనన్నది గమనించాలి.

ప్రభుత్వాల వైఫల్యాలను గణాంకాలతో విశ్లేషించి, చీల్చి చెండాడే ఆర్థికవేత్త వి.హనుమంతరావు. వీరిచ్చిన గణాంకాలు సంస్కరణలు ప్రారంభించిన నాటి నుండి సాంఘిక సంక్షేమం ఎలా రద్దు చేయబడుతుందో తెలుసుకోటానికి దోహదం చేస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ పద్దు కింద సాంఘిక సంక్షేమానికి 1991-92లో 5.87 శాతం ఖర్చు చేస్తే 1999-2000లో 3.03 శాతానికి దిగజారింది. ఆయన 'అణగారిన వర్గాల ప్రజలను ఒక పథకం ప్రకారం ఇంకా ఎలా అణగదొక్కడానికి ప్రయత్నిస్తుందో వెల్లడవుతుంది' అన్నారు. మొత్తం సామాజిక సంక్షేమానికి చేసిన ఖర్చులో ఎస్సీల ఖర్చు శాతం పదేళ్ళలో 4.4 శాతం నుండి 2.5 శాతానికి పడిపోయింది. 'ఎస్సీల పట్ల ప్రభుత్వం శీతకన్ను వేసిందనడానికి ఇది తిరుగులేని సాక్ష్యం.' ప్రభుత్వంలో ప్రతిశాఖ తనకు కేటాయించిన నిధులలో 15 శాతం ఎస్సీలకు ఖర్చు చేయాలనేది ప్రభుత్వ ఆదేశం. ఒక్క సంవత్సరం (1993-94)లో తప్ప మిగతా తొమ్మిది సంవత్సరాల్లో పది శాతం మించి ఖర్చు చేయలేదని గణాంకాలు చెబుతున్నాయి. విద్య, రిజర్వేషన్లు, ఉపాధి కల్పన, సామాజిక భద్రత, ఆరోగ్యం వంటి అనేక పార్శ్వాల్ని స్పృశించి చివరగా "52 సంవత్సరాల తర్వాత కూడా ఎస్సీల పరిస్థితులు ఇలా ఉండటం దారుణమైన నేరం. నేరాన్ని అదుపు చేయాల్సింది ప్రభుత్వం. కాని, ప్రభుత్వమే నేరాన్ని పెంచి పోషిస్తుంటే నేరాలకు బలి అవుతున్న వారు తమను తాము రక్షించుకోవడానికి సిద్ధం కావటం తప్ప మరో మార్గం లేదు." 'ఈ కథ ఇక మలుపు తిరగాలి' అని కర్తవ్యాన్ని బోధించారు. 'దళితుల సాధికార సాధనకు రిజర్వేషన్లే మార్గమా' అని ఆంబ్రిస్ పింటో రిజర్వేషన్ల అమలులో వైఫల్యం, కాలేజీ, యూనివర్సిటీల్లో వాటి అమలు తీరు, రిజర్వేషన్ల విధాన ప్రభావం, ప్రత్యామ్నాయ మార్గాలేమిటి? వంటి అనేక కోణాల నుంచి పరిశీలన చేశారు.

ఎస్సీలు అధికంగా దారిద్ర్యరేఖకు దిగువన వున్నారని సుఖదేవ్ థోరాత్ తెలిపారు. 1993-94లో గ్రామీణ ప్రాంతాలలో దాదాపు 48 శాతం ఎస్సీ కుటుంబాలు దారిద్ర్యరేఖకు దిగువన వున్నారు.

ఆయనిచ్చిన గణాంకాలు 'కులంతో ముడిపడి వున్న ఆర్థిక అసమానతలు సమాజంలో ఇంకా కొనసాగుతున్నాయని స్పష్టం చేస్తోంది.' కుల ప్రాతిపదికతో కూడిన మార్కెట్ వివక్ష ప్రాముఖ్యతను అర్థం చేసుకొనేందుకు అతికొద్ది అధ్యయనాలే ప్రయత్నించాయని ఆయన ఆవేదన ప్రకటించారు. సూక్ష్మస్థాయిలో జరిపిన అధ్యయనాలు అంటరాని వారి పట్ల మార్కెట్లో వివక్ష ఉన్నట్లు వెల్లడిస్తున్నాయని, కొంతమంది అధ్యయనాలను వివరించారు. సామాజిక పోరాటంతో పాటు ఆర్థిక రంగాల్లో ఎస్సీ, ఎస్టీలకు జరుగుతున్న అన్యాయాన్ని, దోపిడీని వ్యతిరేకిస్తూ పోరాటం చేయాలి. ప్రపంచీకరణ మీద భ్రమలు తొలగని దళిత మేధావులు ఎవరైనా వుంటే వెంటనే ఈ పుస్తకం చదవటం మంచిది.

- జిలుకర శ్రీనివాస్

స్వీకారం



మతోన్మాద పోకడలలో సకల రంగాలను విద్వేష విషంతో నింపివేయడమే కాక అవధులు లేని అవినీతితో ఈ ప్రభుత్వం ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నది. సామ్రాజ్యవాద అమెరికాకు తాబేదారుగా మారిన వాజ్‌పేయి ప్రభుత్వం అలీన శాంతి కాముక విధానాలకు తిలోదకాలిచ్చింది. వివిధ రంగాలలో ప్రభుత్వ పోకడలను రేఖామాత్రంగా వివరించడానికి ఈ పుస్తకం ఉపయోగపడుతుంది. సి.పి.ఐ.(ఎం) కేంద్ర కమిటీ విడుదల చేసిన నాలుగు కరపత్రాలను ఇందులో పొందుపరిచారు. మతోన్మాద రాజకీయాలపైనా, వినాశకర ఆర్థిక విధానాలపైనా, అవినీతిపైనా పోరాడే ప్రతి ఒక్కరికీ ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడగలదు.

వాజ్‌పాయి ప్రభుత్వమా!

విధానాలు మార్చుకో! లేకుంటే దిగిపో!!

ప్రచురణ : భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటీ, **వెల :** రూ. 3/-, **ప్రతులకు :** ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు



నిర్దిష్ట డిమాండ్లతో తెలంగాణా ప్రాంత అభివృద్ధి సాధించేందుకు సమైక్యంగా పోరాడటమే మన ముందున్న కర్తవ్యం. వెనుకబడిన తెలంగాణా ప్రాంతం కాని ఇతర ప్రాంతాలు కాని అభివృద్ధి చెందడానికి తెలుగు ప్రజలందరూ ఒక్క తాటిపై నిలిచి ముందుకు సాగాలి. కాని వేర్పాటువాద నినాదాలతో చీలికలు పెట్టి పదవులు, అధికారాలు సంపాదించుకో జూసే స్వార్థపర నేతల కుత్సిత వ్యూహాలకు బలి కారాదు. చారిత్రికంగా ఏర్పడిన తేడాలు ఏమైనప్పటికీ తెలుగు ప్రజల మధ్య భాష, సంస్కృతి ప్రాతిపదికన ఏర్పడి ప్రజాతంత్ర పోరాటాల క్రమంలో పెరిగిన అనుబంధం ఇప్పుడు సమతూకంతో కూడిన అభివృద్ధికై సమైక్య సమరశీల పోరాటాలు చేయడానికి బాట చూపాలి. రాష్ట్రాన్ని దేశాన్ని కూడా దేశ విదేశ బడా పెట్టుబడిదారులకు ఫలహారంగా సమర్పిస్తున్న పాలక వర్గాల దుష్ట విధానాలను తిప్పికొట్టాలని చెప్పిన ఈ పుస్తకాన్ని ప్రతి ఒక్కరూ చదవాలి.

తెలంగాణా అభివృద్ధికై సమైక్యంగా పోరాడుదాం

ప్రచురణ : భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటీ, **వెల :** రూ. 3/-, **ప్రతులకు :** ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

సాదాసీదాగా

సప్తమ రాష్ట్రస్థాయి నాటికల పోటీలు

దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత డా॥ అక్కినేని నాగేశ్వరరావు జన్మదినాన్ని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా ఏదో ఒక కార్యక్రమం జరుపుతున్నారు. అందులో భాగంగానే సెప్టెంబర్ 20-23 తేదీల్లో అక్కినేని నాగేశ్వరరావు నాటక కళాపరిషత్, యువకళావాహిని ఆధ్వర్యంలో సప్తమ రాష్ట్రస్థాయి నాటికల పోటీలు-2001 జరిగాయి. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన ఈ పోటీల్లో మొత్తం 11 నాటికలను ప్రదర్శించారు.

విదేశాలపై మోజు, అక్కడి వాతావరణం వలన మాతృదేశాన్ని ఏ విధంగా చిన్నచూపు చూస్తున్నదీ అన్న అంశంపై నాలుగు నాటికలు ఉన్నాయి. ముఖ్యంగా అమెరికా వెళ్లి నివసిస్తున్న వారు కుటుంబ సభ్యుల పట్ల ఎంత అలక్ష్యంగా ఉంటున్నారో తెలియచెప్పడానికి ఈ నాటికలు ప్రయత్నించాయి. 'మేలుకొలుపు' నాటికలో తల్లిదండ్రుల షష్టిపూర్తికి రావాల్సిన పిల్లలు, తల్లి చావుకు వస్తారు. వచ్చిన దగ్గర నుండీ వారిలో కొంచెం కూడా బాధ కనపడకపోగా వెంటనే కర్మకాండలు ముగించి వెళ్లిపోయే ప్రయత్నంలో ఉంటారు. కనీసం వారికి దు:ఖం కూడా రాకపోవడంతో డబ్బు ఇచ్చి ఒక పిల్లవాడితో ఏడిపిస్తారు. విదేశాలకు వెళ్ళిన వారు ఇంత కఠినంగా ఉంటారా అన్న ఆలోచన ఓ వైపు వస్తున్నా విదేశీ జీవితం కుటుంబ సభ్యుల మధ్య అనురాగ ఆప్యాయతలను దూరం చేస్తున్నదన్న స్పృహ కలగక మానదు. అమెరికా వెళ్ళిన కొడుకు తమను చూడటానికి ఒక్కసారి కూడా రాకపోగా తండ్రికి తెలియకుండా వచ్చిన మనవడిని చూసి ఓ వృద్ధ దంపతులు ఏ విధంగా స్పందించారన్నదే 'ఎడారి కోయిల' నాటిక సారాంశం. నాటిక ఆద్యంతం మంచి బిగువుతో నడుస్తుంది. ఎంతమాత్రం అతిశయోక్తులు లేకుండా సాగే ఈ నాటికలో వృద్ధ దంపతులుగా నటించిన వారు తమ పాత్రలకు పూర్తి న్యాయం చేశారు. రాయలసీమలోని ముఠా కక్షల జీవన నేపథ్యాన్ని దీనికి జోడించడం నాటికపై రచయితకున్న పట్టును తెలియచేస్తుంది.

రొటీన్‌కు భిన్నమైన అంశాలతో వచ్చిన నాటికల్లో దేవుడు కావలెను, గాలి-హోరు-మైదానం ఉన్నాయి. గొప్ప పనులు చేసే వారే గొప్ప వ్యక్తులు అవుతారని, దేవుని కోసం మనుషులు దానవులుగా మారవద్దన్నదే ఈ నాటిక సారాంశం. ఇక్కడ మతోన్మాదాన్ని ప్రత్యేకంగా రచయిత ఎత్తి చూపారు. ఎవరి మత విశ్వాసాలు వారికి ఉంటే బాగానే ఉంటుంది. కానీ అవతలి మతం కంటే నా మతమే గొప్పదన్న భావమే మత ఘర్షణలకు కారణమని చెప్పడానికి రచయిత ప్రయత్నించారు. అయితే ఇది చాలా సున్నితమైన అంశం కనుక రచయిత కొన్ని జాగ్రత్తలు తీసుకొని ఉండాల్సింది. ఇప్పటి వరకు మనదేశంలో హిందూ మతోన్మాదమే అధికం. ఆ తరువాత అక్కడక్కడ ముస్లిం మతోన్మాదులు ఉన్నా క్రిస్టియన్లలో మతోన్మాదులు మాత్రం లేరు. అలాంటి సంఘటనలు జరిగిన ఆధారాలు కూడా లేవు. మతోన్మాదానికి అత్యధికంగా బలైంది క్రిస్టియన్లే. అయితే రచయిత ఒక సందర్భంలో 'మనం కూడా మాన భంగాలు చేయాలి జీసస్' అని అంటారు. ఇది వారి హృదయాలను గాయపరిచే అవకాశం ఉంది. చెప్పాల్సిన సందేశం స్పష్టంగా ఉన్నా రచయిత, దర్శకుడు కలిసి దాన్ని నెరవేర్చలేకపోయారనే చెప్పాలి. ఇక గాలి-హోరు-మైదానం నాటిక మనిషిలోని అత్యాశను ఎత్తి చూపుతుంది. తోడెవరూ లేని ఓ కోటీశ్వరుడు, గోల్డ్‌మెడల్ పొందినా ఉద్యోగం రాని నిరుద్యోగి, వయసు దాటుతున్నా పెళ్ళి కాని యువతి చనిపోవాలని నిర్ణయించుకొని ఒకే చోటుకి చేరుకుంటారు. అక్కడ ఓ సర్వర్ ఇచ్చిన సలహాతో ఆ యువకుడు, యువతి పెళ్ళి చేసుకొంటారు. వారికి పుట్టిన బిడ్డను కోటీశ్వరుడికి దత్తత ఇచ్చి అతడ్ని చంపివేస్తే ఆస్తంతా తమదే అవుతుందని ఆశపడ్డారు. ఆ ప్రయత్నంలో కొడుకునే చంపుకొంటారు. ఒకరిని మోసం చేసే ప్రయత్నంలో తామే మోసానికి గురైన అంశంతో గతంలో నాటికలు వచ్చినప్పటికీ వైవిధ్యమైన సంభాషణలతో నాటిక ఆద్యంతం ఆకట్టుకుంటుంది. రచయిత తనికెళ్ళ భరణి చాలా పదునైన, అర్థవంతమైన సంభాషణలు రాశారు.

'రూల్స్ ఒప్పుకోవు'లో ఓ దృశ్యం

వయసు మీద పడుతున్న కొద్దీ ఆందోళన చెందే మనస్తత్వం గల వ్యక్తి చివరకు ఆత్మహత్యకు ప్రయత్నించే అంశంతో 'ఇప్పుడు', సంపాదన ముఖ్యమనుకొని విలువలను దూరం చేసుకొనే అంశంతో 'సద్గతి', విలువలకు కట్టుబడి కన్నకొడుకుని కూడా చంపుకునే అంశంతో 'నిజాయితీ', ఉత్తముడైన మాజీ భర్త జబ్బుతో బాధపడుతుంటే అతనికి సేవ చేసేందుకు ప్రియుడిని వదులుకున్న అంశంతో 'సుశీల', దోపిడీకి గురి కాబడ్డవాడే నేరస్తుడు అని చెప్పే 'మోసం' నాటికలు కూడా ఫరవాలేదనే రీతిలో సాగాయి. అయితే సాంకేతిక అంశాలు మాత్రం అనేక సార్లు ప్రేక్షకులను ఇబ్బంది పెట్టాయి. ఒకటి రెండు నాటికలకు తప్ప మిగతా అన్ని నాటికా ప్రదర్శన సమయాల్లో ఏదో ఒక సాంకేతిక లోపం కొట్టొచ్చినట్టు కనపడింది. నాటకం నడుస్తుంటే సంబంధం లేని శబ్దాలు ఏవో వినిపించడం, నటుల డైలాగులు పూర్తికాక ముందే లైట్లు ఆర్పి వేయడంతో పాటు చాలా సందర్భాల్లో ఉచ్చారణ సరిగా వినిపించలేదు. మైకులు, స్పీకర్లకు సంబంధించి జాగ్రత్తలు తీసుకుంటే బాగుండేది. దాదాపు నగం నాటికలు ఈ సంవత్సరం నంది నాటకోత్సవంలో ప్రదర్శించినవే ఉన్నాయి. వాటిల్లో కొన్ని పరిషత్‌ల వారు నంది నాటకోత్సవంలో వేసినంత నాణ్యతతో వేయలేకపోయారు.

పోటీల అనంతరం మొదటి బహుమతి 'రూల్స్ ఒప్పుకోవు', రెండవ బహుమతి 'ఎడారి కోయిల', మూడవ బహుమతి 'మేలుకొలుపు' నాటికలకు లభించాయి. ఉత్తమ రచనగా 'ఇప్పుడు' (డా॥ పి.వి. రామ్‌కుమార్), ఉత్తమ కేరక్టర్ నటుడిగా నునుము కోటిశివ (మేలుకొలుపు), ఉత్తమ దర్శకుడిగా గంటా రామమోహనరావు, ఉత్తమ హాస్యనటుడిగా తాళాబత్తుల వెంకటేశ్వర్‌రావు (గాలి-హోరు-మైదానం), ఉత్తమ నటుడిగా కె.ఎస్.టి.శాయి (రూల్స్ ఒప్పుకోవు), ఉత్తమ నటిగా ఎం.రత్నకుమారి, ఉత్తమ సహాయనటునిగా నాయుడు గోపి (ఎడారికోయిల) ఉత్తమ సహాయ నటిగా ఎం. జగదీశ్వరి, ఉత్తమ విలన్‌గా పి.టి.మాధవ్ (మోసం) ఎంపికయ్యారు. సెప్టెంబర్ 20వ తేదీన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర సమాచార శాఖామంత్రి డా॥ఎస్.శివప్రసాద్, డా॥ అక్కినేని, సారిపల్లి కొండలరావు తదితరులు పాల్గొనగా బహుమతి ప్రదానోత్సవ సభలో రాష్ట్ర న్యాయశాఖ మంత్రి పి.చంద్రశేఖర్, డా॥అక్కినేని, జె. గీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

-కంభాలపల్లి కృష్ణ

లాయర్ మీ వద్దకు రావాలా?

కర్రా ఎల్లారెడ్డి



సాయంత్రం ఐదు గంటలు.
కోర్టు ఆవరణ.

కోర్టు ఉద్యోగులు, కోర్టు పనుల కోసం వచ్చిన వాళ్ళు ఇళ్ళకు వెళ్ళిపోతున్నారు.

ఆ రోజు రోడ్డు ప్రమాదాల కేసుల్ని లోక్-అదాలత్‌లో తొందరగా పరిష్కరిస్తారని ఎంతో ఆశతో వచ్చిన బాధితులు, ప్రమాదాల్లో చనిపోయిన వారి బంధువులు నిరాశతో తిరిగి ఇళ్ళకు వెళుతున్నారు. వారి కేసులు రాజీ కాలేదు. కారణం లోక్‌అదాలత్ ఆగిపోయింది. లోక్ అదాలత్‌కు న్యాయవాదులు సహకరించమన్నారు. దానిక్కారణం ఓ విలేకరి లాయర్ల గురించి రాసిన వార్త. ఆ విలేకరి కూడా ఒక అడ్వకేట్. లాయర్‌గా ప్రాక్టీస్ చేసుకుంటూనే ఓ ప్రముఖ తెలుగు దినపత్రికలో లీగల్ రిపోర్టర్‌గా పని చేస్తున్నాడు. కోర్టు తీర్పులు, శిక్షలు, లోక్ అదాలత్‌ల నిర్వహణ గురించి వార్తలు రాస్తాడన్నమాట.

ఈ రోజు పేపర్లో అతనో బాంబు పేల్చాడు. న్యాయవాదులందరిపై తీవ్రమైన ఆరోపణలు చేశాడు. ఆయన పత్రికలో ఏం రాశాడంటే – న్యాయవాదులు దోపిడీదారులు, మోసగాళ్ళు అని ఆ వార్త గురించి ఇంకా వివరాలు తెలుసుకునే ముందు –

ఇక్కడ రెండు నిమిషాలు ఆగి, అసలు లోక్‌అదాలత్ అనగానేమి? వీటివల్ల ప్రజలకు జరుగు లాభం ఏమిటి? అని ఆలోచిద్దాం.

లోక్ అదాలత్ అంటే అర్థం ప్రజా న్యాయ పీఠం (ప్రజాకోర్టు అన్నా కరెక్టే కాని – వేరే అర్థం వస్తుంది కనుక – ప్రజా న్యాయపీఠం అనటమే బెటర్!) ఈ ప్రజా న్యాయపీఠం ముందు వాది ప్రతివాదులు తమ కేసులను రాజీ చేసుకోవచ్చు. మరో విధంగా చెప్పాలంటే మీ ఊళ్ళో జరిగే పెద్ద మనుషుల తీర్పులు, ఈ ప్రజా న్యాయపీఠం తీర్పులు ఒకలాగే ఉంటాయి. తగాదా పడ్తున్న ఇద్దర్నీ కూర్చోబెట్టి రాజీ మార్గంలో వారి సమస్యలను పరిష్కరిస్తారు. ఆ ఇరువర్గాలు చెప్పిందంతా వింటారు. ఈ ప్రజా న్యాయపీఠంలో ఒక జడ్జి, ఒక న్యాయవాది, మరొక సంఘ సేవకుడు సభ్యులుగా ఉంటారు. వీరు వాది, ప్రతివాదులు చెప్పిన వివరాలు కోరికలు విని వారికి ఏం కావాలో తెలుసుకుని ఇరుపక్షాలు సమ్మతించిన మేరకు వారి పూర్తి అనుమతితో తీర్పు చెబుతారు. ఇక ఈ తీర్పుపై అప్పీలు ఉండదు. అదే తీర్పు ప్రకారం ఇరు వర్గాలు నడుచుకోవాలి. కోర్టుకూ, లోక్‌అదాలత్‌కు వున్న ముఖ్యమైన తేడా ఇదే. కోర్టులో తీర్పు వస్తే పై కోర్టుకు అప్పీలు చేసుకోవచ్చు. ఇక్కడ అప్పీలు ఉండదు. కోర్టు ఉండగా లోక్ అదాలత్ ఎందుకంటారా? కోర్టుల్లో తెగని కేసులు ఇక్కడ తేలిగ్గా విడిపోతాయి. కోర్టులుం టాయి. కేసులు వేస్తారు. ఒక వ్యక్తి కోర్టుకు వెళ్ళి కేసు వేస్తే ప్రతివాది హాజరు అవుతాడు. ఇరు పక్షాలకు లాయర్లుఉంటారు. తగాదా పడే వాళ్ళు వారి లాయర్ల ద్వారా ఎదుటి వారిపై కేసులు నడిపిస్తారు. ఒకరికి తొందరగా తీర్పు రావాలని ఉంటే, ఇంకొకరికి ఆ తీర్పు ఎంత ఆలస్యంగా వస్తే అంత మంచిదని ఉంటుంది.

అలా..... అలా... నెలలు.... సంవత్సరాలు గడుస్తాయి. కేసు నడుస్తూనే ఉంటుంది. తీర్పు మాత్రం రాదు. రాదంటే... ఆలస్యంగా వస్తుంది.

అలాంటి పరిస్థితుల్లో గనుక వాది, ప్రతివాది ఇద్దరూ విసిగిపోయి రాజీ పడదలచుకుంటే వారు లోక్ అదాలత్ వద్దకు వెళ్ళవచ్చు. ఇద్దరూ కలిసి రాజీ ఒప్పందం ముసాయిదాను తయారు చేసి లోక్ అదాలత్‌కు సమర్పిస్తే దాని ప్రకారం ముసాయిదాను తయారు చేసి లోక్‌అదాలత్‌కు సమర్పిస్తే దాని ప్రకారమే తీర్పు రాస్తారు.

ఇక దానిపై అప్పీలు ఉండదు. వారి సమస్య శాశ్వతంగా పరిష్కార మవుతుంది.

లోక్ అదాలత్ ముందుకు అన్ని కేసులూ రావు. భార్యాభర్తల కేసులు రావు. ఒకవేళ వచ్చినా ఈ భార్యాభర్తల తగాదాలు ఒక పట్టాన పరిష్కారం కావు. సివిల్ తగాదాలు అనగా ఆస్తులకు సంబంధించిన కేసులు రావు. వస్తే కొన్ని మాత్రమే తీర్పులకు నోచుకుంటాయి. ఇలా చాలా కేసులు లోక్ అదాలత్ ముందుకు రావు.

మరి లోక్ అదాలత్ ముందుకు ఎక్కువగా వచ్చే కేసు లేమిటీ అంటే రోడ్డు ప్రమాదం కేసులు.

మోటారు వాహనాలు ప్రమాదానికి గురైనపుడు గాయపడిన వాళ్ళు, చనిపోయిన వారి రక్త సంబంధీకులు తమకు జరిగిన నష్టానికి, కష్టానికి ఆసుపత్రి ఖర్చులకు, చావు ఖర్చులకు, వాహనం పాడై పోయినందుకు, చేయి విరిగినందుకు, కాలు విరిగినందుకు డబ్బు రూపంలో నష్టపరిహారం కావాలని బీమా కంపెనీలపై కేసు వేస్తారు. యజమానులు ముందుగానే ప్రతి వాహనాన్ని బీమా చేస్తారు. ఒకవేళ ఆ వాహనం కారణంగా ఎవరికైనా ప్రమాదం జరిగితే బీమా కంపెనీయే నష్టపోయిన వారికి పరిహారం కోర్టు ద్వారా ఇస్తుంది.

రోడ్డు ప్రమాద బాధితులు కోర్టులను ఆశ్రయిస్తే వారికి నష్టపరిహారం రావటం అనేది వంద శాతం ఖాయం. రోడ్డు ప్రమాదం కేసులను కోర్టుల్లో వేసి గెలవటం లాయర్లకు తేలిక. డబ్బు రావటం సులభం. లాయర్లకు ఫీజులు దండిగానే వస్తాయి.

అందుకని లాయర్లే ప్రమాదం జరిగిన చోటుకి వెళ్ళటం "డబ్బులు ఇప్పిస్తాం, పర్సెంటేజి ప్రకారం ఫీజులు తీసుకుంటాం" అనటం గత ఇరవై ఏళ్ళ నుంచీ జరుగుతోంది.

ఈ తరహా కేసుల్లో బాధితుడు ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టకోనక్కర్లేదు. అడ్వకేట్ స్వయంగా కోర్టు ఫీజు కట్టి, ఇతర ఖర్చులు పెట్టి కేసు పూర్తయ్యే దాకా వాదిస్తాడు. ఉదాహరణకు అతనికి క్లయింటు కాలు తీసివేశారను కోండి కోర్టు ఆ కేసులో రెండు లక్షలు పరిహారం ఇస్తుంది. ఇందులో అడ్వకేట్ 30 శాతం ఫీజు తీసుకుంటే 60 వేలు వస్తుంది. అన్ని ఖర్చులు కలిపి 10 వేలు పోయినా ఒక్క రోడ్డు ప్రమాదం కేసులో 50 వేలు

ఫీజుగా వస్తుంది.

ఇదే రోడ్డు ప్రమాదం కేసులు లోక్‌అదాలత్ ముందుకొస్తే మూడు, నాలుగు నెలల్లో తీర్పు వస్తుంది. బాధితునికి నష్టపరిహారం వస్తుంది. అతని లాయర్‌కు భారీ ఫీజు వస్తుంది.

ఇదిగో, ఇదే విషయాలను ఆ విలేకరి రాసింది - ఆ విలేకరి ఏమని రాశాడు? లోక్ అదాలత్‌ల వల్ల రోడ్డు ప్రమాదాల బాధితులకు సత్వరం న్యాయం జరుగుతుంది. వెంటనే డబ్బు చెక్కు రూపంలో వస్తుంది. న్యాయవాదులు వున్నా ఒకటే, లేకున్నా ఒకటే, న్యాయవాదులు ఏ కేసులు వాదించినా ఒక పద్ధతి ప్రకారం ఫీజులు తీసుకోవాలి. అంతే తప్ప బాధితునికి వచ్చిన డబ్బులో 25 శాతం, 30 శాతం అంటూ ఫీజులు గుంజటం ఏమి న్యాయం? న్యాయవాదులు మోసం చేస్తున్నారు. దోపిడీ చేస్తున్నారు అంటూ... ఇంకా... ఇంకా ఏమేమోరాశాడు. అయితే అలా చేసేది కొద్ది మందే. కానీ అందర్నీ అలా నిందించరాదు కదా! ఆ విధంగా చేసిన వారి పేర్లను ఎందుకు రాయలేదు? జడ్జీలు మాత్రం ప్రజలకు చక్కగా న్యాయం చేస్తుండగా, న్యాయవాదులు కావాలని ప్రజలను దోపిడీ చేస్తున్నారా? అంటూ లాయర్లు అదే రోజున మీటింగ్ పెట్టారు.

వార్త రాసిన విలేకరిని, ఎడిటర్‌ను, ప్రింటర్‌ను దుమ్ముదులిపారు. ''ఇలారాస్తే సహించం'' అంటూ న్యాయవాదుల సంఘం తీర్మానించింది. లోక్ అదాలత్‌కు వెళ్ళం అన్నారు. లోక్ అధాలత్ లేకపోవడం వల్ల ప్రజలకే నష్టం అంటూ కారణాలు చూపించారు.

భారీ ఎత్తున మొదలైన లోక్ అదాలత్ వారోత్సవాలు ఒక్క వార్త కారణంగా ఆగిపోయాయి. ఎన్నో కేసులు పరిష్కారమై, ఎందరో ప్రజలకు సత్వర న్యాయం అందే అవకాశం జారిపోయింది. దీనికి కారణం న్యాయవాదులా? విలేకరా? వ్యవస్థా? ఏదీ కాదు. "నీకేసు చేస్తా. పర్సంటేజీ తీసుకుంటా. ఈ తెల్లకాగితాల మీద సంతకాలు పెట్టు చాలు" అంటూ వచ్చే లాయర్ అలా ఎందుకొచ్చాడో తెలుసుకోలేని బాధితుల అజ్ఞానమే దానికి కారణం. న్యాయం కావలసిన వాడు న్యాయవాదిని, అదీ మంచి న్యాయవాదిని ఎంచుకోవాలి. అంతే తప్ప లాయర్లే కేసులు చేస్తామంటూ వెళ్ళకూడదు. "నీ వద్దకు న్యాయవాది రాకూడదు. నీవే న్యాయవాది వద్దకు వెళ్ళాలి." ఈ సంగతిని ప్రజలంతా గుర్తించే దాకా పైన చెప్పిన సంగతులే మళ్ళీ మళ్ళీ జరుగుతుంటాయి. ☆

బలి వితర్ధి

(19వ పేజీ తరువాయి)

పోట్రవుతులు తలిగే అవకాశముంది..."

పోట్రవుతులేం... కర్మ? హోట్రవుతులే తగులుతున్నాయి.. అంతకంటే పెద్ద పెద్ద బండరాళ్లే తగులుతున్నాయి... ఎన్ని ఎదురు దెబ్బలు? ఎంత స్ట్రగుల్..? ఎన్ని అవమానాలు...? స్ట్రగుల్... స్ట్రగుల్... స్ట్రగుల్... ఫారెగ్జిస్టెన్స్... స్ట్రగుల్ ఫర్ లివ్లీహుడ్ ... ఆత్మన్యూనతా భావంతో స్ట్రగుల్... ఆధిక్యతా భావంతో స్ట్రగుల్... వివక్షతతో స్ట్రగుల్.. స్ట్రగుల్... స్ట్రగుల్...

"రోడ్ల మీద పోట్రవుతులెక్కడియయ్యా? ఇదేమన్నా మట్టి నేలనుకుంటున్నావా?"

"నడిచేప్పుడయినా ఆలోచించడం మానండి సార్...."

ఎలా మానుకొమ్మంటావయ్యా...! ప్రమాదం అంచున ప్రపంచముంటే...? విలువలు, మానవ సంబంధాలు తుత్తునియలై పోతుంటే....! అణు విస్ఫోటనాలు... బాంబుపేలుళ్ళు... రక్తపాతం... భూగోళంపై మనిషి చిరునామే లేకుండా చేసే చర్యలు.. అన్నీ ధ్వంసమవుతుంటే...! ప్రపంచాన్ని పీడిస్తున్న భయంకర వ్యాధులు.. ఎయిడ్స్.. శరీరంలోని రోగనిరోధక శక్తిని తగ్గించి మనిషిని నిర్వీర్యుణ్ణి చేసి మరణం అంచులకు తీసుకువెళ్ళే ఎయిడ్స్... భయంకర వ్యాధులను నిరోధించడానికి మందులు... ప్రపంచ **శాంతి** కోసం మందులు.. మానవ సంబంధాలను పెంపొందించడానికి మందులు... ఇవేవీ లేవు కదా...! ప్రపంచం విధ్వంసం వైపు వయనిస్తుంటే ఆలోచించకుండా ఎలా ఉండమంటావు...?

అనాలనుకున్నావు... కాని పైకన్లేవు... అంటే నిన్నో పిచ్చివాడిగా జమకడ్తారని నీకు తెలుసు...

"ఆలోచిస్తూ నడిస్తే ఏమవుతుందంటావు...? ఆక్సిడెంటవుతుందనే కదా నీ ఉద్దేశం...! ఎప్పుడో ఓసారి రోడ్డు ప్రమాదంలో జగన్మోహన్ మృతి అన్న అక్షరాలు వార్తా పత్రికల్లో పడక తప్పవంటావు... అంతేనా..." "సార్...! అలా ఎందుకంటారు సార్... మీ పిల్లలు చిన్న వాళ్ళే... ఇంకా చదువులే పూర్తి కాలేదు..."

అంటూ వెళ్ళి పోయాడతను...

నడుస్తున్నావు నువ్వు... ఏదేదో ఆలోచిస్తూ నడుస్తున్నావు.. నువ్వు చేరుకోవాల్సిన కళాశాల దగ్గర్లోనే ఉంది...

సుఖం... సుఖం... నిధి.. స్త్రీ... సౌఖ్యం సుఖాలా...? అవి ధర్మబద్ధమైనప్పుడే సుఖాలు..

పరిమితమైన నిధి సుఖం... ధర్మబద్ధంగా సంపాదించిన నిధి సుఖమే... అక్రమార్జన దుఃఖహేతువే.. కటకటాల పాల్జేస్తుంది...

ఆలుమగల మధ్య ధర్మబద్ధమైన కామం సుఖం... అక్రమ సంబంధం దుఃఖహేతువు... తత్ఫలితమే ఎయిడ్స్... ప్రాణాంతకం...

"సార్... మీకోసమే ఎదురు చూస్తున్నాం.. వచ్చేసారా...?"

ప్రిన్సిపాల్‌గారెదురొచ్చారు.

వస్తున్నాను.. వస్తున్నాను.. వచ్చేసాను కదా..!

చేతికున్న గడియారం దిక్కు చూసుకున్నావు నువ్వు...

"మీరిచ్చిన సమయానికి ఇంకో ఐదు నిమిషాలుంది..."

"జగన్మోహన్‌గారు పంక్చువల్... ఆలస్యంగా రావడమాతని కిష్టముండదు..."

తెలుగు ఉపన్యాసకుడువాచ...

ఇంటర్ విద్యార్థుల వీడ్కోలు సభ...

సభ ప్రారంభమైంది.

ఒక్కో విద్యార్థి భవిష్యత్తులో తానేం చేయబోతున్నాడో, ఏం కాబోతున్నాడో చెబుతున్నాడు..

"నేను బాగా చదువుకొని కంప్యూటర్ ఇంజనీర్‌నవుతాను.. బాగా సంపాదిస్తాను... అమెరికా పోతాను..."

"నేను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్నై స్టేట్స్ కెళ్తాను."

''నేను డాక్టర్నై విపరీతంగా డబ్బు సంపాదిస్తాను..."

"నేను సంపాదనలో బిలిగేట్స్ నాదర్శంగా తీసుకుంటాను..."

"నేనేం చదివినా వ్యాపారం చేస్తాను.. ప్రేమ్‌జీ మార్గంలో నడుస్తాను..."

"ప్రపంచ ధనవంతుల్లో ఒకణ్ణి కావడం నా జీవిత ధ్యేయం..."

భావి భారత పౌరులు తమ జీవిత లక్ష్యాలను వివరిస్తున్నారు. ఎలాంటి మాథమెటిక్స్ సమస్యనైనా కాలిక్యులేటర్ కంటే వేగంగా చేసేవాళ్ళు... ఫిజిక్స్ కెమిస్ట్రీలను ఔపోసన పట్టిన వాళ్ళు... ఇంటలిజెంట్స్ ఎంతోమంది...

వాళ్ళంతా నిధి చాలా సుఖమంటున్నారు.. అపరిమితంగా నిధి సంపాదిస్తామంటున్నారు.. అందుకోసం దేశాన్నే వదిలిపోతామంటున్నారు... వాళ్ళలో ఒక్కరు కూడా గాంధీని, లింకన్‌ను, మదర్ థెరిస్సాను ఆదర్శంగా తీసుకోలేదు. దాదాపందరికీ బిల్‌గేట్స్ ఆదర్శం...

భావిభారత పౌరుల మాటలు వింటుంటే తేళ్ళు జెర్రులు పాకినట్టవుతుంది నీకు... అందరు మాట్లాడటమయిపోయింది.

"మన ముఖ్య అతిథిగారైన ప్రముఖ రచయిత జగన్మోహన్‌గారు తమ సందేశాత్మక ఉపన్యాసం ఇస్తారు..." అని కూర్చున్నాడు ప్రిన్సిపాల్.

లేచి నిల్చున్నావు నువ్వు...

మాట్లాడటం మొదలు పెట్టావు..

"ఈ కళాశాల మంచి పేరున్న కళాశాల... ఈ కళాశాలతో పాటు పేరున్న మంచి కాలేజీలన్నీ ఇంజనీర్లను, టెక్నోక్రాట్లను, డాక్టర్లను, డబ్బు సంపాదనా పరులను తయారు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాయి... ఆ విషయంలో పోటీపడి పని చేస్తున్నాయి. అందులో ఎంతో కొంత విజయాన్నీ సాధిస్తున్నాయి. చదువు లక్ష్యం కూడా అదే అయింది. జీవిత లక్ష్యమూ, చదువు లక్ష్యమూ డబ్బు సంపాదన వైపే సాగుతున్నాయి... అందుకోసం మనం భవిష్యత్తులో గొప్ప గొప్ప టెక్నికల్ ఎక్స్‌పర్ట్‌లను, సైంటిస్టులను చూస్తాం కాని గొప్ప ఆదర్శవంతులైన రాజకీయ నాయకులను చూడం. బిల్‌గేట్స్‌లను చూస్తాం కాని లింకన్‌లను చూడం... గాడ్సేలను చూస్తాం కాని గాంధీలను చూడం.. దుర్మార్గపు రాజకీయాలను, డబ్బు సంపాదనా పరులను చూస్తాం కాని థెరిస్సాలను చూడం. గొప్ప రచయితలల్ని, తత్వవేత్తల్ని అసలే చూడం.. ఆదర్శాలూ, ఆశయాల్లు పిచ్చివాళ్ళ ప్రేలాపనల్లానే కనబడతాయి. మనం డబ్బు మనుషులను చూస్తాం కాని మానవులను చూడం..

ఎయిడ్స్ భయంకరమైన వ్యాధి. ఒకరకమైన వైరస్ వ్యాప్తి చెందడం వల్ల ఈ వ్యాధి సోకుతుంది. అయితే ఎంత భయంకరమైన వ్యాధయినా దీన్ని అరికట్టడం సాధ్యమే.. భవిష్యత్తులో మందులూ వస్తాయి.... కాని ఈ రోజు ప్రపంచాన్ని ఎయిడ్స్‌ను మించిన ప్రమాదకరమైన వ్యాధి ముంచేస్తుంది. అది ప్రపంచ మానవాళినే 'బలివితర్ధి' మీద నిలబెడుతుంది. దానిపేరే నిధి వ్యాధి... డబ్బు వ్యాధి... అది మనిషిని మనిషి కాకుండా చేస్తుంది.. మానవత అనే రోగనిరోధక శక్తిని హరించి వేస్తుంది. మనిషిని నిర్వీర్యుణ్ణి చేస్తుంది. మనుషుల మధ్య దూరాన్ని పెంచుతుంది. మానవ సంబంధాలన్నిటినీ డబ్బు సంబంధాలుగా మారుస్తుంది.. మానవత్వాన్ని కబళించి వేస్తుంది.

మనమిప్పుడు చేయాల్సింది బలిపీఠం మీద నిల్చోనున్న మానవ జాతిని రక్షించడం... అందుకు తగిన మందు కావాలి.. ఆ మందు కనుక్కొనే డాక్టర్లు మీలోంచి రావాలి... ఆ మందు మానవత్వాన్ని పరిమళింప చేయాలి.. ప్రపంచ పౌరులంతా సుఖ సంతోషాలతో శాంతి సౌభాగ్యాలతో బతకడానికామందు ఉపయోగపడాలి...

మరి కొన్నేండ్లలో జీవితంలో స్థిరపడబోతున్న భావి భారత పౌరులైన మీపై నా మాటల ప్రభావం ఏ మేరకు పడినా మంచిదే..."

అని ముగించావు నువ్వు...

అందరినీ గమనించావు..

నీ ఉపన్యాసం విన్న కొందరు ముఖం మాడ్చుకోవడమూ గమనించావు. కొంతమంది విద్యార్థుల మనసుల్లో అలజడి రేగడమూ గమనించావు. నీ భావాలను విప్పిచెప్పిన నీ మనసిప్పుడు తేలికయింది. ☆

కొండబాబు

గడసరి!

"ఊర్మిళ ఉత్తరం రాసింది" భర్త రామం ఇంట్లోకి వస్తుండగానే చెప్పింది జానకి.

రామం భార్యవైపు బాధగా చూశాడు. "ఏమి రాసింది?' అన్నాడు. ఏమి రాస్తుందో తనకు తెలిసినా.

" మామూలే... లక్ష్మణ్ గురించి" చెప్పింది.

రామం నీరసంగా సోఫాలో కూర్చుండిపోయాడు. తమ్ముడు, మరదలి వ్యవహారం సమస్యయింది తనకు. లక్ష్మణ్ తొలుత బాగానే ఉండేవాడు. ఎలా అలవాటయిందో ఆల్కహాల్ అలవాటయింది. అప్పట్నుంచి గొడవలు. ఊర్మిళ మెతక. తొలిరోజుల్లో భర్తను కనీసం మందలించలేకపోయింది. ఇప్పుడు అతగాడి తాగుడికి ఇల్లు గుల్లవుతోంది. మొత్తం జీతం దానికే తగలేస్తున్నాడు. ఊర్మిళకు తన పుట్టింటివారి కంటే బావ రామం మీదే గురి. అందుకే తన భర్తతో వచ్చే సమస్యలను బావకూ, తోడికోడలుకే రాస్తుంటుంది. అప్పుడప్పుడు ఆ ఊరు వెళ్ళి వస్తుంటారు వాళ్ళు. లక్ష్మణ్‌ను మందలిస్తారు. అన్నమాట జవదాటనట్లే. ఆ రెండురోజులూ ప్రవర్తిస్తాడు లక్ష్మణ్. తర్వాత మామూలే. ఈ మధ్య ఆఫీసుపని ఒత్తిడితో తను వెళ్ళలేకపోతున్నాడు. ఆ మాటే భార్యతో చెప్పాడు బాధగా.

"వీలుచూసుకుని వెళ్ళిరండి.. అతగాడి అలవాటుకి ఈ పిల్ల బలవుతోంది. ఎంతగా చిక్కిపోయిందో.." అంది బాధగా తోడికోడల్ని తలుచుకుంటూ.

" ఏం చేద్దాం? తప్పదుగా" అన్నాడు రామం

" అసలు ఊర్మిళదే తప్పంతా. తను గడసరిగా ఉంటే, మొదట్లోనే దారికొచ్చేవాడు. ఇంతగా ఏకుమేకయ్యేవాడు కాదు" అంది.

" వాడి అలవాటు మాన్పించడానికి అవసరమైతే డాక్టర్ని కలుద్దాం ఈసారి" అన్నాడు రామం సమస్యను పూర్తిగా పరిష్కరించాలన్న ధోరణితో.

" ఆ పని మంచిది" అంది జానకి.

☆ ☆ ☆ ☆

ఈ సంభాషణ చాలా సర్వసాధారణమైనది. ఇందులో ప్రత్యేకమైన పదాలేమీలేవుగా అనిపిస్తోంది కదూ! నిజమే. కాని మామూలుగా ఉండే పదాలకే ప్రత్యేకించిన అర్థం ఉండటం సాధారణం. అలాంటి ఒక పదమే జానకి మాటల్లో వచ్చిన 'గడసరి' అనే పదం. గడసరి అంటే ఏమిటీ? ఆ పదం ఏభాష నుంచి వచ్చింది. ఎలా ఏర్పడింది– ఇలా పరిశీలించితే ఆసక్తికరమైన అంశాలు తెలుస్తాయి. తగిన నేర్పు, లౌక్యం, ధైర్యం ప్రదర్శించి ఏ పనినైనా చేయగలిగిన వారిని సాధారణంగా గడసరి వాళ్ళు అంటుంటాం. మాటల్లో కూడా కిందపడినా పైనేనని ఒప్పించి, ఎదుటి వ్యక్తిని దారికి తేగలగడాన్ని గడసరితనమే అంటారు. ఇలా చెప్పడం కంటే 'గడసరితనం' అని సూటిగా ఆ పదాన్ని చెపితేనే అది ఏ భావాన్ని వ్యక్తీకరిస్తుందో తెలుస్తుంది. మనకు తెలిసిన అలాంటి వ్యక్తితో సహా మనకు సోదాహరణంగా అర్థమౌతుంది. పురాణాల్లో 'సత్యభామ' గడసరిగా కనిపిస్తుంది. శ్రీకృష్ణుడు గడుగ్గాయే కదా! అర్థం అర్థమైంది కదా! ఈ పదం ఏభాషదో చెప్పాల్సివస్తే. సంస్కృతం కాదు. ఇంకా ఏ అన్యభాషా పదమూకాదు. దేశీయమే. అచ్చ తెలుగే. ఇది ఏర్పడిన తీరు మాత్రం ఇతమిద్ధంగా చెప్పలేము. అయితే భాషావేత్తలు ఒకలాగా ఊహిస్తున్నారు. అదే చెప్పుకుందాం.

పూర్వం, ఈనాడు కొన్ని పల్లెప్రాంతాల్లోనూ గారడీ ఆటలు, కొన్ని రకాలైన సాహసోపేతమైన ప్రదర్శనలు ప్రదర్శించేవారు. తెలుగునాట ఒక కులం వారు ప్రదర్శించే ఇలాంటి ఆటను ఆ కులం పేరుతోనే పలుకుతారు.

ఈ ఆటలో పురుషుడు డప్పు కొడుతూ ఆట చూడడానికి జనాన్ని ఆకర్షిస్తుంటాడు. స్త్రీ ప్రదర్శనిస్తుంది. రెండు వెదురు గడలను దూరంగా పాతి వాటికి తీగను కడతారు. ఆ యువతి ఒక గడను చేతితో పట్టుకుని సరి(బ్యాలెన్సు) చూసుకుంటూ ఆ తీగపై అలవోకగా నడుస్తుంది. ఇదే ఆ ప్రదర్శన. కూటి కోసం కోటి విద్యలు కదా!

ఆ గడను సరిచూసుకునే యువతి నేర్పరితనమే 'గడసరితనం'. అలాంటి నేర్పరితనాన్ని ప్రదర్శించే వ్యక్తి గడసరి. అదీ సంగతి. ఎంత గడసరిదీ ఈ పదము! ☆

పాఠక స్పందన

కవర్ స్టోరీ బాగుంది

23-9-2001 ఆదివారం అనుబంధంలోని కవర్ స్టోరీ 'సామాజిక స్పృహ కోల్పోతున్న యువత' బాగుంది. కొండబాబు గారు అందిస్తున్న పలుకుబడి ప్రయోజనకరంగా వుంది. అమెరికా ఘటనపై కథనం అన్ని పత్రికల కన్నా ముందుగా ప్రచురించడం ప్రశంసనీయం.

– అమ్మిన శ్రీనివాసరాజు, చర్ల, ఖమ్మం జిల్లా

కథ బాగుంది

23-9-2001 ఆదివారం అనుబంధంలోని డాక్టర్ దేవరాజు మహారాజుగా కలం నుండి జాలువారిన 'బిచ్చగాళ్ళ ఊరేగింపు' కథ నేటి వాస్తవ సంఘటనలకు దగ్గరగా వుంది. అలాగే కవర్ స్టోరీ అందరినీ ఆలోచింప చేసేదిగా వుంది. ఈ వారం టూరిస్ట్ గైడ్‌లో 'ప్రాచీన చరిత్రను కళ్ళకు కట్టే కరీంనగర్' మాకు తెలియని విషయాలెన్నింటినో తెలియ చేసింది.

– కొత్తపల్లి శ్రీవెంకటరమణ, పెద్దపళ్ళ, తూ.గోదావరిజిల్లా

రియల్ స్టోరీ సంతోష పరిచింది

సెప్టెంబర్ 23 ఆదివారం అనుబంధంలో ప్రచురించిన 'ఆనాడు గన్నవరంలో సి.పి.ఎం. చౌకడిపోలు' వ్యాసం మా హృదయాలను సంతోష పరిచింది. 1970లోనే సి.పి.ఎం. చౌక డిపోలు ఏర్పాటు చేసి ఒక రూపాయికి కిలో బియ్యం అందించిందంటే ఆ పార్టీ పేదలను, రైతులను ఎంతగా ఆదుకుందో అర్థమవుతుంది. ప్రభుత్వం కన్నా చాలా తక్కువ ధరకు అందించటం గొప్ప విషయం.

– మండల సదాశివ, యాదగిరి, గోపి, కృష్ణహరి, బాలాజీ, సుభాష్, హుజూరాబాద్, నల్గొండ జిల్లా

కవర్ స్టోరీ బాగుంది

నేటి యువత సామాజిక స్పృహ కోల్పోతున్న తీరును ఈ వారం కవర్ స్టోరీ చక్కగా వివరించింది. కార్టూన్ కదంబం బాగుంది. విభిన్న శీర్షికలతో ఇంటిల్లిపాదిని అలరిస్తున్న ఆదివారం ప్రజాశక్తికి ధన్యవాదాలు

– బట్టా రామకృష్ణ, సౌత్ మోపూరు, నెల్లూరు జిల్లా

మనలోమాట బాగుంది

16వ తేదీ అనుబంధంలోని పరిచయాలు – స్నేహాలు గురించి అందించిన విషయాలు అక్షర సత్యాలు. కవర్ స్టోరీ బాగుంది. అదాలత్ కథ వరకట్న కేసులో శిక్షపడాలంటే ఆలోచనాత్మకంగా వుంది.

– ఆనందగజపతిరావు, తెట్టంగి, శ్రీకాకుళం జిల్లా

శ్రీ భ్రమరాంబా మల్లిఖార్జునస్వామి వార్ల దేవస్థానం



శాశ్వత అన్నదాన పథకం

ప్రయాగే లక్షభోజ్యం స్యాత్ సమం
కాశ్యాం ద్విలక్షకమ్ గంగాయాం
సప్తలక్షం చగ్రాసమేకం తు శ్రీగిరౌ॥

" ప్రయాగలో లక్షమందికి కాని, కాశిలో రెండు లక్షలమందికి కాని, పవిత్ర గంగానది ఒడ్డున ఏడు లక్షలమందికి కాని అన్నదానం చేస్తే ఎంత పుణ్యమో శ్రీశైల మహాక్షేత్రంలో ఒక్కరికి చేసే అన్నదానం అంతటి పుణ్యాన్ని కలిగిస్తుంది' ' అని పురాణాలు చెబుతున్నాయి.

అన్ని దానాల కంటే అన్నదానం చాలా గొప్పది. మన భారతీయ సంస్కృతిలో అన్నదానం చేయడమనేది కేవలం ఒక సేవగానే కాకుండా ఒక పవిత్ర సంప్రదాయంగా భావించబడుతోంది. అన్నదానం చేసినవారు దైవంతో సమానులని మన భావన. సకల లోకారాధ్యమైన శ్రీశైల క్షేత్రాన్ని దర్శించే యాత్రికులకు ఉచితంగా రుచికరమైన భోజనాన్ని అందించాలనే సంకల్పముతో దేవస్థానం శాశ్వత అన్నదాన పథకాన్ని దాతల సహకారంతో నిర్వహిస్తున్నది.

మీ కోసం మీ తోటి యాత్రికుల కోసం దేవస్థానంచే నిర్వహింపబడుతున్న ఈ అన్నదాన పథకంలో మీరూ సభ్యులుగా చేరండి.

ఈపథకంలో: దాతలు కనీసం రూ. 1,116.00 ఆపై ఎంత మొత్తమైన చెల్లించి సభ్యులుగా చేరవచ్చు.
దాతలు చెల్లించిన ఈ పైకాన్ని జాతీయ బ్యాంకులందు ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా జమచేసి సదరు మొత్తముపై వచ్చే వడ్డీతో సంవత్సరంలో దాత కోరుకున్న రోజున శాశ్వతంగా ప్రతి సంవత్సరం అన్నదానం జరిపించబడుతుంది.
మీరు చెల్లించదలచిన మొత్తమును కార్యనిర్వహణాధికారి, శ్రీశైలం దేవస్థానం, శ్రీశైలం - 518 101, కర్నూలు జిల్లా పేరున ఆంధ్రాబ్యాంక్/స్టేట్‌బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్, శ్రీశైలం శాఖనందుగానీ లేదా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, శ్రీశైలం, ప్రాజెక్టు టౌన్‌షిప్ శాఖ నందు కాని చెల్లించబడునట్లుగా డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా పంపగలరు.

శ్రీశైలక్షేత్రంలో అన్నదానం చేయండి
తరతరాలుగ తరగని పుణ్యాన్ని సంతరించుకోండి

ఇతర వివరములకు:- కార్యనిర్వహణాధికారి, శ్రీశైల దేవస్థానం, శ్రీశైలం - 518 101, కర్నూలు జిల్లా
ఫోన్: 08524 - 87130, 87159, ఫ్యాక్స్: 08524 - 87126

సి.ప్రేమ్‌కుమార్, బి.ఏ.బి.ఎల్.,
కార్యనిర్వాహణాధికారి & జాయింట్ కమీషనర్.

SAPTHAGIRI GREEN CITY RESIDENCY

Dreams no longer remain Dreams with "Green City Housing Pvt. Ltd." Here is a chance for you to have a suitable plot at "Sapthagiri Green City Residency" to Have Your Dream House at affordable Price.

The perfect pair aims for a perfect place



Prestigious Project near by our Venture:

★ International Airport in 5000 acres with Rs. 5000 crores. ★ Hardware park in 5000 acres. ★ Amusement Park in 1000 acres. ★ Software Project with Rs. 440 crores in 300 acres. ★ International Covention Centre Complex (ITCC) in 250 acres. ★ Proposed Videocon's 150 Crore Project.

- **Plots available in 55 easy instalments scheme.**
- **Out-right purchase 10% Discount.**
- **100% clear title and immediate registration each plot 200 Sq. yards.**
- **Plots laid out as per vaastu.**
- **A well laid network of 50 and 40 feet wide black topped roads and 33 feet wide metal raods.**
- **Local telephone and cell phone area.**

K.V. SUDHAKARA RAJU
M.A., B.Ed.
Chairman & Managing Director.

For Further Details Contact:

GCH

Green City
Housing Pvt. Ltd.

Where Customer Satisfaction is a matter of pride.

201, 2nd Floor, Siri Malle Towers, Maths Nagar, Opp: Kanthi Sikhara Apts., Somajiguda, Hyderabad - 500 082. Ph: 040-66374 45/ 46 / 47, Cell: 98491-28827, 98490-17173.